WWW.nindam.co.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

గురువారం, సెప్టెంబర్ 05, 2024 | సంపుటి - 20 | సంచిక 355 | వెల - 7 | పేజీలు - 12

Published from Hyderabad and Vijayawada Circulated in TS and AP from Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Anantapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam




## షాట్ పుట్‌లో సచిన్‌కు రజతం

### పారాలింపిక్స్‌లో భారత క్రీడాకారుల పతకాల వేట..

పారిస్ వేదికగా జరగుతున్న పారాలింపిక్స్‌లో బుధవారం భారత్ ఖాతాలో మరో పతకం చేరింది. షాట్ పుట్ ఎఫ్46 విభాగంలో సచిన్ సర్జేరావు ఖిలారీ రజతం సాధించాడు. సచిన్ 16.32 మీటర్లు షాట్ పుట్‌ను విసిరి రెండో స్థానంలో నిలిచి పతకాన్ని సాధించాడు. దీంతో ఈ పారాలింపిక్స్‌లో భారత్ జాబితాలో 21 పతకాలు చేరాయి. భారత అథ్లెట్లు మూడు స్వర్ణాలు, ఎనిమిది రజతాలు, 10 కాంస్య పతకాలు సాధించారు. ఇక పతకాల పట్టిక జాబితాలో భారత్ ప్రస్తుతం 19వ స్థానానికి చేరింది.

## అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం

### ముగ్గురు హైదరాబాదీల దుర్మరణం

**హైదరాబాద్, నినాదం:**

అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు హైదరాబాద్ వాసులు మరణించారు. టెక్సాస్ రాష్ట్రంలోని అన్నాలోని రోడ్డు నంబర్ 75లో శుక్రవారం వరుసగా 5 వాహనాలు ఒకదానికొకటి అతి వేగంతో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురు భారతీయులు దుర్మరణం చెందారు. మృతులను హైదరాబాద్‌కు చెందిన ఓరంపాటి ఆర్యన్ రఘునాథ్, ఫారూక్ షేక్, పాలచర్ల లోకేశ్, తమిళనాడుకు చెందిన దర్శిని వాసుదేవన్‌గా గుర్తించామని అక్కడి అధికారులు వెల్లడించారు.




### హైడ్రా పేరుతో బెదిరిస్తే

## కఠిన చర్యలు

- వసూళ్లకు పాల్పడితే నేరుగా జైలుకే పంపిస్తాం
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరిక
- అమీన్‌పూర్‌లో బెదిరింపులకు పాల్పడ్డ వ్యక్తి అరెస్ట్

**హైదరాబాద్,సెప్టెంబర్4(నినాదం):**

హైడ్రా పేరుతో బెదిరింపులు, వసూళ్లకు పాల్పడితే జైలుకు పంపిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. సామాజిక కార్యకర్తల ముసుగులో బిల్డర్లను బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. హైడ్రాలో ఉన్నతాధికారులతో పరిచయాలు ఉన్నట్లు బెదిరిస్తున్నారని చెప్పారు. తమ విభాగాన్ని నీరుగార్చే ప్రయత్నాలు, తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హైడ్రా పేరుతో డబ్బు కావాలని ఒత్తిడి చేస్తే స్థానిక పోలీస్‌స్టేషన్, ఏసీబీకి ఫిర్యాదు చేయాలని రంగనాథ్ సూచించారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో డబ్బు వసూళ్లకు పాల్పడిన విప్లవ్‌ను పోలీసులు అరెస్ట్ చేసినట్లు చెప్పారు.



02

## హైడ్రా పేరుతో లంచాలు అడిగితే..

## ఎసిబికి ఫిర్యాదు చేయండి

### బెదిరింపులకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తాం

### ఎసిబి డిజి సివి ఆనంద్ హెచ్చరిక

**హైదరాబాద్, నినాదం:**

హైడ్రా పేరు చెప్పి లంచాలు వసూలు చేస్తే చర్యలు తప్పవన్న ఏసీబీ డీజీ సివి ఆనంద్ గట్టిగా హెచ్చరించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... హైడ్రా పేరుతో కొందరు ప్రైవేటు , ప్రభుత్వ అధికారులు పాత నోటీసులు ఇస్తున్నారన్నారు. ఫిర్యాదులను సాకుగా చూపి ప్రజల నుంచి లంచాలు డిమాండ్ చేస్తుట్లు తమ నోటీసుకి వచ్చిందన్నారు.

02

# రగులుతున్న జైనూరు..

## ఉద్రిక్తంగా ఏజెన్సీ



### నీలంబాయి ఘటనపై ఆదివాసీల ఆగ్రహం

### ఓ కాలనీలోని వాహనాల ధ్వంసం, ఇండ్లకు నిప్పు

- మత ఘర్షణలకు అవకాశం • 144 సెక్షన్ విధింపు • రంగంలోకి కేంద్ర బలగాలు



తీవ్రంగా గాయపడిన మహిళ

**(స్టేట్ బ్యూరో - నినాదం)**

రోడ్డు ప్రమాదంలో ఆదివాసి మహిళలకు తీవ్ర గాయాలైన సంఘటన చిలికిచిలికి ఘర్షణలకు దారితీస్తున్నది. అత్యాచార ప్రయత్నం చేసి చంపడానికి రాడ్ తో దాడి చేసినట్లుగా బాధితురాలు చికిత్స పొందుతూ విచారణలో చెప్పడంతో ఆదివాసీల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఓ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఈ ఘటనకు పాల్పడడంతో ఇది మరింత రాజుకుంది.బుధవారం జైనూరు మండల బందుకు పిలుపునిచ్చిన ఆదివాసీలు.., ఆ సామాజిక వర్గ కాలనీలో విధ్వంసం సృష్టించారు. నిందితుని ఇంటితో పాటు ఆ సామాజిక వర్గానికి చెందిన వారి ఇండ్లను, ఆస్తులను, వాహనాలను ధ్వంసం చేశారు. కొన్ని వాహనాలకు నిప్పు పెట్టారు. ప్రస్తుతం పోలీసు గుప్పిట్లో ఉన్న జైనూరులో 144 సెక్షన్ విధించారు. ఈ సంఘటనలు మత ఘర్షణలకు దారి తీసే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది.

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనురు మండల కేంద్రంలో హత్యాచార ఘటన నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆదివాసి గిరిజనులు ఏజెన్సీ ప్రాంతాల్లో బందుకు పిలుపునిచ్చారు. జైనూరు సమీప ఏజెన్సీ ప్రాంతాలలో బందు సంపూర్ణంగా జరిగింది. జైనూర్ లో పరిస్థితులు అదుపు తప్పేట్టుగా ఉండడంతో జిల్లా ఎస్పీ డివి శ్రీనివాస రావు స్వయంగా రంగంలోకి దిగారు.కొన్ని రోజుల క్రితం గిరిజన ఆదివాసి మహిళపై ఓ వ్యక్తి అత్యాచారం,హత్య చేయడానికి ప్రయత్నించగా, పోలీసులు నిందితుడు షేక్ మగ్దూం ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

2లో..

### జులుం వల్లనేనా...?

కాగా వేరే ఇతర ప్రాంతాల నుండి ఇక్కడికి వచ్చి, ఇక్కడ స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని ఆదివాసి గిరిజనులపై జులుం చేస్తున్నారని భావిస్తున్న ఆదివాసీల మనసుల్లో ఈ సంఘటనతో ఆగ్రహం పెల్లుబికింది. ఓ వర్గం వారిపై, వారి దుకాణ సముదాలపై దాడులు చేసి, వారికి చెందిన ద్విచక్ర వాహనాలను, కార్లను ధ్వంసం చేశారు. కొంత కాలంగా ఉప్పు నిప్పులా ఉన్న ఈ రెండు సామాజిక వర్గాల మధ్య నీలం బాయి సంఘటన మంటలు తెప్పించిందని చెప్పవచ్చు.

### ముంచుకొస్తున్న

## ప్రమాదం

- వరవళ్ల తొక్కుతున్న వరద గోదావరి
- లోతట్టు ప్రాంత వాసుల తరలింపు



6లో..

**మణుగూరు, సెప్టెంబర్ 4(నినాదం):**

పినపాక నియోజకవర్గం వర్గంలో వరద గండం నుంచి ఇప్పుడిప్పుడే కోరుకుంటున్నా ప్రజలకు మరల వరద గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో మరో ప్రమాదం పొంచి ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. నియోజకవర్గం అనుసంధానం చేస్తూ ప్రవహించే గోదావరి నది ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు భారీగా రావడంతో భద్రాచలం మణుగూరు ప్రాంతాల్లో గోదావరి 45 అడుగులకు చేరుకుంది. అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. సమాచారం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖల అధికారులను అలర్ట్ చేస్తూ లోతట్టు ప్రాంతా లో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

### మేడారం అడవుల్లో టోర్నడోల

## బీభత్సం

### 50 వేలకు పైగా చెట్లు నేలమట్టం



వివరాలు 2లో..

## భర్తీ చేసేదెప్పుడో..?

- పెద్దపల్లి జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తం
- 66 టీచర్, 208 హెల్పర్ పోస్టులు ఖాళీ
- 12 చోట్ల కేంద్రాలు మూత



గుమ్మూర్ అంగన్వాడి కేంద్రం



శ్రీరాంనగర్ అంగన్వాడి కేంద్రం

**పెద్దపల్లి ప్రతినిధి(నినాదం):**

మంథని మండలం గుమునూర్ అంగన్వాడీ కేంద్రం భవనం ఇది. శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో ఉంది. ఇక్కడ ఏడాదికాలంగా టీచర్, హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇద్దరూ లేకపోవడంతో అంగన్వాడి కేంద్ర మూతపడింది. ఈ సెంటర్ పరిధిలోని గర్భిణీలు బాలింతలు, పిల్లలకు లక్ష్మీపూర్ అంగన్వాడి టీచర్ ద్వారా సరుకులు పంపిణీ చేయిస్తున్నారు.

మంథని మండలం శ్రీరామ్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో టీచర్ హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 65 ఏళ్లు నిండిన కారణంగా ఇద్దరు జులై ఒకటి నుంచి సేవలకు దూరమయ్యారు. అప్పటి నుంచి కూచిరాజుపల్లి టీచర్ శోభారాణి ఇన్చార్జిగా ఉన్నారు. ▸▸తరువాయి2లో

## కెసిఆర్‌లా ఫామ్‌హౌస్‌లో కూర్చోలేదు

- వరదల్లో ప్రజలను ఆదుకునేందుకు వెళ్లాం
- బిఆర్ఎస్ విమర్శలపై మంత్రి పొంగులేటి ఎద్దేవా
- మృతి చెందిన తండ్రీ కూతుళ్లకు నివాళి.. చెక్ అందచేత
- వరదలతో రైతులకు తీరని నష్టం
- నష్టాన్ని అంచనా వేస్తున్నాం
- బాధితులను అందరినీ ఆదుకుంటున్నాం
- పలు ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి పొంగులేటి

వివరాలు 2లో..



## సింగపూర్ చేరుకున్న ప్రధాని

### రెండ్రోజులపాటు పర్యటించనున్న మోడీ

**న్యూఢల్లీ, నినాదం:**

భారతదేశం ఎల్లవేళలా సముచిత, ఆదర్శనీయ పెట్టుబడుల విడిది అవుతుందని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారు. మిత్రదేశం సింగపూర్‌లో రెండు రోజుల పర్యటనకు ప్రధాని మోడీ బుధవారం ఇక్కడికి వచ్చారు. ఇండియా సింగపూర్ వ్యూహాత్మక భాగస్వామ్యం, స్నేహం మరింత ఇనుమడిరప చేసుకునేందుకు మోడీ ఈ పర్యటన తలపెట్టారు.

▸▸తరువాయి2లో..

## వరద బాధితులకు బిఆర్ఎస్ సాయం

- ఎమ్మెల్సీలు,ఎమ్మెల్యేల ఒకనెల వేతనం విరాళం
- పార్టీ అధినేత కెసిఆర్ ఆదేశాలతో నిర్ణయం
- సిద్దిపేటలో వెల్లడించిన హరీష్ రావు

**సిద్దిపేట, నినాదం:**

బీఆర్ఎస్ నేతలు కూడా వరద బాధితుల కోసం భారీ విరాళాన్ని అందజేయనున్నట్లు మాజీ మంత్రి హరీష్‌రావు ప్రకటించారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఒక నెల జీతం విరాళంగా ఇవ్వాలని కేసీఆర్ నిర్ణయించారని తెలిపారు.



02

### సిరిసిల్లలో పవర్ లూం క్లస్టర్

## ఏర్పాటు చేయండి

### కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ను కోరిన బండి

**న్యూఢిల్లీ, నినాదం:**

సిరిసిల్లలో పవర్ లూం క్లస్టర్ ఏర్పాటు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు ఢల్లీలో కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ను బుధవారం నాడు బండి సంజయ్ కలిశారు. పవర్ లూం క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.



## హైడ్రా పేరుతో బెదిరిస్తే కఠిన చర్యలు

సోషల్ వర్కర్ ముసుగులో హైడ్రా పేరు చెప్పి రూ. 20 లక్షలు ఇవ్వాలని బిల్డర్లను డిమాండ్ చేసిన వ్యక్తిపై అమీన్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో సాయివిల్లాస్ రోడ్డులో ఎంసీఆర్ఓ ప్రాజెక్ట్ పేరుతో జూబ్లీహిల్స్ కు చెందిన బిల్డర్లు వాడల రాజేంద్రనాథ్, మంజునాథ్‌రెడ్డి అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నారు. అన్ని రకాల అనుమతులు ఉన్నప్పటికీ, అపార్ట్‌మెంట్ పెద్దచెరువు నాలా బఫర్‌జోన్ పరిధిలోకి వస్తుందని, అదే కాలనీలో అద్దెకు ఉండే ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ బండ్ల విప్లవ్‌సిన్హా కొంతకాలంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. ప్లాట్లు చూసేందుకు వచ్చే కస్టమర్లకు తప్పుడు సమాచారం ఇస్తున్నాడు. సామాజిక కార్యకర్తగా చెప్పుకునే ఆయన పలు ప్రభుత్వ శాఖలకు పదేపదే ఫిర్యాదులు చేస్తున్నాడు. ఇటీవల ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రాను అడ్డం పెట్టుకుని పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేయడం ప్రారంభించాడు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ పలుమార్లు అమీన్‌పూర్‌లో పర్యటించిన సందర్భంలో తంచన్‌గా ప్రత్యక్షమై ఆయనతో ఫొటోలు తీయించుకున్నాడు. గత నెలలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ వచ్చిన మరుసటి రోజు బిల్డర్లు రాజేంద్రనాథ్‌రెడ్డి, మంజునాథ్‌రెడ్డి లను అశోక్‌నగర్ పిస్తాహౌజ్ వద్దకు పిలిపించి, తనకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ చాలా దగ్గర అని ఫొటోలు చూపించి బెదిరించాడు. అపార్ట్‌మెంట్ కూల్చకుండా ఉండాలంటే తనకు రూ.20 లక్షలు ముట్టచెప్పాలని లేదంటే, పత్రికల్లో వార్తలు రాయించి కూల్చివేయిస్తానన్నాడు. మరోమారు గచ్చిబౌలి ఆఫ్రికన్ కాఫీ హౌజ్ వద్దకు పిలిపించి తక్షణం ఎంతోకొంత డబ్బు ఇవ్వాలని, లేదంటే కూల్చడం ఖాయమని తీవ్రంగా బెదిరించాడు. హైడ్రా కమిషనర్‌తో పాటు గతంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహతో దిగిన ఫొటోలను చూపించి బ్లాక్‌మెయిల్ చేయడంతో బిల్డర్లు కంగుతిన్నారు. ఇతడి వేధింపులు భరించలేక బాధితులు అమీన్‌పూర్ పోలీసస్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అమీన్‌పూర్ ఎస్ఐ టి.విజయరావు తెలిపారు.

### హైడ్రా పేరుతో లంచాలు అడిగితే..ఎసిబికి ఫిర్యాదు చేయండి

డబ్బులు డిమాండ్ చేసిన హైడ్రా పేరును చూపిస్తే ఏసీబీకి ఫిర్యాదు చేయాలన్నారు. అలాంటి వారిపై చట్ట ప్రకారం చర్య తీసుకోవడానికి వెంటనే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించాలన్నారు. అటువంటి ఇన్‌ఫార్మర్ల పేర్లు గోప్యంగా, సురక్షితంగా ఉంచబడతాయని ఏసీబీ డీజీ పేర్కొన్నారు.

## మేడారం అడవుల్లో టోర్నడోల బీభత్సం

**ములుగు, నినాదం:**

మేడారం అడవుల్లో సుడిగాలి బీభత్సం సృష్టించింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అడవుల్లో భారీ వృక్షాలు నేలమట్టమయ్యాయి. 200 హెక్టార్లలో విస్తరించి ఉన్న ఈ అడవుల్లో పెద్ద ఎత్తున గాలిదుమారం, సుడిగాలులు బీభత్సం సృష్టించడంతో మహావృక్షాలు కిందకూలాయి. ఒకే చోట మూడు కిలోమీటర్ల విస్తీర్ణంలో 50 వేలకు పైగా చెట్లు నేలమట్టమయ్యాయి. ఈ నెల 1వ తేదీన పరిశీలనకు వెళ్లిన అధికారులు సుడిగాలి బీభత్సానికి చెట్లు కూలడం చూసి స్థానికులు ఉలిక్కిపడ్డారు. టోర్నడోల కారణంగానే ఈ చెట్లు కూలి ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. భారీ వృక్షాలు కూడా నేలకు ఒరగడాన్ని బట్టి కనీసం గంటలకు 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వచ్చి ఉంటాయని తెలిపారు. అయితే 50 వేలకు పైగా చెట్లు కూలిపోవడంపై సమగ్ర విచారణ జరుపుతున్నామని అటవీ శాఖ అధికారులు వెల్లడిరచారు.

## సింగపూర్ చేరుకున్న ప్రధాని మోడీ

భౌగోళికంగా అత్యంత కీలకమైన ఈ ఆగ్నేయాసియా దేశం నుంచి భారత్‌కు భారీ పెట్టుబడులను రాబట్టుకునేందుకు ప్రధాని యత్నిస్తారు. సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ ఆహ్వానం మేరకు సింగపూర్‌లో పర్యటించే ప్రధాని మోడీ పలు కార్యక్రమాలలో పాల్గొంటారు. సింగపూర్‌లోని మూడు తరాల నాయకత్వ శ్రేణులతో ముచ్చటిస్తారని భారత అధికార వర్గాలు తెలిపాయి. సింగపూర్‌కు తన ఆగమనాన్ని ప్రధాని మోడీ సామాజిక మాధ్యమాల్లో ఫోటోతో పాటు పొందుపర్చారు. సింగపూర్‌కు మోడీ వెళ్లడం ఇది ఐదోసారి. భారతదేశంలో సంస్కరణలు, ప్రత్యేకించి యువశక్తి ప్రతిభాపాటవాలు , అపార మానవ వనరులు వంటివి భారత్‌ను సర్వదా పెట్టుబడుల కేంద్రం చేస్తున్నాయని మోడీ తెలియచేసుకున్నారు. ఇరు దేశాల మధ్య విస్తృత సాంస్కృతిక సంబంధాలను ఆశిస్తున్నట్లు వివరించారు. బ్రూనేలో తమ అధికారిక పర్యటనను ముగించుకుని, అక్కడి నుంచి మోడీ సింగపూర్‌లో వాలారు. లయన్ సిటీ సింగపూర్‌కు చేరిన ప్రధానికి అక్కడి హోం , న్యాయ వ్యవహారాల మంత్రి కె షణ్ముగం సాదర స్వాగతం పలికారు. ఇక్కడ ప్రధాని మోడీ ఉత్తేజభరిత కార్యాచరణ స్థాయి చర్చల అజెండా ఖరారు అయిందని ప్రధాన మంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఇక ప్రధాని మోడీకి గురువారం పార్లమెంట్ ఆవరణలో అధికారిక స్వాగతం పలుకుతారు. తరువాత ఆయన దేశాధ్యక్షులు థర్మన్ శణ్ముగరత్నంను కలుసుకుంటారు. వీరి మధ్య చర్చలు జరుగుతాయి. గతంలో ప్రధాని మోడీ 2018లో సింగపూర్‌కు వెళ్లారు. ఇప్పుడు ప్రధాని వెంట విదేశాంగ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు. సింగపూర్‌కు చెందిన సీనియర్ రాజకీయ నాయకులు లూంగ్, గో ఛోక్ టాంగ్‌ను కూడా ప్రధాని కలుస్తారు. మోడీ పర్యటన దశలో సెమీకండక్టరు రంగంలో మానవ వనరుల నైపుణ్యాభివృద్ధికి సంబంధించి ఎంఒయులపై సంతకాలు జరుగుతాయని విదేశాంగ శాఖ తెలిపింది. సింగపూర్‌కు చెందిన సంస్థల ద్వారా భారతీయ యువతకు సరైన నైపుణ్యం కల్పించడం, వారికి రిక్రూట్‌మెంట్లు ఉండటం వల్ల ఇకపై భారతీయ యువతరానికి సింగపూర్ ప్రధాన అవకాశాల వేదిక అవుతుందని ఆశాభావం వ్యక్తం అయింది.

## వరద బాధితులకు బిఆర్ఎస్ సాయం

ఖమ్మం వరదల కారణంగా చాలా నష్టపోయారన్నారు. సిద్దిపేట కౌన్సిలర్‌లు కూడా ఒక నెల జీతం ఇవ్వాలని నిర్ణయించారని మాజీ మంత్రి ప్రకటించారు. మానవ సేవయే మాధవ సేవ.. ఆపదలో ఉన్న వారికి సేవ చేస్తే భగవంతుడికి సేవ చేసినట్టే అని చెప్పుకొచ్చారు. ఖమ్మంలో వరదలు వస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కున్నారన్నారు. అన్ని రకాల వస్తువులు పూర్తిగా ధ్వంసం అయ్యాయన్నారు. సిద్దిపేట నుంచి సేవలు అందించేందుకు చాలా మంది ముందుకు వచ్చారని తెలిపారు. సిద్దిపేట నుంచి రేపు 6 లారీల్లో సామాన్లు పంపిస్తున్నామని తెలిపారు. సహాయం చేయడంలో ఇంకా ముందుకు రావాలని హరీష్ రావు పిలుపునిచ్చారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో అమర్ నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన మట్టి వినాయకుల పంపిణి కార్యక్రమంలో హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అమర్ నాథ్ సేవా సమితి సేవలు దేశ వ్యాప్తంగా వెళ్లాయని... వారిని మనస్పూర్తిగా అభినందిస్తున్నట్లు తెలిపారు. 13 సంవత్సరాలుగా మంచు కొండల్లో సేవలు అందిస్తున్నారన్నారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలకు నిలయం సిద్దిపేట అని అన్నారు. ఇప్పుడు ప్రకృతి కోసం మట్టి వినాయకులు పంచుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతిని కాపాడాలని అన్నారు. సకల కార్యాలకు విఘ్నేశ్వరున్ని మొదటగా పూజిస్తామని.. ఆకర్షణ కన్నా ఆధ్యాత్మిక ముఖ్యమన్నారు. మట్టి గణపతే మహా గణపతి అని తెలిపారు. ప్రకృతి ప్రేమిద్దాం.. మట్టి వినాయకులను పూజిద్దాం అని హరీష్ వెల్లడిరచారు.

## నిర్ణీత ఫ్రొఫార్మాలో నష్టం వివరాలు పంపండి

న్యూఢిల్లీ:

తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కేంద్ర హోంశాఖ లేఖ రాసింది. తెలంగాణలో వరద నష్టం వివరాలు నిర్ణీత ఫార్మాట్లో తక్షణమే పంపాలని కేంద్ర హోమ్ శాఖ సూచించింది. 1345 కోట్ల రూపాయల ఎస్‌డీఆర్ఎఫ్ నిధులు ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్నాయని కేంద్రం వెల్లడిరచింది. వరదల్లో సాయం చేసినందుకు ఇప్పటికే 12 ఎన్‌డీఆర్ఎఫ్ దళాలు, రెండు హెలికాప్టర్లు పంపించినట్లు కేంద్ర హోం శాఖ వెల్లడిరచింది. ఎస్డీఆర్ఎఫ్ నిధికి కేంద్రం వాటా నిధుల విడుదలకు తక్షణమే వివరాలు పంపాలని కేంద్రం ఆదేశించింది. జూన్‌లో 208 కోట్ల రూపాయల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి వినతి రాలేదని ఈ సందర్భంగా కేంద్రం తెలిపింది. ఇది వరకు ఖర్చు చేసిన వాటి యుటీలైజేషన్ సర్టిఫికెట్స్, వరద నష్టం వివరాలు పంపాలని కోరింది. వరద నష్టం వివరాలను ఎప్పటికప్పుడు రోజువారిగా పంపాలని తెలంగాణ ప్రభుత్వం ప్రధాన కార్యదర్శికి రాసిన లేఖలో కేంద్ర హోంశాఖ కోరింది.

# రగులుతున్న జైనూరు







**మొదటిపేజీ తరువాయి**

మొదట ఈ కేసును రోడ్డు ప్రమాదంగా భావించి పోలీసులు అదే విధంగా కేసు నమోదు చేశారు.బాధితురాలు స్పృహలోకి వచ్చి తనపై అత్యచారం,హత్య ప్రయత్నం జరిగిందని పోలీసులకు చెప్పింది. ఈ నేపథ్యంలో ఆదివాసి గిరిజనులు ఏజెన్సీ ప్రాంతంలో బందుకు పిలుపునిచ్చారు. బంద్ సందర్భంగా ఆదివాసీలు నిందితుడి ఇంటికి నిప్పంటించడంతో పాటు సదరు కాలనీ లో దొరికిన వాహనాన్ని దొరికినట్లు ధ్వంసం చేశారు కొన్నింటికి నిప్పు పెట్టారు. కాలనీ అంతా విధ్వంసం సృష్టించారు.

### పోలీసుల గుప్పిట్లో జైనూరు...

జరిగిన సంఘటన నేపథ్యంలోఏజెన్సీ ప్రాంతమైన జైనురులో పరిస్థితులు అదుపు తప్పడంతో స్వయంగా జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు రంగంలోకి దిగి పర్యవేక్షిస్తున్నారు. ఆదివాసి గిరిజనులలో గత కొంతకాలంగా ఓ వర్గం వారిపై, తీవ్ర అగ్రహానికి, అసహానానికి గురై ఉన్నారు. స్థానికేతురులైనటు వంటి వారు ఇక్కడకు వచ్చి తమపై పెత్తనం చెలాయించడం పట్ల గుర్రుగా ఉన్నారు. ఆదివాసి గిరిజన మహిళపై అత్యాచారం హత్యాయత్నం ఆదివాసి గిరిజనులు తీవ్రంగా స్పందించారు. జరిగిన సంఘటన పట్ల పోలీసులు వెంటనే చర్యలు చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకున్నప్పటికీ గిరిజనులలో ఆగ్రహం చల్లారడం లేదు. వారిలో ఉన్న ఈ ఆగ్రహాన్ని, అసహనాన్ని గుర్తించడంలో పోలీసులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జరిగిన సంఘటన పట్ల బందుకు పిలుపునిచ్చిన ఆదివాసి గిరిజన సంఘాలు, ఆదివాసి గిరిజనులను అదుపు చేయలేకపోయారు. ఆదివాసీ గిరిజనులు, ఓ వర్గం ప్రజలకు చెందిన వ్యాపార సముదాయాలపై దాడి చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో పరిస్థితులు తీవ్ర ఉద్రిక్తంగా ఉన్నాయి. పోలీసులు పరిస్థితులను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు.

### కఠినంగా వ్యవహరిస్తాం - సీతక్క

కాగా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క బుధవారం గాంధీ ఆసుపత్రిలో బాధితురాలిని పరామర్శించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ బాధితురాలికి అండగా ఉంటామని, నిందితుడికి చట్ట ప్రకారం కఠిన శిక్షలు పడేవిధంగా చర్యలు చేపడుతామని హామీని ఇచ్చారు. ఆదివాసి గిరిజనులు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. బాధితురాలు స్టేట్మెంట్ వారి కుటుంబ సభ్యుల సమక్షంలో రికార్డు చేసామని ఇప్పటివరకు హత్య నేరంగానే పరిగణిస్తున్నామని పూర్తి విచారణ అనంతరం పోలీసు అధికారులు తగిన సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేస్తారని మంత్రి వివరించారు. మాజీమంత్రి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి కూడా బాధితురాలిని కలిసి విషయం తెలుసుకున్నారు.కాగా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల అసంతృప్తి,అసహనం ఎటువంటి మలుపులు తీసుకుంటుందోనన్న ఆందోళన సర్వత్రా నెలకొంది. సున్నితమైన ఈ అంశం పట్ల ప్రభుత్వం, పోలీసు అధికారులు చాలా జాగ్రత్తగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉన్నది.

### ప్రజలు సంయమనం పాటించాలి - ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

జైనూరు ఘటనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన వారి పై చర్యలు తీసుకుంటామని, ప్రజలంతా సంయమనంగా వ్యవహరించాలని ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం ప్రకటించారు. సోషల్ మీడియాలో ఇష్టారీతిన పోస్ట్ లు పెట్టినా , జిల్లా వ్యాప్తంగా ఎవరు మతపరమైన పోస్టులు చేసినా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను ప్రజలు నమ్మవద్దన్నారు. వదంతులను ప్రచారం చేస్తూ మతాల మధ్య చిచ్చుపెట్టే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.సోషల్ మీడియాపై జిల్లా పోలీసు యంత్రాంగం నిఘా ఏర్పాటు చేసిందని నిజా నిజాలు తెలుసుకోకుండా ప్రచారం చేసిన వారిపై, వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ లపై చర్యలు తీసుకోబడతాయని, కేసులు నమోదు చేయబడతాయని తెలిపారు. ముఖ్యంగా జైనూరు లో 144 సెక్షన్ అమలులో ఉందని, ఇతర ప్రాంతాలవారికి జైనూరు వచ్చి పోయేందుకు అనుమతి లేదని, చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

### నిందితున్ని కఠినంగా శిక్షించాలి : ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆదివాసి మహిళపై అఘాయిత్యానికి పాల్పడ్డ నిందితున్ని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలని ఆమె పరామర్శించారు. బాధిత మహిళకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు కోరారు. ఆదివాసులపై రోజురోజుకు దాడులు పెరుగుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు . ఏజెన్సీ ప్రాంతంలో ప్రశాంత వాతావరణం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జై నూర్ మండలంలో గతంలోనూ ఇరువర్గాల మధ్య ఘర్షణలు చేసుకున్నట్లు గుర్తు చేశారు. అక్కడ జరుగుతున్న ఘర్షణలపై ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

# కెసిఆర్ మాదిరిగా ఫామ్‌హౌజ్‌లో కూర్చోలేదు



**ఖమ్మం, నినాదం:**

కెసిఆర్ మాదిరిగా విదేశీ కుట్ర అంటూ ఫాంహౌస్‌లో కూర్చోలేదని, చినుకు పడిన క్షణం నుంచి ప్రజల్లోనే ఉన్నామని, మా ముందస్తు చర్యల వల్ల వీలైనంత ప్రాణ నష్టం తగ్గించ గలిగామని, గత ప్రభుత్వం పదేళ్లలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. బిఆర్ఎస్ నాయకులు విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని, ప్రజల రక్షణె తమకు ముఖ్యమన్నారు. వరదలపై ఖమ్మం జిల్లాలో బిఆర్ఎస్ నేత మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను బుధవారం మంత్రి పొంగులేటి తప్పుబట్టారు. దీనికి సంబంధించి మంత్రి పొంగులేటి ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వచ్చిన భారీ వర్షాలు, వరదలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి వారి వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి క్లౌడ్`బరస్ట్, విదేశీ కుట్ర అంటూ మతిలేని ప్రకటనలు చేసిన బిఆర్ఎస్ నాయకులకు ఇప్పుడు తమ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక అర్హత ఎక్కడిదని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి ఆ ప్రకటనలో ప్రశ్నించారు. విదేశీ కుట్ర అని ఫాంహౌస్ దాటని బిఆర్ఎస్ పార్టీ పెద్దలు ఈరోజు వరదల గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఆనాడు ప్రకృతిపరంగా కురిసిన వర్షాలను కూడా కుట్రకోణంలో చూసిన ఆ పెద్దమనిషి, ఆయన అల్లుడు హరీష్ రావు కూడా ఇప్పుడు వచ్చిన వర్షాలను కుట్ర కోణంలోనే చూస్తున్నారా అని మంత్రి వ్యాఖ్యానించారు.ఇదిలా వుంటే నేలకొండపల్లి ప్రాంతంలో మంత్రి పర్యటించి పునరావాస చర్యలను పరిశీలించారు. అలాగే వరదల్లో కొట్టుకు పోయిన తండ్రీకూతుళ్ల ఇంటికి వెళ్లి నివాళి అర్పించారు. ఆ కుటుంబానికి 5 లక్షల చెక్కును అందచేశారు.

### వరదలతో రైతులకు తీరని నష్టం


వరద నష్టాన్ని అంచనా వేస్తున్నామని, రైతులకు తీవ్రంగా నష్టం జరిగిందని మంత్రి పొంగులేటి అన్నారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్, నేలకొండపల్లి మండలాల్లోని వరద ప్రాంతాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. అతి భారీ వర్షాల కారణంగా తెలంగాణ రాష్ట్రంలో చాలా జిల్లాలు అతలాకుతలం అవుతున్నాయన్నారు. ఉమ్మడి ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు మహబూబాద్, ములుగు, నలగొండ జిల్లాల్లో భారీ నష్టం జరిగిందన్నారు. వాగులు, వంకలు పొరడం వల్ల రైతులకు అధిక నష్టం వాటిల్లిందని పొంగులేటి అన్నారు. ప్రతి గ్రామంలో జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నామన్నారు. దీనిని జాతీయ విపత్తుగా కేంద్రం స్వీకరించి నష్టాన్ని అందజేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణకు రూ. 5438 కోట్లు అన్ని విధాలా నష్టం జరిగినట్లు కేంద్రానికి లేఖ ద్వారా తెలియజేశారని పొంగులేటి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా సహకరించి నష్టాన్ని అందజేస్తుందని కోరుతున్నామని పొంగులేటి వెల్లడిరచారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన నష్టానికి ఎలా చేయాలనుకుంటుందో కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో జరిగిన విపత్తు కూడా అలానే సహాయం అందించాలన్నారు. అత్యవసరంగా కొంత సహాయంతో పాటు జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం ఆదుకుంటుందని పొంగులేటి తెలిపారు. ఈ వర్షానికి తడిసిన ధాన్యాన్ని సివిల్ సప్లై అధికారులు తీసుకొని ధాన్యానికి మద్దతు ధర ఇవ్వడం జరుగుతుందని భరోసా ఇచ్చారు. రైతులతో పాటు సామాన్య ప్రజానీకానికి ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని.. అవసరమైన సహాయాన్ని అందజేస్తుందని.. కాబట్టి ప్రజలు ఎవరు ఆందోళన చెందవద్దని పొంగులేటి తెలిపారు.



## సిరిసిల్లలో పవర్ లూం క్లస్టర్ ఏర్పాటు చేయండి

నేషనల్ హ్యాండ్లూం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నేతన్నలు కొనుగోలు చేసేందుకు అవసరమైన ముడిసరుకు డిపో(యార్న్ డిపో)ను ఏర్పాటు చేయాలని రిక్వెస్ట్ చేశారు. ఫ్యాషన్ పెరిగిపోయి, సంప్రదాయ ఉత్పత్తులకు పోటీ పెరిగిపోయిందని, దాంతోపాటు ముడిసరుకు ధరలు పెరగడంతో ఉత్పత్తుల ధర అధికం అవుతుందన్నారు. కనుక ముడిసరుకు ఖర్చులు పెరగడంతో చేనేత కార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని.. వారికి సబ్సిడీని 80 శాతం మేరకు పెంచాలని బండి సంజయ్ కోరారు. సిరిసిల్లలో పవర్ లూం క్లస్టర్ ను ఏర్పాటు చేస్తే, స్థానికంగా వేలాది మంది చేనేత కార్మికులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. సంప్రదాయ మెషీన్లు కాకుండా, ఆధునిక యంత్రాలు వారికి అందిస్తే.. ఉత్పాదకత పెరుగుతుందని గిరిరాజ్ సింగ్ కు తెలిపారు. కార్మికులు సాధ్యమైనంత త్వరగా నేత ఉత్పత్తులను అందిస్తూ, అప్పుల బాధ లేకుండా కుటుంబాన్ని పోషించుకుంటారని పేర్కొన్నారు. నాణ్యమైన వస్త్రాలను అందించడంతో పాటు వారి మధ్య ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంచుతాయన్నారు. పావలా వడ్డీకే రుణాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. తన అభ్యర్థనపై గిరిరాజ్ సింగ్ సానుకూలంగా స్పందించారని.. యార్న్ డిపో ఏర్పాటుతోపాటు పవర్ లూం క్లస్టర్ మంజూరుపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నట్లు తెలిపారు. 80 శాతం సబ్సిడీ, పావులా వడ్డీకే రుణాలు వంటి అంశాల అమలు సాధ్యాసాధ్యాలపై ఉన్నతాధికారులతో చర్చించి కేంద్ర మంత్రి నిర్ణయం తీసుకుంటారన్నారు.

# భర్తీ చేసేదప్పుడో..?



**మొదటిపేజీ తరువాయి**

నెలకోసారి లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేస్తున్నారు.
మాతా, శిశు సంక్షేమం కోసం నిర్వహిస్తున్న అంగన్వాడి కేంద్రాల నిర్వహణ గాడి తప్పింది. వందల సంఖ్యలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల పోస్టులు ఖాళీగా ఉండడంతో ఈ పరిస్థితి నెలకొన్నది. అంగన్వాడి కేంద్రాలను బలోపేతం చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. అంగన్వాడి టీచర్లు లేని చోట ప్రీ స్కూల్ బందయింది. అలాగే టీచర్, హెల్పర్ ఇద్దరూ లేనిచోట అంగన్వాడి కేంద్రాలు మూతపడ్డాయి. పెద్దపల్లి జిల్లాలో అంగన్వాడి కేంద్రాల తీరుతెన్నులపై 'నినాదం' ప్రత్యేక కథనం

పెద్దపల్లి జిల్లాలో మూడు ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో 706 అంగన్వాడి కేంద్రాలున్నాయి. వీటిలో 66 టీచర్, 208 హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.జులై ఒకటో తేదీ నుంచి అమలు చేసిన పదవీ విరమణ నిబంధనతో జిల్లాలో 82 మంది హెల్పర్లు,25 మంది టీచర్లు విధులకు దూరమయ్యారు. మరోవైపు టీచర్,హెల్పర్ ఇద్దరూ లేని 12 అంగన్వాడి కేంద్రాలు మూతపడ్డాయి. ఇక్కడ పిల్లలు,బాలింతలు, గర్భిణీలకు ఇన్చార్జిగా ఉన్న ఇతర అంగన్వాడి కేంద్రాల టీచర్లు సరుకులు మాత్రమే పంపిణీ చేస్తున్నారు.

### ప్రీస్కూల్ బంద్

పెద్దపల్లి జిల్లాలో 66 అంగన్వాడి కేంద్రాల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉండడంతో ప్రీస్కూల్ నిర్వహించడం లేదు. ప్రతి అంగన్వాడి కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య నేర్పించాలన్న లక్ష్యం నెరవేరకుండా పోతుంది. టీచర్లు లేక అంగన్వాడి కేంద్రాల పరిధిలోని 3–6 సంవత్సరాల పిల్లలు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారు. టీచర్లు లేని చోట హెల్పర్లు పిల్లలకు కేవలం భోజనం వండి పెడుతున్నారు. అలాగే గర్భిణీలు బాలింతలకు ఆరోగ్య, పోషణ, సంరక్షణపై సలహాలు, సూచనలు అందడం లేదు.

### టీచర్ల దిపాత్రాభినయం

జిల్లా వ్యాప్తంగా 706 అంగన్వాడి కేంద్రాల్లో 208 హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో అక్కడ అంగన్వాడీ టీచర్లు హెల్పర్ పాత్రను కూడా పోషించాల్సి వస్తోంది. దిపాత్రాభినయం చేయాల్సి రావడంతో టీచర్లు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల మాత్రం టీచర్లు అనధికారికంగా హెల్పర్లను నియమించుకున్నారు. మరోవైపు చాలా చోట్ల ఏళ్ల తరబడిగా హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

### పిల్లల హాజరు పై ప్రభావం

జిల్లా వ్యాప్తంగా 208 అంగన్వాడి కేంద్రాల్లో హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గ్రామంలోకి వెళ్లి పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు తీసుకొచ్చేది హెల్పర్లే. అలాగే ప్రీ స్కూల్ పిల్లలతో పాటు గర్భిణీలు బాలింతలకు వంట చేసి వడ్డించేది కూడా వీరే. Qకాగా హెల్పర్లు లేనిచోట చిన్నారుల హాజరు తగ్గుతుందని సమాచారం.

సంపాదకీయం

# వరద ప్రాంతాలకు పార్టీ కార్యకర్తలను తరలించాలి!

నష్టం కోట్లలో ఉంది. వరదవల్ల దెబ్బతిన్న ప్రాంతాల పరిస్థితి దుర్భరంగా ఉంది. వరదల నుంచి బయటపడ్డ జనం ఇప్పుడు ఆర్తిగా సాయం కోసం ఎదురు చూస్తున్నారు. సర్వస్వం కోల్పోయిన వారు బిక్కుబిక్కు మంటూ గడుపుతున్నారు. బురద నిండిన తమ ఇళ్లను చూసి బోరుమంటున్నారు. కొందరి ఇళ్లు పాక్షింగానూ.. కొందరి ఇళ్లు పూర్తిగానూ కొట్టుకు పోయాయి. కట్టుబట్టలతో మాత్రమే మిగిలారు. ఓ రకంగా చెప్పాలంటే జీవచ్ఛవాల్లా ఉన్నారు. వీరిని తక్షణం ఆదుకోవాల్సిన అసవరం ఉంది. బాధ్యతా ఉంది. ఇది ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు, ప్రముఖులపై ఉంది. విరాళాలతో పాటు సేవకు కూడా ముందుకు రావాలి. అలాగే వారికి యుద్ధప్రాతిపదికన తాత్కాలికంగా ఇళ్లను నిర్మించే పని కూడా చేపట్టాలి. మరోమారు వరదలు రాకుండా ఉన్న స్థలాలను గుర్తించి ఇళ్లు కట్టి ఇవ్వాలి. ఎందుకంటే ఇప్పుడే మనమంతా మానవ్తం ప్రదర్శించాలి. మనం తింటున్న తిండి ఒంటబట్టాలంటే వరదల్లో దెబ్బతిన్న వారిని ఆదుకోవాలి. మందబలం ఉందంటున్న అన్ని పార్టీలు తమ కార్యకర్తలను రంగంలోకి దింపాలి. బిఆర్ఎస్, బిజెపి, అధికార కాంగ్రెస్ పార్టీలు ఇరు తెలుగు రాష్ట్రాల్లో వరదల్లో దెబ్బతిన్న గ్రామాలకు తమ కార్యకర్తలను తరలించాలి. వారితో పాటే తిండి , వంట సామాగ్రిని తరలించాలి. చేతివాటం ప్రదర్శించని వారిని ఎంపిక చేసి తరలిస్తే నిజాయితీగా పనిచేస్తారు. వారంతా అక్కడే ఉండి సహాయక చర్యల్లో పాల్గొనేలా చేయాలి. అలా చేసేలా ఆదేశాలు ఇవ్వాలి. తోటి మానవులకు అండగా ఉన్నామన్న భరోసా ఇవ్వాలి. ఇకపోతే మనిషిలోతు వరదల్లో మునిగిపోయి తిండీతిప్పలు లేకుండా ఇబ్బందుల్లో ఉన్న వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రభుత్వం ఓ వైపు సాయం చేస్తున్నప్పటికీ ఇంకా అక్కడక్కడా సాయం అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బుడమేరు వాగు పొంగడంతో విజయవాడ సిటీలోని కీలక ప్రాంతాలు నీట మునిగాయి. మొదటి ఫ్లోర్ వరకు మునిగిపోయి ఉన్నాయి. ఎక్కడా కరెంట్ లేదు.. పిల్లలకు తాగడానికి పాలు లేవు. వృద్ధులు, వ్యాధిగ్రస్తులు నిద్రాహారాలు లేక అల్లాడిపోతున్నారు. ఎక్కడికి వెళ్లాలన్నా మనిషిలోతు వరద, బోటు అడిగితే కిలోమీటర్‌కి మనిషికి వెయ్యి రూపాయలు అడుగుతున్నారు. పునరావాస శిబిరాలు ఎక్కడున్నాయో తెలియడం లేదని వాపోతున్నారు. హెలిక్యాప్టర్ల నుంచి అన్నం పార్శిళ్లు బురదలో విసిరేస్తే తీసుకోవడం, వ్యాన్ దగ్గర నీళ్ల బాటిళ్లు, అన్నం కోసం కొట్టుకోవడం లాంటి దృశ్యాలు పరిస్థితికి అద్దం పడుతున్నాయి. ఇక ఖమ్మం జిల్లాలలో మరీ దారుణ పరిస్థితులు ఉన్నాయి. మున్నేరుకు ముంపు వచ్చి మూడ్రోజులవుతున్నా మురుగును తొలగించేనాథుడే కరువయ్యాడు. కట్టుబట్టలతో ఉన్న బాధితులకు పస్తులు తప్పడం లేదు. అధికారులు, కాంగ్రెస్ నాయకులు అక్కడక్కడ కనిపిస్తున్నారే తప్ప క్షేత్రస్థాయిలో బాధితుల కనీస అవసరాలను పట్టించుకోవట్లేదు. ఖమ్మంలోని బొక్కలగడ్డ, మంచికంటినగర్, వెంకటేశ్వర నగర్, మాణిక్యనగర్, మోతీనగర్, గణేళిష్‌నగర్, ధ్వంసలాపురం తదితర ప్రాంతాల్లో ఇండ్లన్నీ బురదమయంగా మారాయి. ఇండ్లలో బురదను శుభ్రం చేయడానికి కనీసం నీళ్లు కూడా సరఫరా చేయడం లేదు. కార్పొరేషన్ అధికారులు ట్యాంకర్లను ఏర్పాటు చేసినా సరిపడా నీళ్లు అందుబాటులోలేక ఇబ్బంది పడుతున్నారు. ఇంతవరకు విద్యుత్తును పునరుద్ధరించలేదు. విద్యుత్ స్తంభాలు విరిగి, తీగలు భూమిమీదనే వేలాడుతున్నవి. చీకట్లో పాములు, తేళ్లు ఇండ్లలోకి వచ్చే ప్రమాదం ఉందని ప్రజలు భయపడుతున్నారు. మున్సిపల్ సిబ్బంది ట్రాక్టర్లను ఏర్పాటు చేయకపోవడం వల్ల తడిసిన బియ్యంను రోడ్లమీదనే పోయడంతో వాసన వస్తున్నాయి. కనీసం బ్లీచింగ్ కూడా చల్లడం లేదు. అంటు రోగాలు ప్రబలే అవకాశం ఉన్నందున పెద్ద ఎత్తున వైద్య శిబిరాలు ఏర్పాటు చేయవలసి ఉంది. లారీల కార్యాలయ ఆవరణలో సుమారు 200 లారీలు మునిగిపోగా, వీటి మరమ్మతులకు ఒక్కొక్క లారీకి సుమారు రూ.లక్ష ఖర్చు అవుతుందని యజమానులు విచారం వ్యక్తం చేస్తున్నారు. కార్లు, ద్విచక్ర వాహనాల పరిస్థితి కూడా ఇలాగే ఉన్నది. వరదలకు ఇంట్లోని వస్తువులతో పాటు సరుకులు కూడా కొట్టుకు పోయాయి. ఇక్కడ ఊరికో అధికారిని పెట్టి ప్రత్యేకంగా వారి సమస్యలను గుర్తించి సాయం చేస్తే తప్ప వారు కోలుకోలేని దుర్భర పరిస్థితి ఉంది. వరదలు వచ్చి మా బతుకులు నీళ్లలోనే ఉన్నా మమ్ములను కాపాడేవాడే లేరా అని ఎదురు చూస్తున్న బాధితులకు మనమంతా ఉన్నామన్న భరోసా ఇవ్వాలి. బురదను కడుక్కోవడానికి నీళ్లు కూడా లేవు. బట్టలను ఉతుక్కోవడానికి మళ్లీ మున్నేరుకే వెలుతున్నారు. ఓ రకంగా చెప్పాలంటే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు తెలంగాణ అతలాకుతులమైంది. ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. పలు ఇండ్లలోకి వరద నీరు చొచ్చుకు రావడంతో ఇంట్లోని నిత్యావసర వస్తువులు, బియ్యం, పప్పులు, దుస్తులు పనికిరాకుండా పోయాయి. కనీసం తాగడానికి నీరు, తినడానికి ఆహారం దొరకని దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు. ఈ సమయంలో విరాళాలతో పాటు బాధిత ప్రాంతాలకు వెళ్లి ఆదుకునే ఆపన్న హస్తం కావాలి. తమకు భారీగా కార్యకర్తల బలం ఉందని చెప్పుకుంటున్న కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ కార్యకర్తలను వరద ప్రాంతాలకు తరలించాలి. అక్కడే ఉండి బాధితులు మళ్లీ పునర్జన్మ ఎత్తేలా చేయాలి. అప్పుడే తెలుగు రాష్ట్రాల్లో దెబ్బతిన్న వరద ప్రాంతాలు చేతికి వస్తాయి. అధికారులను కూడా అక్కడే విధుల్లో ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించేలా చేయాలి. పారిశుద్ధ్య సిబ్బందిని తరలించాలి. ఇలా కనీసం ఓ వారం పదిరోజులు గట్టిగా పనిచేస్తేనే ప్రజలను కాపాడుకోగలమని గుర్తించాలి. ఇందుకు ప్రభుత్వం కూడా ఆలోచన చేస్తే మంచింది.



# గూగుల్ కన్నా గురువు మిన్న..




నవ నాగరిక సమాజంలో ఆయనో సాధారణ మనిషి అయినా ఆదియుగం నుండీ ఆధునిక శకం వరకూ ఆయనే ఋషి. జాతి జీవన వికాస మార్గదర్శకుడతడు. సమాజ దేవాలయానికి అసలు సిసలైన పురోహితుడు. అతడే... ఉపాధ్యాయుడు, సృష్టి స్థితి లయల నిర్దేశకుడు! అలాంటి మహోన్నత మహాఋషికి నేటి సమాజంలో అడుగడుగునా ఆటంకాలే... వెటకారాలు, ఛీదరింపులు, వెండతెరపై ఆటపట్టింపులు... ఎదురుదెబ్బలు ఎన్ని తగిలినా... బుద్ధినే సిమెంటుగా, జ్ఞానాన్నే ఇటుకలుగా, వివేకాన్నే కాంక్రీటుగా మలిచి విజ్ఞానమనే భవంతుల్ని నిర్మిస్తున్న నిత్య శ్రామికుడు. నిత్యాణ్వేషిగా, నిత్య విద్యార్థిగా జ్ఞాన కుసుమాలు పూయిస్తున్న ఆ విజ్ఞాన ఖనిని 'గురుపూజోత్సవం' సందర్భంగా మనసారా పూజించుకుందాం... మనసెరిగిన మాస్టార్లకు పాదాభివందనాలర్పిద్దాం...

**బడి అనే నారుమడిలో...**
**విద్య అనే విత్తనం వేసి...**
**అక్షరం అనే నీరు పోసి...**
**చెడు అనే కలుపు తీసి...**

మంచి, నీతి అనే ఫలాన్ని సమాజానికి... అందించే ఉపాధ్యాయుడు స్ఫూర్తి ప్రదాత..! పాఠశాల లేని పల్లెటూరైనా ఉండవచ్చేమో గానీ, ఉపాధ్యాయు డు లేని ఊరు మాత్రం ఉండకూడదు. పాఠశాలకూ, పాఠ్య బోధన ద్వారా ప్రగతిని నిర్దేశించే ఉపాధ్యాయుడికీ సంబంధం పాఠశాల ప్రాంగణంతో ముడిపెట్ టకూడదు. ఉపాధ్యాయుడంటే పాఠశాలలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించే వ్యక్తే కానక్కర లేదు. బ్రతుకుతెరువుకోసం పాఠాలు చెప్పుకునే ప్రతివ్యక్తీ ఉపాధ్యాయుడే, బ్రతుకు మార్గాన్ని పాఠశాల నుండి చూపించే ఉద్యోగస్తుడూ ఉపాధ్యాయుడే.


ఉపాధ్యా యుడు ఎక్కడివాడైనా ఆయన స్థానం అత్యుత్తమమైనది, అనిర్వచనీయమైనది. ఆయన తరగతిలో చెప్పే ప్రతి పాఠమూ ఒక సూక్తి వంటిది. అందుకే పాఠాలతోపాటు ఆయన బోధించే సారాంశం, పాఠాలతో ప్రత్యక్ష సంబంధం లేనిదైనా అది విద్యార్థి భవిష్యత్తు మీద పరోక్ష సంబంధాన్ని ప్రగాఢంగా చూపుతుంది కాబట్టి ఉపాధ్యాయుడి వాక్కుకు అంత శక్తి ఉంది.ఆ శక్తి అనంతమైనది. విద్యార్థి చివరి దశ వరకు అతని వెన్నంటే ఉంటుంది. విద్యార్థి సంఘానికి దేహం వంటివాడైతే ఉపాధ్యాయుడు ఆత్మ. అటువంటి ఉపాధ్యాయుడిని ప్రతి యేటా సత్కరించుకోవాల్సిన బాధ్యత విద్యార్థుల మీదే కాదు, నేటి సభ్య సమాజం మీద కూడ ఉంది. ప్రతి ఏడాది సెప్టెంబర్ 5వ తేదీన జాతీయ స్థాయిలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నాము. టీచర్స్ డేగా విదేశాల్లో కూడా అతి ఘనంగా ఈ వేడుకలను జరుపుకుంటారు. మన దేశాని కొస్తే సెప్టెంబర్ 5నే ఈ ప్రత్యేక దినోత్సవాన్ని జరుపుకోవడానికి కారణం ఆ రోజు భారత ద్వితీయ రాష్ట్రపతిగా అద్వితీయంగా తన పదవీ బాధ్యతలను నిర్వహించిన డా సర్వేపల్లి రాధాకృష్ణన్ (1888-1975) జన్మదినం కావడమే.

1962 నుండి 1967 వరకు దేశాధ్యక్షుడిగా పని చేసిన రాధాకృష్ణన్ ప్రారంభంలో ఉపాధ్యాయుడు. స్వయంగా ఉపాధ్యాయుడైన ఆయన విద్య మీద అపార నమ్మకంగలవాడు. విద్యాధికులు మాత్రమే దేశ సౌభాగ్యానికి చుక్కానులని ఆయన విశ్వసించేవారు. వాస్తవానికి ఉపాధ్యాయ దినోత్సవాన్ని సెప్టెంబర్ 5న జరపవలసిందిగా కోరింది ఆయనే. తన పుట్టిన రోజునాడు తనను అభినందించడానికి వచ్చిన తన అభిమానులను ఆయన ఈ రోజు నన్ను అభినందించడంకంటే ఉపాధ్యాయులను అభినందించడం నాకు ఎక్కువ ఆనందాన్ని ఇస్తుందనడంతో ఆ రోజు నుంచి ఉపాధ్యాయ దినోత్సవాన్ని రాధాకృష్ణన్ పుట్టిన రోజునాడు నిర్వహించడం జరుగుతున్నది.

ఇది సత్యం!... ఇదే సత్యం!!
టీచర్స్ డే ఆద్యుడు సర్వేపల్లి...
డా సర్వేపల్లి రాధాకృష్ణన్ భారతదేశపు మొట్టమొదటి ఉపరాష్ట్రపతి, రెండవ రాష్ట్రపతి కూ డా. అంతేకాదు భారతీయ తాత్వికచింతనలో పాశ్చాత్య తత్వాన్ని ప్రవేశ పెట్టినాడని ప్రతీతి. 1962లో సర్వేపల్లి రాధాకృష్ణన్ భారత రాష్ట్ర పతి అయిన తరువాత కొందరు శిష్యులు, మి త్రులు, పుట్టిన రోజు జరపటానికి అతనివద్ద కు వచ్చినప్పుడు, 'నా పుట్టిన రోజును వేరుగా జరిపే బదులు, దానిని ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహిస్తే నేను ఎంతో గర్విస్తాను' అని చెప్పి ఉపాధ్యాయ వృత్తి పట్ల తన ప్రేమను చాటారు. అప్పటినుండి ఆయన పుట్టిన రోజును భారతదేశంలో ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నారు.

**కీచకులూ ఉన్నారు...**

ఈ కొనుగోళ్ళ రో జుల్లో ఎందరో కీచకులు కూడా తయారవడం నేటి విద్యాలోకం సాధించిన అభివృద్ధి. ఇది ఎంతో విచారమైన స్థితిలో వుండి చెప్పక మానదు. ఆ సూర్యుడు పడమట ఉదయించి నా ఉపాధ్యాయుడు మాత్రం ఇలా కాకూడదు. ఉపాధ్యాయులందరూ ఇలాంటి వారే అని చెప్పడం కూడా సరికాదు... కానీ సమాజం ఒకానొక దుస్థితిలో ఉందని మాత్రం చెప్పక తప్పదు. పదిమంది లో గురువు పేరును చెడగొడుతున్నారు. అలాంటి వ్యవస్థను రూపుమాపి గురువు గొప్పతనాన్ని చాటి చెప్పడమే నేటి సభ్య సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరి బాధ్యత..



నరేష్ నాయక్ జాటోత్.
రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు.
సిద్దార్థ డిగ్రీ & పీజీ కళాశాల
నల్లగొండ.(8247887267)

## గురువు గొప్పతనం

క్షీరము నిచ్చేది ధేనువు
జ్ఞానము నిచ్చేది గురువు
దేవ గురువు బృహస్పతి
గురుదేవుడేప్పుడూ సరస్వతే!!

అజ్ఞానం నుండి విజ్ఞానం వైపు నడిపించేది గురువు
మంచి మనిషిగా తీర్చిదిద్దేది
గురువు
మంచిని బోధించేది గురువు
గురువు లేని విద్య గుడ్డి విద్య!!

విజ్ఞానం పంచేది గురువు
తన విద్యను ధారపోసేది గురువు
ప్రపంచంలో అన్నిటికీ రెండు
కొమ్ములే ఉంటే
మూడు కొమ్ములు ఉన్నవాడు
గురువు!!

**గు=1 రు =2 వు =3**

దేవులపల్లి రమేశ్.
నంగునూర్, సిద్దిపేట జిల్లా
చరవాణి :-9963701294



ప్రాణధాతకు వందనం

# ప్రకృతమ్మకు వందనం..



**ఇక చాలు అమ్మా**
**వెళ్లిపోవమ్మా..**

ఎడతెరపి లేకుండా కురుస్తున్నా వాన
అరుస్తూనే ఉంది ఆరాం రోజుల నుండి
ఇది నా కాలమంటూ
నాలుగు నెలల అధికారం కాదు
ఇది నా ప్రేమ అంటూ
భూమికి భూమిలో ఉన్నా జీవుల రక్షణ కై అంటూ
మేఘాలన్నీ ఒక్కటై భూమిని ముద్దాడి
అవని అంతా సుందరమై పచ్చదనం చేస్తూ
ఆ చెట్లు చెట్ల కొమ్మలు
ఆ కొమ్మలకు పూసినా పూలు
పూలు వికసించి తన సోయగాలతో ఆకర్షిస్తున్నాయి
ప్రకృతంతా మహాద్భుతమై కనువిందు చేస్తున్నాయి.
సృష్టిలోని ప్రతి జీవికి ఊపిరి పోస్తూ
యే తేడాల్లేకుండా అది చీడపురుగునైనా
కరడుగట్టిన విషపుజీవినైనా
అది మల్లెపూవునైనా అదే ప్రేమను పంచుతూ
ఒకే తీరుగా చూస్తుంది.
వాటికి కల్మషం ఉండదు
వాటికి అన్యాయం ఉండదు
వాటికి వివక్షత ఉండదు
మన లాగా కుల మత ఏ అహంకారంలుండవు
స్వేచ్ఛ సమానత్వం తో
మానవత్వం ను పంచుతూ అద్భుతంగా వర్ధిల్లుతుంది.
ఆ ప్రకృతిలోని చెట్లు వేర్లు వాటి మూలమై
ఆ చెట్ల కొమ్మలు రెమ్మలు ఆకులు
వాటి ఆత్మ గౌరవమై
ప్రకృతి లో పూసిన పూలు వాటి సొగసై
ఆ చెట్లు కాయలు పండ్లు వాటి సహజమైన గుణమై
వాటి అందాన్ని వలకబోస్తూ
అద్భుతంగా కనువిందు చేస్తుంది...!
వేసవి కాలం లో ఎండిన అడవికి
పచ్చని రంగులేసి
బహు సుందరత్వాన్ని నెలకొల్పుతుంది.
పక్షుల కిలకిలలు
కప్పల బెకబెకలు అరుపులతో
ప్రకృతి పచ్చదనానికి మరింత వన్నె పూస్తాయి..
రైతుకు బంధువై
వాగులు వంకలు లోయలు ఉప్పొంగుతూ
పచ్చని పైరులకు ప్రాణం పోస్తూ
సృష్టిలోని ప్రతి జీవికి ప్రాణమై
ప్రకృతంతా పరవళ్లు తొక్కుతోంది.
కాడు కు కట్టెలై
ప్రాణం నిలబెట్టడానికి పంటలై
నిత్యం ఆత్మీయతను పంచుతుంది
వాన పాడుగాను అటే పోతుంది అంటూ
లేదా వాన పాడుగాను ఇంకా పోతాలేదు అని
మనిషి ఎన్ని సార్లు నిందించినా
ఎన్ని సార్లు దూషించినా ఎల్లప్పుడూ
ప్రేమను పంచుతునే ఉంటుంది.
అతివృష్టి అనావృష్టి జరిగితే
మనిషి తన మాటలతో ఎంత హింసించినా
అదే ప్రేమను కురిపిస్తోంది ఎల్లప్పుడూ
అది ప్రకృతి యొక్క గొప్పతనం.
కానీ మానవ తప్పిదం వల్ల
కొందరూ చేసే అక్రమాల వల్ల
దుర్బుద్ధి వల్ల వరదల బీభత్సం ఏర్పడి
ఆస్తి మరియు ప్రాణాల నష్టం ఏర్పడుతున్నాయి.
అది మానవ తప్పిదమే అవుతుంది గానీ
ప్రకృతి గుణం ఎలా అవుతుంది...?
కరడుగట్టిన స్వార్ధం తో చెలరేగే మనిషి
ఎన్ని విషపు రసాయనాలు పోసినా
ఆ గాయాలను లెక్కజేయకుండా తుడుచుకుంటూ మళ్ళీ మనల్ని మన తోటి నివసించే
పక్షులు జంతువులను ప్రతి జీవిని
తన ఒడి లో రక్షించడానికే ప్రయత్నిస్తుంటుంది నిత్యం.
ఎంత గొప్ప మనసో కదా
పుట్టినప్పటి నుండి చచ్చేదాకా
తాను తోడు ఉండి
ఒడిలో నిత్యం రక్షించుకుంటుంది.
చచ్చినా శవాన్ని కూడా
తన ఎదలోకే తీసుకొని
తన గొప్ప త్యాగాన్ని
తన గొప్ప ప్రేమను నిరూపించేస్తుంది.
అందుకేనేమో
ఏ కుళ్లు కుట్ర ఏ స్వార్ధం తెలియని
సృష్టిలోని ప్రతి జీవికి ప్రాణం పోస్తూ
ఇసుమంతా కూడా అహం లేని ఒడి
ప్రకృతి అంటే శానా ఇష్టం నాకు
స్వచ్ఛ గాలిని ఇచ్చి ఆహ్లాదాన్ని పంచుతుంది కాబట్టి....!!!

అన్ని జీవుల కంటే
మనిషి-ప్రకృతి గొప్ప బాంధవ్యం గలదేమో అనిపిస్తుంది.
ఎందుకంటే స్వచ్ఛమైన ప్రకృతి
కలుశితం అయినట్లు
ఈ మానవ సామాజిక వ్యవస్థ లో
కలుశిత కారక జీవులే నెగ్గి
పేరొంద బడుతున్నాయి.

అందుకే ఓ మనిషి...
నీ కరడుగట్టిన స్వార్థంకై
కుట్ర కుళ్లు నటన నరుకుడు
అన్యాయం ఆరాచకం అక్రమం తో
జీవించే జీవన విధానం ను విరమించేసి
నిష్కలంగా స్వచ్ఛతగా జీవించడానికి ప్రయత్నించు....
ప్రకృతి కూడా స్వచ్ఛత గా మారుతుంది.

దేవరాజ్ లింగంపల్లి
కవి రచయిత సామాజిక విశ్లేషకులు,
హన్మాజీపేట, వేములవాడ మండలం

# హైడ్రా తరహాలో బుడమేరు ఆక్రమణలు తొలగించాలి

**విజయవాడ ముంపు జాతీయ విపత్తుగా గుర్తించాలి**
**కేంద్రాన్ని కోరిన పిసిసి చీఫ్ షర్మిల**



విజయవాడ ముంపును జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. బుడమేరు రక్షణకు వెంటనే చర్యలు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణలో హైడ్రా మాదిరి.. బుడమేరు ఆక్రమణలు తొలగించాలని సూచించారు. గురువారం సింగ్‌నగర్ ప్రాంతంలో పర్యటించిన ఆమె.. వరద బాధితులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధితులను పూర్తిస్థాయిలో ఆదుకోవాలని కోరారు. వరద ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు పర్యటించి ప్రజలకు ధైర్యం చెప్పడం మంచి విషయమన్నారు. 'కొంప కొల్లేరు అయ్యింది.. బెజవాడ బుడమేరు అయింది. విజయవాడ వరదలకు బుడమేరే కారణం. వరద నీరు కొల్లేరుకు చేరేలా చర్యలు చేపట్టాలి. ఈ ప్రమాదం రాకుండా చూడాల్సిన భాధ్యత ప్రస్తుతం చంద్రబాబు మీదే ఉంది. బుడమేరుకి రిటర్నింగ్ వాల్ కట్టాలి. వరదల్లో ఇప్పటి వరకు 35 మంది చనిపోయారు. 5లక్షల మంది నష్టపోయారు. ఇది ఘోర విపత్తు. ఇంత పెద్ద విపత్తు సంభవిస్తే ప్రధాని మోదీ కనీసం స్పందించలేదని మండిపడ్డారు. విజయవాడ వరదలు కేంద్రానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఇక్కడి ఎంపీల మద్దతుతో ప్రధాని అయ్యాననే సంగతి మరిచారు. ఏపీ ప్రజల కష్టాలు మోదీకి కనిపించడంలేదు. వెంటనే స్పందించి జాతీయ విపత్తుగా ప్రకటించాలి. నష్టపోయిన ప్రతి ఇంటికి కనీసం రూ.లక్ష సాయం చేయాలని షర్మిల డిమాండ్ చేశారు.

## గురుకులాల గెస్ట్ ఫ్యాకల్టీనీ కొనసాగించాలి

- గురుకులాల గెస్ట్ ఫ్యాకల్టీ జేఏసీ



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 4 నినాదం న్యూస్:**
గత మూడు రోజుల క్రితం ఎలాంటి ముందస్తు సమాచారం లేదుకుండ తెలంగాణ వ్యాప్తంగా ఉన్న గురుకుల గెస్ట్ ఫ్యాకల్టీనీ ప్రభుత్వం తీసివేయడం జరిగిందని, వారిని కొనసాగించాలని తాండూర్ ఆర్డీఓ ఆఫీస్‌లో గురుకుల సిబ్బంది ఆర్డీఓకు బుధవారం వినతిపత్రం అందజేశారు. మధ్యంతరంలో ఇలా తీసివేస్తే ఎలా అని అలాగే పిల్లల యొక్క చదువు ఎలా కొనసాగుతుంది అని ఫ్యాకల్టీ ప్రశ్నిస్తున్నారు ప్రభుత్వం విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని ఉన్న గురుకుల విద్యాసంస్థలను ఇంకా ఆధునికరించి ఉన్నత వసతులు కల్పించి విద్యార్థులను ఇంకా తీర్చిదిద్ది వారిని ఉన్నత స్థాయిలో ఉంచాలి అనే ఆలోచన చేయాలి, కానీ అనాలోచిత నిర్ణయం వల్ల పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని వెంటనే ప్రభుత్వం పునరాలోచించుకొనీ గురుకుల గెస్ట్ ఫ్యాకల్టీని తిరిగి కొనసాగించాలని అదే విధంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (COE)ని కొనసాగించాలని, గురుకుల స్పోర్ట్స్ అకాడమీనీ కొనసాగించాలని పేర్కొన్నారు. గురుకుల సంస్థలు వసతులు అన్ని మెరుగుపరిచి గతంలో ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ ఉన్నప్పుడు ఏ విధంగా ఉండేవో ఆ విధంగా ఉండాలని ఉన్నత విద్యా ప్రమాణాలతో గురుకుల సంస్థని కొనసాగించాలని ప్రస్తుతం తీసి వేసిన పార్ట్ టైం టీచర్లును వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన చేసి అసెంబ్లీని ముట్టడిస్తామని తెలియజేశారు.

## సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలం పరిశీలన



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంబిపూర్, మల్లంపేట్, బౌరంపేట్ గ్రామంలో త్రీ -ఫేజ్ విద్యుత్ సమస్యలు పరిష్కారానికి కుత్బుల్లాపూర్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత రెడ్డి పూనుకున్నారు. ఈ ప్రాంత ప్రజలు విద్యుత్ సమస్యలతో ఎదుర్కొంటున్న విషయాన్ని గత నెలలో కె.వి ఆర్, స్ప్రింగ్ వుడ్స్, ప్రణీత్, నతురల్, బౌంటీ లృక్ రిడ్జ్ కాలనీ వాసులు కొలను హనుమంత రెడ్డికి విన్నపించారు. అందుకు స్పందించిన కొలను హనుమంత రెడ్డి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి ఈ ప్రాంత ప్రజల విద్యుత్ సమస్యల పరిష్కారానికి అవసరమైన సబ్ స్టేషన్ నిర్మాణం చేయుటకు అనుమతులు పొందారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన శంబిపూర్, మల్లంపేట్, బౌరంపేట్ గ్రామంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, ట్రాన్స్కో ఎస్ ఈ రాంజీ, ఏడి ఈ అరుణ్, ఎస్ఈ రవికుమార్, డిఈ జీడిమెట్ల విష్ణువర్ధన్ రెడ్డి, ఏ ఈ బాచుపల్లి- శాంత కుమార్, డి ఈ కూకట్ పల్లి -చక్రవర్తి , ఏడి ఈ మియాపూర్-హరికృష్ణ, ఏ ఈ భౌరంపేట్- సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మరాఠీ సమాజ్ జాగరణ వేడుకల్లో రావుల శేషగిరి దంపతులు



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ చంద్రగిరి నగర్ హనుమాన్ దేవాలయంలో మరాఠీ సమాజ్ వారి జాగరణ కార్యక్రమంలో బిజెపి నాయకులు గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి దంపతులు హాజరైనారు. ఈ సందర్భంగా మరాఠీ సమాజ్ నేతలు కార్పొరేటర్ దంపతులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుండురావు పాటిల్, సునీల్, సుకుదేవ్, ఉమకంత్ పాటిల్, మరాఠీ సమాజ్ వాసులు పాల్గొన్నారు.

## సామాజిక శాస్త్రాల అధ్యయనం పెరగాలి

- ఆచార్య సి.వి. రాఘవులు

**మహేశ్వరం, సెప్టెంబర్ 4 నినాదం న్యూస్)**
దేశాభివృద్ధిలో సామాజిక శాస్త్రాల పాత్ర ముఖ్యమైనదని, ఆయా శాస్త్రాల అధ్యయనం పెరగాలని నాగార్జున విశ్వ విద్యాలయం విశ్రాంత ఉప కులపతి ఆచార్య సి.వి. రాఘవులు అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అధ్యాపకులకు నిర్వహిస్తున్న 6 రోజుల ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా అధ్యాపకులకు నిరంతరం శిక్షణనందించాలని అన్నారు. పబ్లిక్ పాలసి కోర్స్ విద్యార్థుల్లో పోటీ పరీక్షల్లో రాణించడానికి ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాలలో పబ్లిక్ పాలసీ గురించి ప్రత్యేకంగా కోర్సు ప్రవేశ పెట్టడం అభినందనీయం అన్నారు. ఆచార్య పార్థసారథి మాట్లాడుతూ అధ్యాపకులు నిరంతర విద్యార్థులుగా ఉండాలని, శిక్షణాతరగతుల్లో పెంచు కున్న అవగాహనతో అధ్యాపకులు విద్యార్థులను తీర్చి దిద్దాలని అన్నారు. రాష్ట్రంలో వివిధ కళాశాలల నుండి శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులకు అతిథులు ధృవపత్రాలు అందించారు. వైస్ ప్రిన్సిపాల్ డా.విప్లవ దత్ శుక్లా, కన్వీనర్ డా.శంకర్ కుమార్, డా. యాదయ్య, డా.కె.భాస్కర్ డా.రవికుమార్, డా. తిరుపతి, అనిల్ బుసి కార్యక్రమంలో సిబ్బంది అభిమానులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



### అక్రమార్కులకు అడ్డాగా..

# అయ్యప్ప సొసైటీ

- నామమాత్రంగా మారిన కూల్చివేతలు
- టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేతలో మతలబు ఏమిటో..
- తిరిగి నిర్మాణం చేపడుతున్న భవన యజమానులు
- చక్రం తిప్పుతున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి కంప్యూటర్ ఆపరేటర్ గడ్డం శ్రీను



**శేరిలింగంపల్లి జోన్ (నినాదం)**
మాదాపూర్ అయ్యప్ప సొసైటీలో అక్రమ నిర్మాణాలు టౌన్ ప్లానింగ్ అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. ఇక్కడ కూల్చివేతలు ప్రహసనంగా మారాయి. భవన నిర్మాణం ప్రారంభ దశలోనే అక్రమం అని గుర్తించి పనులు నిలిపివేయాలి. 7, 8 అంతస్తులు నిర్మించిన తర్వాత కూల్చివేతలంటూ హడావిడి చేస్తున్నారు. సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేస్తారు. న్యాయస్థానాలు అడిగితే నోటీసులు జారీ చేశాం కదా అంటూ తప్పించుకుంటారు. ఇక్కడే అసలు తంతు ప్రారంభమవుతుంది. నిర్మాణాలు ఎందుకు కూల్చివేస్తారో ఎవరికి అంతు పట్టదు. భవన నిర్మాణం ప్రారంభ దశలోనే నిర్మాణం పనులు ఆపేయాలి అలా చేయకుండా భారీ అంతస్తులు నిర్మించిన తర్వాత కూల్చివేస్తామంటూ హడావుడి చేస్తారు. కూల్చివేతలు చేసేందుకు ప్రతి ఏటా కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నారు. ఎన్ని చేసినా అక్రమ నిర్మాణాలు ఆగడం లేదు. అయ్యప్ప సొసైటీ గురుకుల్ ట్రస్ట్ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. ఈ ఆదేశాలను నీరుగారిస్తూ టౌన్ ప్లానింగ్ అధికారులు ఇష్టా రీతిగా వ్యవహరిస్తున్నారు. అక్రమ భవనాలకు నోటీసులు ఇచ్చి కూల్చివేతలు చేస్తున్నారు. భవన యజమానులు తిరిగి కూల్చిన స్లాబులు నిర్మించుకుంటారు. టౌన్ ప్లానింగ్ అధికారులు వెళ్లిపోయిన మరుక్షణమే కూర్చుని స్లాబులు పునర్నిర్మానం చేస్తున్నారు. మరి ఎందుకు కూల్చివేతలు చేస్తారో అందుచికడం లేదు. ఈ మొత్తం వ్యవహారం మాఫియాని తలపిస్తుంది. టౌన్ ప్లానింగ్ అధికారులకు ప్రసన్నం చేసుకుంటే ఆ భవనాలకు కూల్చివేతలు ఉండవు.

**కూల్చివేతల చేసిన చోటే అదనపు అంతస్తులు**
మాదాపూర్ అయ్యప్ప సొసైటీలో ప్లాట్ నెంబర్ 19లో నిర్మించిన భవనాన్ని అక్రమం అంటూ కూల్చివేశారు. కూల్చిన భవనాన్ని తిరిగి ఆరు అంతస్తు నిర్మించారు. అది చాలదన్నట్లు కమర్షియల్ అవసరాల కోసం సెట్టర్లు నిర్మించారు. ఎలాంటి అనుమతులు లేని ఈ భవనానికి అదనపు అంతస్తులు నిర్మించిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అలాంటప్పుడు కూల్చివేతలకు అర్థం ఏమిటో అంతుచిక్కని పరిస్థితి నెలకొంది.

## మట్టి వినాయకులనే పూజిద్దాం

**నవరాత్రి వేడుకలపై మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి సమీక్ష**



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ (నినాదం న్యూస్)**
నవరాత్రి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించు కోవాలని, మట్టి వినాయకులనే పూజిద్దాం అని మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి సూచించారు. వినాయక చవితి ఉత్సవాలు నేపథ్యంలో బుధవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి అధ్యక్షతన డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కమిషనర్ సౌజన్య, ప్రజాప్రతినిధులతో కలిసి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఈనెల 7న వినాయక చవితి సందర్భంగా కార్పొరేషన్‌లోని ఆయా డివిజన్ల పరిధిలో గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యాలలో నిర్వహించే నవరాత్రి వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని,పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించాలని సూచించారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు పడనున్న నేపథ్యంలో కార్పొరేషన్ ఆయా డివిజన్ల పరిధిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వినాయక మండపాల వద్ద భద్రత,డ్రైనేజ్ వ్యవస్థ,వరద,మురుగు నీటి తరలింపు,విద్యుత్ తీగలు,చెట్ల కొమ్మలు, పురాతన సముదాయాల పట్ల జాగ్రత్త,దోమల వలన కలుగు డెంగ్యూ,మలేరియా వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వినాయక నిమజ్జనం సమయంలో చెరువుల వద్ద క్రేన్ల ఏర్పాటు,ట్రాఫిక్ నియంత్రణ, మళ్లింపు చర్యలు,భక్తుల సౌకర్యం కొరకు ప్రత్యేక హెల్ప్ డెస్క్,త్రాగు నీరు,మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు,ఫస్ట్ ఎయిడ్ సెంటర్, చెరువులలో ఎప్పటికప్పుడు విగ్రహ వ్యర్థాల తొలగింపు చర్యలు వంటి అంశాలను అధికారులతో చర్చించారు. వినాయక చవితి నవరాత్రి వేడుకలు ముగిసే వరకు, నిమజ్జన సమయంలోను అధికారులు,సిబ్బంది అనుసరించే విధి విధానాలను ఈ సందర్భంగా వివరించారు. ఎక్కడా కూడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో సమిష్టిగా కృషి చేయాలని, అందుకు ఆయా గణేష్ ఉత్సవ కమిటీలు,ప్రజలు సహకరించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవ వేడుకలు భక్తులు భక్తి పారవశ్యంలో ఉండే విధంగా నిర్వహించుకోవాలని తెలుపుతూ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు,ప్రజాప్రతినిధులు,సీనియర్ నాయకులు,యువ నాయకులు,ఆయా గణేష్ ఉత్సవ నిర్వాహకులు, ఆయా విభాగాల అధికారులు, సివిల్, ట్రాఫిక్ పోలీస్ అధికారులు,ఇతర ముఖ్యులు పాల్గొన్నారు.

## రుణమాఫీ కాలేదు-రైతు 'భరోసా' ఇవ్వలేదు

**-అధికారుల చుట్టు తిరుగుతున్న రైతులు**
**-పొంతనలేని సమాధానాలు చెబుతున్న అధికారులు**



**కొడంగల్ సెప్టెంబర్ 3 (నినాదం న్యూస్)**
రుణమాఫీ కాలేదని వారం రోజుల నుండి బ్యాంకు అధికారుల చుట్టూ, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నామని, అధికారులు సరైన సమాధానం చెప్పడం లేదని బొంరాస్ పేట్ మండలంలోని నాందార్ పూర్ గ్రామానికి చెందిన కె.బుగ్గప్ప, మంబపురం రాములు వాపోయారు. బ్యాంకు వెళ్ళితే వ్యవసాయ అధికారుల దగ్గరకు పంపుతున్నరు, వ్యవసాయ అధికారులు బ్యాంకు అధికారుల దగ్గరకు పంపుతున్నరు... ఇలా రోజు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగడం అవుతుందనీ వారు అంటున్నారు. నాందార్ పూర్ గ్రామానికి చెందిన కె.బుగ్గప్ప అనే రైతుకు గత ప్రభుత్వంలో రుణమాఫీ జరగగా మళ్ళీ క్రొత్తగా గత సెప్టెంబర్ మాసంలో లక్షా నలభై వేల రూపాయల వ్యవసాయ రుణం తీసుకున్నారు.రుణమాఫీ అమలు కు డిసెంబర్ 9కటాఫ్ తేదీ ఉండగా తాను రుణమాఫీ పొందడానికి అర్హుడైనప్పటికీ రుణమాఫీ కాలేదని,వ్యవసాయ అధికారులను అడిగితే బ్యాంకుకు వెళ్ళమన్నరు, బ్యాంకు వెళ్ళితే వ్యవసాయ అధికారులను కలువమంటున్నరనీ ఇలా రోజు అధికారుల చుట్టూ తిరగడమే సరిపోతుందనీ, రుణమాఫీ అవుతదో లేదో తెలియడం లేదంటున్నారు.

అదే గ్రామానికి చెందిన మంబపురం రాములు 2018లో 30వేల రూపాయలు వ్యవసాయ రుణం తీసుకొనగా,గత ప్రభుత్వం లో రుణమాఫీ 82వేలు వచ్చింది, మిగతా52వేల రూపాయలు కట్టమని బ్యాంకు అధికారులు అడిగారని, ఇప్పటి ప్రభుత్వం లో రుణమాఫీ కాలేదని, అధికారులు చుట్టూ తిరుగుతున్నట్లు ఆయన తెలిపారు. తనది మొండి బకాయి కింద ఉంది కాబట్టి రుణమాఫీ జరగలేదని అధికారులు చెబుతున్నారనీ, గత ప్రభుత్వంలో వచ్చింది ఇప్పుడెందుకు రాదని రాములు ప్రశ్నిస్తున్నడు.

**రైతు "భరోసా" కూడా ఇవ్వలేదు**
గత కెసిఆర్ ప్రభుత్వం లో ప్రతి పంటకు వ్యవసాయ సాయం కింద ప్రతి ఎకరానికి ఐదువేల చొప్పున రైతు బంధు పేరిట రైతులకు ఆర్థిక సాయం అందించేదనీ,వ్యవసాయం సాగు చేసుకోడానికి ఎవరి దగ్గర చేయి చాచే పరిస్థితి ఉండేది కాదంటున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏడాది ఎకరానికి పదిహేను వేలు రైతు భరోసా కింద ఇస్తామన్నారు. కానీ ఖరీఫ్ సీజన్ ముగియవస్తుంది కానీ నేటికీ ఒక్కరూపాయి కూడా ప్రభుత్వం రైతు భరోసా కింద ఇవ్వలేదని,రైతు భరోసా ఊసేలేదనీ వాపోతున్నారు. పంట పెట్టుబడికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు.నేటి ప్రభుత్వం కంటే గత ప్రభుత్వమే మేలు ఉండేదనీ అంటున్నారు రైతులు.

# కబ్జాదారుల్లో వణుకు

**సీఎం రేవంత్ ప్రకటనపై ఆక్రమణదారుల గుండెల్లో గుబులు**
**సమర్థ అధికారులను ఎంపిక చేయాలని ప్రజల విన్నపం**



**చర్ల, సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్) :**
జిల్లాల్లో హైడ్రా తరహా వ్యవస్థను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లను ఆదేశించడంతో భూముల కబ్జాదారుల్లో వణుకుపుడుతోంది. హైడ్రా మండల స్థాయిలో వస్తే మా గతి ఏంటని భూ ఆక్రమణదారులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, నాళాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణ యథేశ్చగా సాగిందనే విమర్శలు ఉన్నాయి. అడ్డు అదుపు లేకుండా సాగిన ఈ ఆక్రమణల పర్వం జిల్లా, డివిజన్ కేంద్రాలకే పరిమితం గాకుండా చివరకు మారుమూల మండలాలకి సైతం పాకింది. నువ్వు భూముల ఆక్రమణదారుడివి అని నీతులు చెప్పే పెద్దలే ఇక్కడకు వచ్చే అధికారులను తమ పలుకుబడి, పరపతి ఉపయోగించి గుప్పిట పెట్టుకొని 1/70 చట్టాన్ని పాతరేసి వారి కళ్ళముందే తమ భూములను యథేశ్చగా అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా సందు దొరికినపుడల్లా ఎకరాలకు ఎకరాలు అమ్మేస్తూ కోట్లకి పడగలెత్తుతున్నా ఈ అమ్మకాల వలన ప్రభుత్వానికి పైసా ఆదాయం లేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఇక్కడ భూముల రిజిస్ట్రేషన్ లేనపుడు ప్రభుత్వానికి పైసలు ఎలా కడతామనే జవాబు వారి నుంచి వినిపిస్తోంది. చర్లలో ఇండ్ల స్థలాల డిమాండ్‌ని బట్టి ధరలకు రెక్కలు రావడంతో వ్యవసాయ భూములు కూడా ఇండ్ల ప్లాట్లుగా మారిపోతున్నాయి. కాసింత జాగ కనిపిస్తే చాలు.. ఏజెన్సీ నిబంధనలను పాతరేసి
గిరిజన, గిరిజనేతర అనే తేడా లేకుండా కబ్జా చేస్తున్నారు. అధికారులు చూస్తుండగానే ఎలాంటి అనుమతులు లేకుండా ఆక్రమిత స్థలాల్లో పక్కా భవనాలు వెలుస్తున్నాయి. కొందరు ధనవంతులైతే పట్టా భూములను ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాలను కూడా ఆక్రమించి ఇదంతా మా భూమి అని గొప్పలు చెప్పుకోవడం గమనార్హం. చర్లలో భూముల ధరలను బట్టి పేదలు రెండుమూడు సెంట్ల ఇంటిస్థలం కూడా కొనుక్కునే పరిస్థితి లేదు. ధనవంతులు ఆక్రమిస్తే పట్టించుకోని అధికారులు పేదలు ప్రభుత్వ స్థలంలో చిన్న గుడిసె వేస్తే వారిని ఖాళీ చేయించే వరకు ఆగడంలేదు. పేదల విషయంలో మాత్రం అధికారులకు చట్టాలు, నిబంధనలు గుర్తుకు వస్తున్నాయి. కాదేదీ కబ్జాకి అనర్హం అన్నట్లు పూర్వం రజకుల దోబీఘాట్‌కి ప్రభుత్వం కేటాయించిన పాతచర్లలో బోయికుంటని సైతం ఆక్రమణదారులు వదల్లేదు. బోయికుంటని చుట్టుప్రక్కల కుటుంబాల వారు పోటీపడి మరీ ఎడాపెడా ఆక్రమించి భవనాలు కట్టేస్తున్నారు. మరికొందరైతే కబ్జా చేసిన భూములను యథేశ్చగా అమ్ముకుంటున్నారు. రెవిన్యూ రికార్డుల ప్రకారం పూర్వం దాదాపు ఆరు ఎకరాలు ఉండే బోయికుంట ఇపుడు ఎకరం కూడా లేదు అంటే ఏ మేరకు ఆక్రమణ జరిగిందో చెప్పవచ్చు. ఆక్రమణదారులకు రాజకీయ నాయకులు అండగా నిలవడం గమనార్హం.

**రంగనాథ్ వంటి అధికారులు రావాలి**
కబ్జా కొర్రల్లో చిక్కుకున్న భూములకు విముక్తి కలిగించడం కోసం హైడ్రా లాంటి వ్యవస్థ రావాలని మారుమూల మండలాల ప్రజలు సైతం కోరుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా అమలు చేయాలని ఇప్పటికే ప్రజల నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విన్నపాలు వెళుతున్నాయి. ప్రజల కోరిక మేరకే జిల్లాల్లో హైడ్రా వంటి వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి కలెక్టర్లకి సూచించారు. సీఎం నిర్ణయాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారు. అయితే వ్యవస్థ వస్తే సరిపోదని రంగనాథ లాంటి నికార్సైన అధికారులు ఆ పోస్టులకు వస్తేనే ప్రయోజనం ఉంటుందని ప్రజలు ఆశిస్తున్నారు. మొక్కుబడి అధికారులు వచ్చినా లేదా ఆ విభాగం అధికారులపై రాజకీయ పెత్తనం ఉన్నా ఫలితం శూన్యం అనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమౌతోంది. ఆక్రమిత భూములు, చెరువులకు విముక్తి కలిగించడం వలన ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని జనం చర్చించుకుంటున్నారు.

## ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**మహేశ్వరం, సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్)**
వర్షాకాలంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం మహేశ్వరం మండలం పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. రాష్ట్రంలో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో, మహేశ్వరం మండల కేంద్రం లోగల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన అనంతరం ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి ఆసుపత్రి సూపరింటెండెంట్ అమీర్ సిద్దిఖ్ తో హాస్పిటల్ కు సంబంధించిన వైద్య వివరములు, వైద్య సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది వచ్చే రోగుల సంఖ్య సంబంధించిన విషయాలు విషయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రా రెడ్డి మాట్లాడుతూ.. వర్షాభావ ప్రభావం వలన ప్రజలు డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్ సంబంధిత ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారికి మంచి వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు,కార్యకర్తలు,వివిధ పార్టీలకు చెందిన నాయకులు, మీడియా సోదరులు అభిమానులు పెద్దలు పార్టీ శ్రేణులు నాయకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జవహర్ నగర్‌లో ఇళ్లలోకి వరద నీరు



**జవహర్ నగర్, సెప్టెంబర్ 4:నినాదం న్యూస్,**
భారీ వర్షంతో జవహర్ నగర్ కార్పొరేషన్‌లో వరద నీరు ఇళ్ళలోకి చేరింది. కార్పొరేషన్‌లోని చెన్నాపురం చెరువు పూర్తిగా నిండటంతో వరద కాలువులు అస్థవస్తంగా మారడంతో బుధవారం సంతోష్ నగర్, పాపయ్యనగర్ కాలనీలోని ఇళ్ళలోకి వదర నీరు ప్రవహించింది. విషయం తెలుసుకున్న మేయర్ శాంతికోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, యువజన విభాగం అధ్యక్షుడు వినయకుమార్ వరద ప్రాంతంలో పర్యటించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రభుత్వం పరంగా సాయం అందేలా కృషి చేస్తామని నాయకులు తెలిపారు.

## ఎమ్మెల్సీ కోదండరామ్‌కు గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ నేతల సన్మానం

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్)**
తెలంగాణ రాష్ట్ర శాసన మండలి సభ్యులుగా నియమితులైన తెలంగాణ ఉద్యమ నేత ప్రొఫెసర్ ఎం. కోదండరామ్‌కు గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటీవ్ హౌసింగ్ సొసైటీ నాయకులు శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. బుధవారం హైదరాబాద్ లోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ఆయనకు జరిగిన పౌర సన్మాన కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌ను పూలబొకే, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్, నాయకులు తన్నీరు శ్రీనివాస్, యర్రమిల్లి రామారావు, పులిపలుపుల ఆనందం, సీహెచ్ వీరారెడ్డి తదితరులు ప్రొఫెసర్ కోదండరాంను సన్మానించారు.





## డిజె వద్దు- ప్రశాంత ముద్దు

**- వినాయక ఉత్సవాలపై యువతకు డిఎస్పీ ఉమామహేశ్వర రావు సూచన**

**మల్లాపూర్, సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్)**

వినాయక ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని యువకులకు డీఎస్పీ ఉమామహేశ్వర రావు వివరించారు. బుధవారం మల్లాపూర్ మండలాలోనీ కేఎంఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల పరిధిలోని గ్రామాల్లో వినాయక ఉత్సవాలు నిర్వహించే యువకులతో మాట్లాడారు. పలు జాగ్రత్తలు సూచించారు. వినాయక విగ్రహం పెట్టుటకు తప్పకుండా పోలీసు స్టేషన్ నుండి అనుమతి తీసుకోవాలని సూచించారు. వినాయక ఉత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో, ఐకమత్యంతో, ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. పెద్దపెద్ద డిజె శబ్దాలు పెట్టడం వల్ల పసిపిల్లలకు, గుండె జబ్బులు కలవారికి, ముసలి వాళ్ళకు అనేక రకాల ఇబ్బందులు కలుగుతాయని, పలురకాల కారణాలతో డిజె లు పెట్టుకోడానికి అనుమతి లేదన్నారు. నిమజ్జనం రోజున అందరూ కలిసి మెలిసి ఊరేగింపులు చేసుకోవాలనీ, తగాదాలకు, గొడవలకు తావీయకుండా సామరస్యంగా ముందుకెళ్తూ, ఎవరికీ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముగింపు కార్యక్రమం చేసుకోవాల న్నారు. ఈకార్యక్రమంలో సిఐ నిరంజన్ రెడ్డి, ఎస్ఐ కిరణ్ కుమార్, యువకులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలపై కార్పొరేటర్ పాదయాత్ర



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్)**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ రావి నారాయణరెడ్డి నగర్, న్యూ భవాని నగర్ సంఘమిత్ర స్కూల్ పరిసర ప్రాంతాలలో వర్షపు నీరు ద్వారా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొనుటకు డివిజన్ కార్పొరేటర్, బిజెపి నేత రావుల శేషగిరి పాదయాత్ర నిర్వహించి పరిస్థితులను బుధవారం పరిశీలించారు. అనంతరం కైసర్ నగర్ లో వర్షం కారణంగా డ్రైనేజీ, రోడ్లు సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సాయినాథ నేత, జిల్లా ఓబీసీ ప్రచార కార్యదర్శి మురళీకృష్ణ, శ్రీనివాస్, బాలకృష్ణ, ప్రభాకర్, శేఖర్, శ్రీనివాస్ రాజు, చిన్న శ్రీను, శారద, లక్ష్మి తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## నష్టాన్ని మిగిల్చిన భారీ వర్షాలు

**- పరిశీలించిన తహశీల్దార్**



**భీమదేవరపల్లి సెప్టెంబరు 4 (నినాదం న్యూస్)**

ఇటీవల కురిసిన భారీ వర్షాలు భీమదేవరపల్లి మండలంలో తీవ్ర నష్టాన్ని కలిగించాయి. వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లాయి. చెరువులకు గండ్లు పడడంతో వందల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. కొన్ని గ్రామాల్లో రోడ్లు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వర్షాలతో జరిగిన నష్టాన్ని తహసిల్దార్ ప్రవీణ్ కుమార్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలోని ముల్కనూర్, కొత్తకొండ, మల్లారం తదితర గ్రామాల్లో పర్యటించారు. అధిక వర్షాలతో జరిగిన నష్టాన్ని అంచనా వేసి, నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కాగా మండలంలో జరిగిన పంట నష్టం వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించలేదు. దీనిపై మండల వ్యవసాయ శాఖ అధికారిణి పద్మను వివరణ కోరగా రైతు రుణమాఫీ పనులపై బిజీగా ఉన్నామని, వచ్చే రెండు రోజుల్లో పంట నష్టంపై వివరాలు సేకరిస్తామని చెప్పారు.

## నష్టపరిహారం ఇవ్వాలని వినతి

**మునగాల,సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్):**

గత మూడు రోజులుగా మునగాల మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను సర్వే చేయించి సదరు రైతులకు ఆర్థిక చేయూత అందించాలని మునగాల మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త గంధం సైదులు, బీసీ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షులు గడ్డం లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో రైతులు బుధవారం స్థానిక తహసిల్దార్ ఆంజనేయులు వినతి పత్రం అందించారు. అనంతరం రైతులు మాట్లాడుతూ... విస్తారంగా కురిసిన వర్షాల కు తాము సాగు చేసిన పంటలు పూర్తిగా మునిగిపోయాయని వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా చితికిపోయామని.... దిక్కు తోచని స్థితిలో ఉన్న మాలాంటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్వేనెంబర్ 272,265,263 లలో వరి పంట పూర్తిగా వరద నీటిలో మునిగి పోయిందని సదరు భూములను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సర్వే చేయించి నష్టపరిహారం అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు.. రోశయ్య, రామకోటి, మధుసూదన్, శ్రీశైలం, కోటి లింగం, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



# ముంచుకొస్తున్న.. మరో ప్రమాదం

**పరవళ్ళు తొక్కుతున్న వరద గోదావరి**

**లోతట్టు ప్రాంత వాసులను తరలింపు**



**మణుగూరు, సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్) :**

పినపాక నియోజకవర్గం వర్గంలో వరద గండం నుంచి ఇప్పుడిప్పుడే కోరుకుంటున్నా ప్రజలకు మరల వరద గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో మరో ప్రమాదం పొంచి ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. నియోజకవర్గం అనుసంధానం చేస్తూ ప్రవహించే గోదావరి నది ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు భారీగా రావడంతో భద్రాచలం, మణుగూరు ప్రాంతాల్లో గోదావరి 45 అడుగులకు చేరుకుంది. అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. సమాచారం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖల అధికారులను అలర్ట్ చేస్తూ లోతట్టు ప్రాంతాలో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కుంటలకు చెరువులకు గళ్ళు బడి మణుగూరు పట్టణం మొత్తం వరద బీభత్సం సృష్టించింది. దీంతో అనేకమంది సర్వస్వం కోల్పోయారు. ఇళ్లు సైతం కోల్పోయి ఇంకా పునరావాస కేంద్రాల్లోనే నివాసం ఉంటున్నారు. మరలా వరద గోదావరి తన ఉగ్రరూపాన్ని దాల్చుతూ పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తుంది. గోదావరి నదికి చుట్టుపక్కల లోతట్టు ప్రాంతాల్లోకి ఇప్పటికే వరద నీరు నెమ్మదిగా వచ్చి చేరుతోంది. భద్రాచలం నుంచి మణుగూరు వచ్చే ఇరవై వెండి వద్ద వరదనీరు రావడంతో రహదారిని మూసివేశారు. భద్రాచలం నుంచి చర్ల వెంకటాపురం వేలూరుపాడు కుకునూరు కూనవరం గ్రామాల్లోకి రవాణా సౌకర్యాలు నిలిచిపోయింది. ఇప్పటికే ప్రధాన రహదారులపై గోదావరి నీరు వచ్చి చేరడంతో ముందస్తు జాగ్రత్తగా అధికారులు రవాణా సౌకర్యాలు నిలిపేశారు. దీంతో ఛత్తీస్గఢ్, ఒరిస్సా రాష్ట్రాలకు వెళ్లే వాహనాలన్నీ సారపాక వద్ద నిలిపివేశారు. గోదావరి వరదలు గంట గంటకు పెరుగుతుండడంతో ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా అధికారులు ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బందిని అగ్నిమాపక సిబ్బందిని రెవెన్యూ ఫారెస్ట్ చెందిన సిబ్బందిని రంగంలోకి దింపారు. ఏ క్షణంలోనైనా వరద ఉధృతి పెరిగే అవకాశం ఉండటంతో ముందస్తు జాగ్రత్తలు చేపట్టి నదిలో చేపలు పట్టే జాలర్లుకు కూడా ఆదేశాలు జారీ చేశారు. ఎగువ ప్రాంతంలో ఉన్న శ్రీరాంసాగర్ కాళేశ్వరం తుంగభద్ర నదులలో ఉన్నటువంటి నీటిని కింది ప్రాంతాలకు విడుదల చేయడంతో గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో ఉండే గ్రామస్తులను పోలీసు రెవెన్యూ అధికారులు హెచ్చరికలు జారీ చేసి సురక్షిత ప్రాంతాలకు ముందే తరలి వెళ్లాలని ఆదేశాలు జారీ చేశారు. గోదావరికి ఉపనదులు మంజీర ప్రాణహిత తాళి పేరు చత్తీస్గడ్ రాష్ట్రం నుంచి వాగుల ద్వారా వరద నీరు భారీగా వచ్చి గోదావరి నదిలో కలవడంతో నదీ ప్రవాహము ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తుంది. గోదావరి ఉగ్రరూపం దాల్చి దుమ్ముగూడెం అశ్వాపురం మండలాల మధ్య నిర్మాణంలో ఉన్న సీతమ్మ సాగరు సీతారామ సాగర్ రెండు ప్రాజెక్టులపై వరదనీరు ప్రవహించడంతో ఇరిగేషన్ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మరో 48 గంటల్లో భారీ వర్షాలు ఉండటంతో వరద ఉధృతి ప్రమాద స్థాయికి చేరుకునే అవకాశం ఉన్నట్లు జలవనరుల శాఖ ద్వారా సమాచారం తెలుస్తుంది. గోదావరి పరివాహ ప్రాంతాలైన బూర్గంపాడు, ఇర వెండి, అశ్వాపురం మండలంలో అమ్మగారి పెల్లి కుమ్మరిగూడెం, రాయి గూడెం, మణుగూరు మండలంలో, రామంజరం, కొండాయిగూడెం, పినపాక మండలంలో రాయి గూడెం, చింతల బయ్యారం, టీ కొత్తగూడెం, భూపతిరావుపేట తదితర ప్రాంత వాసులను జిల్లా అధికారులు హెచ్చరికలు జారీ చేస్తూ గోదావరి వరదల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు జిల్లా అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

**వైద్య ఆరోగ్య, పశు వైద్య కళాశాలల ఏర్పాటుకు**

## సహకరించిన రైతులకు అభినందనలు

**భూబాధితులకు చెక్కులు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



**కొడంగల్ సెప్టెంబర్ 4 నినాదం న్యూస్**

వైద్య కళాశాలల ఏర్పాటులో సహకరించిన రైతులు అభినందనీయులని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం కొడంగల్‌లోని కాడా కార్యాలయంలో వైద్య ఆరోగ్య, పశు వైద్య కళాశాలల నిర్మాణాలకు భూమిని కోల్పోతున్న అప్పాయి పల్లి రైతులకు నష్టపరిహారం గా చెక్కులను, ఇంటి స్థలాల పత్రాలను రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ అందజేశారు. వైద్య కళాశాలల నిర్మాణాలకు 60 ఎకరాలకు గాను 55 ఎకరాలను 51 మంది రైతుల నుండి సేకరించి రూ. 5 కోట్ల 50 లక్షల నష్ట పరిహారాన్ని అందజేశారు. ఎకరానికి రూ.10 లక్షల చొప్పున చెక్కులను అదేవిధంగా 125 చదరపు గజాల ఇంటి స్థల ధ్రువ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం కొడంగల్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు రైతులు తమ భూములను స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇచ్చి భాగస్వాములయ్యారన్నారు. వైద్య కళాశాలలకు భూముల ను స్వాధీనం చేసిన రైతు కుటుంబాలకు ఇంటికి ఒకటి చొప్పున విద్యార్హతలను బట్టి వైద్య కళాశాలల్లో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ముందుగా భూములు కోల్పోయిన రైతులకు ఇళ్ల స్థలాలకు లేఅవుట్లను రూపొందించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ప్రాధాన్యత కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ , తాండూర్ ఆర్డీవో శ్రీనివాసరావు, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జీ తిరుపతి రెడ్డి, తహసిల్దార్ విజయకుమార్,మాజీ ఎంపిపి ముద్దప్ప దేశ్ముఖ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై దాడి చేసిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

**ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం**




**శంషాబాద్ సెప్టెంబర్ (నినాదం న్యూస్)**

రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ మండలం, పాలమాకుల కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులపై దాడిని చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులపై పాఠశాల సిబ్బంది కొట్టడం తిట్టడం జరిగిందని విద్యార్థులు రోడ్డుపై బయటా యించి నిరసన వ్యక్తం చేశారు. పాఠశాలలో అనేక సమస్యలతో సతమతమవుతున్నామని సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులు బహిరంగంగా రోడ్లపైకి వచ్చి నిరసన చేస్తున్నారంటే విద్యా వ్యవస్థ ఎంత అధ్వానంగా ఉందో తెలుస్తోంద న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల, కేజీబీవీ, మాడల్ పాఠశాలలో సామాజికంగా ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, వార్డెన్, సంబంధిత అధికారులు నిర్లక్ష్యానికి పై అధికారులు, ప్రజా ప్రతినిధులు బాధ్యత వహించాల న్నారు. అనేక సమస్యలు చాలా ప్రభుత్వ విద్య సంస్థలలో ఉన్నప్పటికీని ప్రభుత్వం సమస్యలు పరిష్కారంలో విఫలమైందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ 8300 కోట్ల రూపాయలు పెండింగ్లో ఉందని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేష్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బేగరి ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు మైలారం సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు తేరుపల్లి ప్రవీణ్, చేవెళ్ల మండల అధ్యక్షులు మల్లెపల్లి శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు కావలి గణేష్, కాంగ్రెస్ నాయకులు మాచనపల్లి రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రరూపం దాల్చిన కిన్నెరసాని

**జిల్లా కేంద్రానికి నిలిచిపోయిన రాకపోకలు**





**ఆళ్లపల్లి సెప్టెంబర్ 4 నినాదం న్యూస్**

గత రాత్రి నుండి కురిసిన కుండ పోత భారీ వర్షానికి ఆళ్లపల్లి మండలం జలదిగ్బంధంలో చిక్కుకపోయి జిల్లా కేంద్రానికి నిలిచిపోయిన రాకపోకలు, కురుస్తున్న భారీ వర్షానికి జల్లేరు, కోడెల, పుణ్యపువాగులు కిన్నెరసాని నది ఉగ్రరూపం దాల్చి ఉప్పొంగి ప్రవహించాయి. రాయపాడు వద్ద కిన్నెరసాని బ్రిడ్జిపై భారీ వరద ప్రవాహం ప్రవహించింది. రాయి గూడెం,కర్ణెగూడెం, చంద్రాపురం, పాతూరు, అడవి రామవరం ఆ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి ఇంట్లోనే దాచుకొని బయందోళన చెందుతున్నారు. అంతర్గత రహదారులు బురద మయంగా మారి లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. రాఘవపురం గ్రామపంచాయతీ బండారుగూడెం గ్రామానికి చెందిన గొగ్గెల నాగమణి ఇల్లు వరద ప్రవాహం వచ్చి నీట మునిగి ఇంట్లో ఉన్న గృహపకరణాలు తడిసి ముద్దయ్యాయి. రాఘవపురం గ్రామపంచాయతీ చంద్రాపురం గ్రామంలోని మర్లకుంట చెరువు అలుగు పగుళ్లు వచ్చాయి దీంతో ప్రమాదం పొంచి ఉందని ఆ గ్రామస్తులు అంటున్నారు. బండారుగూడెం దగ్గర జల్లేరు వాగు అవతల కట్టేసిన ఎడ్లను చూసి యువతల కట్టేసిన సీతానగరం చెందిన పూనెం లక్ష్మయ్య, చెందిన రెండు దుక్కి టెద్దులు తాడును గుంజుకొని వాగు వరదలో పడి మృతి చెందాయి. కిన్నెరసాని రాయపాడు వద్ద స్థానిక ఎస్సై రతీస్ ఆధ్వర్యంలో అటువైపు ప్రయాణికులు వెళ్లకుండా పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



## అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి

**- ముంపు ప్రాంతాలలో పర్యటించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**

**అల్వాల్, సెప్టెంబర్4 నినాదం న్యూస్)**

మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని మచ్చబొల్లారం డివిజన్ తుర్కపల్లిలోని ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. హకీంపేట్ ఎర్పోర్ట్ నుండి దిగువ ప్రాంతాలైన మడికట్ల బస్తీ, శ్రీదామ్ ఎంక్లేవ్ ప్రాంతలలలోకి వరద నీరు భారీగా చేరడంతో ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు మంగళవారం రాత్రి నుండి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూసి ఉన్న హకీంపేట ఎయిర్పోర్ట్ 8వ నెంబర్ గేటు తెరిపించి లోపలికి వెళ్ళి ఎయిర్ ఫోర్స్ అధికారులు సుమంత్, రమేష్‌లతో మాట్లాడిన ఎమ్మెల్యే మరి రాజశేఖర్ రెడ్డిసమస్య పరిష్కారం కోసం బల్దియా ఇంజనీర్లు ఎయిర్ ఫోర్స్ ఇంజనీర్లు సమన్వయంతో పని చేసే విధంగా అవకాశం కల్పించాలని ఎయిర్ ఫోర్స్ అధికారులను కోరారు. వీలైనంత త్వరలో ఎయిర్ ఫోర్స్ బల్దియా అధికారులతో ఒక సమావేశం ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చర్చించి తగు చర్యలు తీసుకుంటానని స్థానిక ప్రజలకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి భరోసా కల్పించారు. కార్యక్రమంలో బల్దియా అధికా రులు ఈ.ఈ శ్రీకాంతీ, డి.ఈ.ప్రశాంతి, ఎ.ఈ. రవళి బి.ఆర్.ఎస్ నాయకులు అనిల్ కిషోర్, మేకల రాము యాదవ్, దోలి రమేష్, మల్లేష్ గౌడ్, శోభన్ బాబు, గిరి, జావేద్, సందీప్ రెడ్డి పాల్గొన్నారు.



## గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



**అల్వాల్, సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్)**

అల్వాల్ జిహెచ్ఎంసి అల్వాల్ సర్కిల్‌లోని కొత్తచెరువు బేబీ పాండ్ వినాయక నిమజ్జన కోసం నిర్మిస్తున్న షెడ్ పనులను కూకట్పల్లి జోన్ జోనల్ కమిషనర్ అపూర్వ చవాన్, డిసి శ్రీనివాస్ రెడ్డి, ఎస్ ఇ చిన్నారెడ్డి, మున్సిపల్ సిబ్బంది విజయ రామారావు వెంకటేష్ పర్యవేక్షించారు.

## ముత్తారం తండాకు రోడ్డు నిర్మాణం చేయండి

**- రోడ్డులేక అవస్థలు పడుతున్న తండావాసులు**



**భీమదేవరపల్లి సెప్టెంబరు 04 (నినాదం న్యూస్)**

తండాకు వెళ్లే మట్టిరోడ్డు కోతకు గురికావడంతో తండావాసులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు తండా వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. తండాకు చేరుకోవాలంటే మధ్యలో ఉన్న చెరువు కట్ట మత్తడిని దాటుకొని వెళ్లాల్సిందే. వర్షకాలం వస్తే చాలు అడ్డంగా నీటి ప్రవాహంతో అవస్థలు పడుతున్న పరిస్థితి నెలకొంది. రోడ్డు ధ్వంసం కావడంతో పాల సేకరణ కోసం తండాకు వ్యాన్ రావడంలేదు. పాడి పశువులే ఆధారంగా బ్రతుకుతున్న వారు తప్పని పరిస్థితితుల్లో పాలు విక్రయించేందుకు ముత్తారం గ్రామంలోని పాల కేంద్రాలకు అతి కష్టమీద చేరుకుంటున్నారు. తండాకు తారు రోడ్డు, మధ్యలో ఉన్న చెరువు మత్తడి వద్ద కల్వర్టు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. గిరిజన తండాల అభివృద్ధికి కేటాయించిన నిధుల నుండి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు నిర్మాణం రవాణా బిసి సంక్షేమ శాఖ మంత్రి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇందులో తండావాసులు ప్రొ.జి. వీరన్న నాయక్, కొర్ర లక్ష్మణ్, నాయక్, కొర్ర సంపత్, కొర్ర తిరుపతి నాయక్, కొర్ర శ్రీనివాస్, గుగులోత్ బాలు నాయక్, కొర్ర పాపయ్య నాయక్ తదితరులు ఉన్నారు.

## తండ్రికి తలకొరువు పెట్టిన తనయ

**మునగాల,సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్):**

మునగాల మండల పరిధిలోని కొక్కిరేణి గ్రామంలో సిపిఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు రేఖ తిరపయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం ఉదయం మృతి చెందారు. తిరపయ్య మృతదేహానికి ఎర్ర జెండా కప్పి పలువురు న్యూ డెమోక్రసీ నాయకులు నివాళులు అర్పించారు. మృతునికి కుమారులు లేకపోవడంతో కూతురు సుస్మిత తండ్రికి తల కొరివి పెట్టి... దహన సంస్కారాల కార్యక్రమాలని నిర్వహించింది. అనంతరం సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు వక్కవంతుల ప్రభాకర్ రావు, ధారావత్ రవిలు మాట్లాడుతూ.. పార్టీ కోసం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశాడని, ప్రజా ఉద్యమాలలో భాగస్వాములై ముందుండి నడిచారని అన్నారు. పార్టీ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేశారని కొనియాడారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం ఉదయం చనిపోవడం బాధాకరమైన విషయం అని అన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు, రేఖ తిరపయ్యకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు మేదరమట్ల వెంకటేశ్వరరావు, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ గ్రామ శాఖ నాయకులు డి సైదా, బ్రహ్మం, కోటయ్య, యల్లవుల సైదులు, కోటయ్య, గడ్డం సైదులు, కళింగ రాజు, చిన్న వెంకన్న, వీరయ్య పాల్గొన్నారు.



## భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

### ఎమ్మెల్యే, నేనావత్ బాలు నాయక్



**చింతపల్లి, సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్):** నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఆదేశించారు. పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం ఆయన రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు లలో పెండింగ్ లో ఉన్న భూ సమస్యలు తప్ప మిగతా భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నియోజక వర్గంలో ఉన్న పెండింగ్ వ్యవసాయ, వ్యవసాయేతర భూ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండల, గ్రామాల వారీగా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి సమగ్ర సర్వే చేపట్టి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, కమీషనర్ భాస్కర్ రెడ్డి, డి ఎస్ పి. గిరిబాబు, ఆర్ డి ఓ. శ్రీరాములు, తహసీల్దార్ సంతోష్ కిరణ్, కౌన్సిలర్లు సైదులు, కొండ్ర మల్లీశ్వరి శ్రీశైలం యాదవ్, పిఎసిఎస్. చైర్మన్ శ్రీశైలం యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల గోవర్ధన్ రెడ్డి, మాజి మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య, సతీష్ రెడ్డి, ప్రదీప్, గాజుల మురళి తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పేరుమాళ్ల యాదయ్య



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్) :** సూర్యాపేట ప్రిన్సిపల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పెరుమాళ్ళ యాదయ్య బుధవారం ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఉపాధ్యక్షుడిగా జానపాటి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా డి .విజయ నాయక్, కోశాధికారిగా ధార పాండయ్య, నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల బలోపేతానికి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచడానికి ప్రణాళికతో ముందుకు వెళ్తామని తెలిపారు .ఈ కార్యక్రమానికి ఎన్నికల పరిశీలకులుగా జిల్లా ఇంటర్ విద్యాధికారి భాను నాయక్ ఎన్నికల అధికారిగా మద్దిమడుగు సైదులు వ్యవహరించారు . ఈ సందర్భంగా అధ్యాపకులు మిత్రులు, శ్రేయోభిలాషులు, శుభాకాంక్షలు తెలిపారు.

## పోస్టర్ ఆవిష్కరణ



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్) :** పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో గణేష్ విగ్రహాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి. సంగీత ,పర్యావరణ శాఖ ఇంజనీర్ మృదుల, సహాయక పర్యావరణ శాస్త్రవేత్త డి పి ఆర్ ఓ రమేష్ కుమార్ తది తరులు పాల్గొన్నారు.

## వాహనాల చోరీ కేసులో ఇద్దరు దొంగల అరెస్ట్




**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్) :** సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలో పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా వారిని గమనించి పారిపోతున్న ఇద్దరు ద్విచక్ర వాహన దొంగలను అరెస్టు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పోలేపాక రమేష్, జీడి జెడ్డి నరేష్ అనే నిందితులు ద్విచక్ర వాహనాల తో పాటు గతంలో మహిళ మెడలో నుంచి బంగారు పుస్తెల తాడును దొంగతనం చేశారని తెలిపారు . మొత్తం 5,44,000 విలువగల బంగారం, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. కేసులో ప్రతిభ కనబరిచిన సిసిఎస్ సిఐ శివకుమార్, నాగారం సర్కిల్ ఇన్స్పెక్టర్ రఘువీర్ రెడ్డి, ఎస్సై లు శ్రీకాంత్, సురేష్ ,ఇతర సిబ్బందిని అభినందించారు.

## గీతోపదేశంతో ధర్మాన్ని గెలిపించిన జ్ఞానమూర్తి శ్రీ కృష్ణుడు



**హుజూర్ నగర్, సెప్టెంబర్ 04(నినాదం న్యూస్):** విశ్వవ్యాప్తంగా అన్ని మతాలలోనూ త్రైత సిద్ధాంతం ప్రవచించే ఇందూపథం అంతర్లీనంగా ఉందని, మత సామరస్యం సమాజపురోగతికి అవసరమనీ, సర్వ సృష్టికర్త అయిన దేవునికి ఏ మతము, కులము లేదనీ, త్రైత సిద్ధాంత ఇందూ సేవా సమితి కోదాడ శాఖ హుజూర్ నగర్ అధ్యక్షులు పోటు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం హుజూర్ నగర్ పట్టణంలో శ్రీశ్రీశ్రీ ప్రబోధానంద యోగేశ్వరుల వారి త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ పరమాత్మునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు భజన కీర్తనలతోను, కోలాటాలతోను, భక్తి పారవశ్యంతో శ్రీకృష్ణుని ప్రతిమను పురవీధులలో ఊరేగించారు. ఈ సందర్భంగా పోటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి మానవుడు తాను చేసిన కర్మ ప్రతిఫలాన్ని తప్పక అనుభవిస్తాడని కర్మయోగం విశిష్టత గురించి తెలియజేసేది త్రైత సిద్ధాంత భగవద్గీత మాత్రమేనని తెలిపారు. శ్రీకృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతపై అవగాహన కల్పించారు. తదనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో పోటు జయవాణి, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, గుండేపల్లి ధర్మప్రచార ప్రబోధ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేసిన మాజీ ఎంపీ కవిత

### వరద బాధితులకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుంది



**డోర్నకల్ /మరిపెడ సెప్టెంబర్ 04(నినాదం న్యూస్):** భారీ వర్షాలు పడడంతో వచ్చిన వరదల వల్ల నష్టపోయిన మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం సీతారాం తండా వాసులకు 40 కుటుంబాలకు నిత్యవసర సరుకులను మానుకోట పార్లమెంట్ మాజీ ఎంపీ బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత అందజేశారు. పురుషోత్తమయ గూడెం బ్రిడ్జిని సందర్శించి కొట్టుకుపోయిన తీరును, రైతులు నష్టపోయిన పంటలను పరిశీలించారు. ప్రజలు ఎవరు అధైర్య పడవద్దని బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని సీతారాం తండా ప్రజలకు ధైర్యాన్ని కలిగించారు. నష్టపోయిన ప్రజలకు ప్రభుత్వం నుండి కూడా సహకారం అందే విధంగా అధికారుల దృష్టికి తీసుకువెళ్తా మన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుగులోత్ వేంకన్నా, తేజవత్ రవీందర్ నాయక్, వేంకన్నా, ముత్యం వెంకన్న గౌడ్, మహబూబ్ బాషా, గుగులోత్ రణధీర్, గుగులోత్ ఉదయ్ కిరణ్ ఇంకా తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయి అవార్డు



**కాటారం సెప్టెంబర్ 04 నినాదం న్యూస్ :** కాటారం గిరిజన గురుకులం బాలుర కళాశాల చిత్రకళా ఉపాధ్యాయుడు ఆడెపు రజనికాంత్ కు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. గత విద్యాసంవత్సరం ఈ ఎస్ టి విద్యార్థులు వివిధ డ్రాయింగ్ మరియు పెయింటింగ్ పోటీలలో రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి బహుమతులు గెలుపొందడంలో కృషికి మైక్రోఆర్టో ట్రైబల్ ఆర్టో విద్యార్థుల ఉన్నతికి కృషి చేసినందుకు జాతీయస్థాయిలో "రీడ్ ఇండియా" సెలబ్రేషన్లో ప్రతి సంవత్సరం 10 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరుచుటకు ప్రోత్సహించినందుకు విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారిని విద్యాభివృద్ధికి అభ్యున్నతికి కృషి చేస్తున్న సందర్భంగా ఆవార్డు వరించినట్లు రజనీకాంత్ తెలిపారు.

### ప్రాణాంతక కోనో కార్పస్ చెట్లను తొలగించాలి

### మొగిలి రాజకుమార్ యాదవ్

**కాటారం, సెప్టెంబర్ 04 నినాదం న్యూస్ :** ప్రాణాంతకమైన కోనో కార్పస్ చెట్లను రేగులగుడం గ్రామపంచాయతీ పరిధిలోని పల్లె ప్రకృతి వనంలోని చెట్లను తొలగించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు మొగిలి రాజకుమార్ యాదవ్ అన్నారు. రేగుల గూడెం స్పెషల్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న తహసిల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోనో కార్పస్ చెట్ల ద్వారా వీచే గాలి వలన చర్మ, శ్వాసకోశ వ్యాధులు సంభవించినట్లు శాస్త్రవేత్తలు, వైద్యులు సూచించారని తెలిపారు పది రకాల చెట్లు తాగే నీటిని ఒక కోనో కార్పస్ చెట్టు తాగుతుందని అన్నారు. ఇటీవల కొందరు శాస్త్రవేత్తలు కొనో కార్పస్ చెట్లు ప్రాణాంతకమని తక్షణమే తొలగించాలని ఆదేశించిన కొందరు అధికారులు పట్టించుకోలేదని అన్నారు. ఈ విషయంపై అధికారులు స్పందించి చెట్లను తొలగించాలని వినతి పత్రం ద్వారా మొగలి రాజ్ కుమార్ యాదవ్ కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి విజయరాజు, మంత్రి నరేష్, బండం చంద్రశేఖర్, మంత్రి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు..

## తొర్రూరులో కూడా హైడ్రా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి

### సేవాలాల్ సేన తొర్రూరు మండల ఇన్చార్జి జాటోత్ సురేష్ నాయక్



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 04 (నినాదం న్యూస్):** హైదరాబాద్ హైడ్రా తరహాలో మహబూబాబాద్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు పట్టణ కేంద్రంలో కూడా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సేవాలాల్ సేన తొర్రూరు మండల ఇంచార్జ్ జాటోత్ సురేష్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక డివిజన్ కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సురేష్ నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్ర రాజధానిలో చెరువులు కుంటలను కబ్జా చేసి కట్టుకున్న భవనాలను కూలుస్తూ భూ బకాసురుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున హైడ్రా తరహాలో మహబూబాబాద్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు పట్టణ కేంద్రంలో కూడా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కబ్జాకు గురైన తొర్రూరు పెద్ద చెరువు, అన్నారం రోడ్డులోని దేవుని మాన్యం భూములను పరిరక్షించాలని అన్నారు. పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు ఈ విషయంపై స్పందించి హైడ్రా తరహా వ్యవస్థను పాలకుర్తి నియోజకవర్గంతో పాటు తొర్రూరు పట్టణ కేంద్రంలో కూడా తీసుకువచ్చి ప్రభుత్వ భూములను పరిరక్షించాలని అన్నారు. అలాగే వరంగల్ విజయవాడ జాతీయ రహదారి సెంటర్ పాయింట్ నుండి 50 ఫీట్లుగా నిర్ణయిస్తే డిసిసి బ్యాంక్ సమీపంలో ఒక బిల్డింగ్ దగ్గర రెండు ఫీట్ల వెడల్పు తగ్గడంతో మరోచోట బిల్డింగ్ యాజమాన్యాలు కూడా అక్కడ రెండు ఫీట్లు తగ్గింది కదా ఇక్కడ కూడా తగ్గించాలని డిమాండ్ చేస్తున్న విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే మున్సిపల్ చైర్మన్ కమిషనర్ స్పందించి పార్టీలకు అతీతంగా సెంటర్ పాయింట్ నుండి 50 ఫీట్లకు ఎక్కడ తగ్గకుండా ఎవరి దగ్గర బేధాలు లేకుండా అందరినీ సమానంగా చూసి 100 ఫీట్ల రోడ్డును ఎవరి ఆంక్షలకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా రోడ్డు పనులు నిర్వహించాలన్నారు. అధికార పార్టీకి చెందిన వారికి ఒకలా సామాన్యులకు మరోలా న్యాయం అనేలా ఉండకూడదని అధికార వ్యవస్థ అందరినీ సమానంగా చూడాలని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే తొర్రూరు పెద్ద చెరువు భూములు మరియు అన్నారం రోడ్డులోని దేవుని మాన్యం భూముల పరిరక్షణ కోసం హైదరాబాద్ హైడ్రా తరహాలో తొర్రూరులో కూడా ప్రత్యేక సర్వే నిర్వహించి ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.

## భారీ వర్షాల వల్ల నష్టపోయిన అన్ని పంటలకు పరిహారం చెల్లించాలి

### ఉత్తర తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పీక కిరణ్ డిమాండ్



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 04 నినాదం న్యూస్ :** భూపాలపల్లిలో విలేకరుల సమావేశంలోని ఉత్తర తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పీక కిరణ్ మాట్లాడుతూ. రాష్ట్రంలో ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి. మంచిర్యాల. పెద్దపెల్లి. మహబూబాబాద్, ములుగు, హనుమకొండ, జనగాం, నల్గొండ, నాగర్ కర్నూల్, మహబూబ్నగర్ తదితర జిల్లాలలో గత ఐదు రోజుల నుండి కురుస్తున్న భారీ, అతి భారీ, వర్షాల వల్ల మరియు కుంభవృష్టి వల్ల రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది ఎకరాలలో అన్ని పంటలకి తీవ్ర నష్టం. పత్తి, వరి, మొక్కజొన్న, కంది, సోయా బీన్ తదితర పంటలకు తీవ్ర నష్టం జరిగింది. వరి నాట్లు చివరికి వస్తున్న దశలో వేసిన వరి నాట్లు వరదలకు కొట్టుకుపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా వరి పంటకు 6 లక్షల ఎకరాలకు పైగా నీట మునిగింది. పత్తి పంట పూత దశ సమయంలో భారీ వర్షాల వల్ల పది లక్షల ఎకరాలలో పత్తి పంట మునిగిపోయింది. పూత రాలిపోయి తీవ్ర నష్టం ప్రధానంగా ఖమ్మం జిల్లాలలో కుంభవృష్టి వల్ల గ్రామాలకు గ్రామాలే మునిగిపోయాయి. మునిగిపోయిన గ్రామాలలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనుక ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకొని ప్రజలను కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వం పై ఉన్నది. మునిగిన గ్రామాల ప్రజలకు ఆహారం అందించే ఏర్పాటు చేయాలి. ఖమ్మం జిల్లాలో అన్ని పంటలు మునిగిపోయాయి. ఈ జిల్లాలో అన్ని పంటలకు తీవ్ర నష్టం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా చెరువులకు గండ్లు పడ్డాయి, కుంటలు తెగిపోయాయి. నీటి కాలువలు తెగిపోయాయి. సమాంతర పంటల వేసిన భూముల్లో భారీ వర్షాలకు తెగిపోయి, వేసిన అన్ని పంటలు మునిగిపోయి, వరదలకు కొట్టుకుపోయాయి రాష్ట్ర ప్రభుత్వం తెగిన కాల్వలను, గండ్లను గుర్తించి వెంటనే మరమ్మత్తు చేయాలి. నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని పీక కిరణ్ రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

## టేకుమట్ల - రాఘవరెడ్డిపేట వంతెన పున: ప్రారంభం

### శాసనసభ్యులు గండ్ర సత్య నారాయణరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 04 నినాదం న్యూస్ :** భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలోని టేకుమట్ల – రాఘవరెడ్డిపేట గ్రామాల మధ్య చలివాగుపై పున:నిర్మాణమైన హై లెవల్ వంతెనను బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఏడాది జూలైలో కురిసిన భారీ వర్షాలకు టేకుమట్ల – రాఘవరెడ్డిపేట వంతెన పిల్లర్లు కుంగినట్లు తెలిపారు. ఆ రోజు వంతెనను పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో అంచనాలు రూపొందించి వంతెన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపగా, రూ.4.70 కోట్లతో యుద్ధ ప్రాతిపదికన వంతెన పున:నిర్మాణ పనులను చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అతి తక్కువ సమయంలోనే వంతెన నిర్మాణంను పూర్తి చేసిన సదరు గుత్తేదారుడు (శ్రీ వేంకటేశ్వర కన్స్ట్రక్షన్) ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ వంతెన అందుబాటులోకి రావడంతో టేకుమట్ల మండలంలోని వాగవతలి సుమారు తొమ్మిది నుండి పది గ్రామాల ప్రజలకు మార్గం సుగమం అయినట్లు తెలిపారు. అనంతరం గుత్తేదారు, అధికారులకు ఎమ్మెల్యే, కలెక్టర్ పుష్పగుచ్చం, శాలువాతో సన్మానించారు.

**కళ్యాణలక్ష్మీ..షాది ముబారక్ చెక్కులు అందజేత...** టేకుమట్ల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 15 మంది కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.15,01,740 విలువ గల చెక్కులను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు ఎంతో అండగా కళ్యాణలక్ష్మి పథకం నిలుస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రజా ప్రభుత్వంలో నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకంతో రాష్ట్రంలోని ఎంతో మంది పేద, నిరుపేద కుటుంబాల ఆడపిల్లల పెండ్లికి ఆర్థికసాయం అందిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆర్ అండ్ బిఈఈ వెంకటేశ్వర్లు వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఆర్బిఐ క్విజ్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలి



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్) :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 90 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న క్విజ్ పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ చింతల బాపూజీ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ కెప్టెన్ డా. వెంకటేశులుతో కలిసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెప్టెంబర్ 19 వ తేదీ నుండి 21 వరకు ఆన్లైన్లో గ్రూప్ క్విజ్ పోటీలను నిర్వహించబడునని తెలిపారు. మొదటి బహుమతిగా 2 లక్షల రూపాయలు రెండవ బహుమతిగా 1.5 ,మూడవ బహుమతి లక్ష రూపాయలను గెలుచుకోవచ్చని అన్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థులు తమ వివరాలను డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. ఆర్ బీఐ క్విజ్.ఇన్ లో వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ధరావత్ సతీష్ అధ్యాపకులు రామారావు ,చక్రవర్తి , విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## పదివేల రూపాయల ఆర్థిక సహాయం



**చింతపల్లి, సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్) :** మండలంలోని గడియ గౌరారం గ్రామానికి చెందినవారిమల్ల యాదయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని భార్య నారిమల్ల వెంకటమ్మ కి ముగ్గురు చిన్న పిల్లలు ఉండడంతో ఆ గ్రామ మాజీ సర్పంచ్ ఉజ్జిని హేమలత నరేందర్ రావు బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా పదివేల రూపాయల నగదు తో పాటు ఒక క్వింటల్ బియ్యం బస్తాను వెంకటమ్మకు అందజేశారు. ఆర్థిక సహాయం అందజేసిన మాజీ సర్పంచ్ హేమలత నరేంద్ర రావును పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో నాగమళ్ళ గిరి, మాజీ ఎంపీటీసీ కంబాలపల్లి స్వాతి యాదగిరి, గుణమోని జంగయ్య, అదిరాళ్ల కృష్ణయ్య, గుణమోని సైదులు, తుళ్ళ రమేష్, కంబాలపల్లి సైదులు, నారిమల్ల శ్రీను, నారిమల్ల మల్లయ్య, నారిమల్ల సుగుణయ్య, నారిమల్ల రామ స్వామి, నారిమల్ల యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పల్లపు జంగయ్య మృతి బాధాకరం




**చింతపల్లి, సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్):** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మండల సహాయ కార్యదర్శి పల్లపు లక్ష్మయ్య తండ్రి పల్లపు జంగయ్య మృతి బాధాకరమని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు అన్నారు. మండల పరిధిలోని గోడకొండ గ్రామానికి చెందిన కమ్యూనిస్టు పార్టీ కార్యకర్త పల్లపు జంగయ్య బుధవారం మృతి చెందారు. జంగయ్య మృత దేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించి, మృతుడి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పల్లపు లక్ష్మయ్యను ఓదార్చి ఆయన కుటుంబానికి సిపిఐ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, మండల సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్ రావు, గ్యార పరుశరాములు, గ్యార పెద్దయ్య, కొదుదూటి సైదులు, గిరి వెంకటమ్మ, పి ముత్యాలు, కే ముత్యాలు,పోలేపల్లి యాదయ్య కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సంక్షేమం పీఆర్టీతోనే సాధ్యం



**నూతనకల్ సెప్టెంబర్ 4నినాదం న్యూస్:** ఉపాధ్యాయుల హక్కుల సాధన సంక్షేమం పిఆర్టియు తోనే సాధ్యం అవుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శీ జ్యోతుల చంద్రశేఖర్, చింత రామలింగ రెడ్డి అన్నారు. బుధవారం నూతనకల్ మండల కేంద్రంలోని ఐఎల్ఆర్ ఫంక్షన్ హాల్ లో మండల కమిటీని ఎన్నుకున్నారు. పిఆర్టియు టిఎస్ మండల అధ్యక్షుడిగా ఇరుగు సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా ఉప్పు నాగయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా ధనావత్ శివయ్య, కార్యదర్శిగా ఇంద్రారెడ్డి, మండల ఉపాధ్యక్షురాలుగా కోడి సమతా, మహిళా కార్యదర్శిగా చిలకమ్మ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఇరుగు సోమయ్య మాట్లాడుతూ నమ్మిన వాళ్లను వమ్ము చేయకుండా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జితేందర్ రెడ్డి,కోటయ్య, శివ శంకర్, మహేశ్వర వెంకటయ్య, శ్రీను, వెంకన్న, తదితరులు ఉన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత



**హుజూర్ నగర్, సెప్టెంబర్ 04(నినాదం న్యూస్):** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు హుజూర్ నగర్ అరటి పరిధిలోని 26 వార్డ్ లో కలవకట్ట వెంబడి నివసిస్తున్న రాము అనే నిరుపేద ఇల్లు కూలి పోవడం జరిగింది. బుధవారం జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపు మేరకు నిరుపేద లైన రాము కుటుంబానికి రూ. 10 వేలరూ పాయలను ఆర్థిక సహాయంగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు సైదులు యాదవ్, షేక్ హసన్ మియా, ములకలపల్లి మట్టయ్య, శివ యాదవ్ ,పోలజు మనోజు కుమార్, భరత్లు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గునగంటి నాగరాజు, ఎండీ అల్లావుద్దీన్,బి . మహేష్,జి . నాగరాజు, సత్యనారాయణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# క్రిటికల్ కేర్ యూనిట్ పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్ ఆదర్శ సురభి





**వనపర్తి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 04 (నినాదం న్యూస్)** నర్సింగాయపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఏరియాలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాల్లో నిలువ నీరు లేకుండా చర్యలు తీసుకోండి మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించిన కలక్టర్ ఆదర్శ్ సురభి రూ. 23.75 కోట్ల నిధులతో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ ను డిసెంబర్ మాసం చివరి లోగా పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం ఉదయం నర్సింగాయపల్లి వద్ద ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని కలక్టర్ సందర్శించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆసుపత్రి ప్రాంగణాల్లో వర్షపు నీరు ఉండిపోవడం రోగులు ఇబ్బందులు గురికావడాన్ని దృష్టిలో ఉంచుకుని కలక్టర్ మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్,టి.ఎస్.యం.ఐ.డి.సి అధికారులతో కలిసి పరిశీలించారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ని మూసివేసి షాపులు నిర్మించుకోవడాన్ని పరిశీలించిన కలెక్టరు సరైన అనుమతులు లేకుండా నిర్మించిన షాపులను వెంటనే తోలగించాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. భవిష్యత్తులో ఆసుపత్రి పరిసరాల్లో నీరు చేరడం వంటి ఫిర్యాదులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిసరాల్లో జె.సి.బి. తో శుభ్రం చేయించాలని సూచించారు. సెప్టెంబర్ 9న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వనపర్తి జిల్లా పర్యటన సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్, ఒ.పి. రూమ్, హై మాస్క్ లైట్ ప్రారంభించే విధంగా ఏర్పాట్లు చేయాలని టి.జి.యం.ఐ.డి.సి. కార్య నిర్వహక ఇంజనీరు జైపాల్ రెడ్డిని ఆదేశించారు. అక్కడే నూతనంగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ఒక కాలపరిమితి ఏర్పాటు చేసుకొని ప్రతి రోజూ పూర్తి చేయాల్సిన పనిని నిర్దేశించుకోవాలని సూచించారు. అనంతరం టి. డయాగ్నొస్టిక్ హబ్ ను సందర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రి ఒక చోట సి.టి స్కాన్ మరో చోట ఉండటం సరికాదని దీనిని వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి మార్చేందుకు ప్రణాళికలు చేయాలని ఆదేశించారు. మాతా శిశు సంరక్షణ కేంద్రంలో లేబర్ రూమ్, పిల్లల వార్డు సందర్శించి వైద్యులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టి.జి.యం.ఐ.డి.సి. కార్యనిర్వహక ఇంజనీరు జైపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, టౌన్ ప్లానింగ్ అధికారి కరుణాకర్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రంగారావు, వైద్యులు తదితరులు కలక్టర్ వెంట ఉన్నారు.

## గురుకుల, సంక్షేమ హాస్టల్స్, కేజీబీవీ విద్యార్థులకు విష జ్వరాల నుండి కాపాడాలి

**నిజామాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అంజలి, రఘురాం**



**నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్) :** అఖిల భారత విద్యార్థి సమాఖ్య అధ్వర్యంలో గురుకుల, సంక్షేమ హాస్టల్, కేజీబీవీ లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏవో కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అంజలి, రఘురాంలు మాట్లాడుతూ గత నాలుగు రోజుల నుండి వర్షాలు పడటం వలన జిల్లా వ్యాప్తంగా గురుకుల, సంక్షేమ హాస్టల్స్, కేజీబీవీ పాఠశాల కళాశాలలో విద్యార్థులకు విష జ్వరాలు వస్తున్నాయి కాబట్టి వెంటనే అధికారులు స్పందించి విద్యార్థులకు హాస్టల్స్ పరిసర ప్రాంతాలలో పరిశుభ్రంగా ఉంచాలని దాంతోపాటు విద్యార్థులకు అవసరమైనటువంటి మంచినీటి సౌకర్యం దాంతో పాటు మెనూ ప్రకారం భోజనాలు అందించాలని కోరడం జరిగింది. ఇప్పటి ఉన్న పరిస్థితుల్లో ఏఎన్ఎం, ఆర్.ఎం.పి డాక్టర్లు 24 గంటల పాటు విద్యార్థులకు అందుబాటులో ఉండేటట్టుగా చూడాలని అన్నారు. హాస్టల్ వార్డెన్ జిల్లా వ్యాప్తంగా సమయపాలన పాటించకుండా కాలయాపన చేస్తున్న వార్డెన్ పైన చర్యలు తీసుకోవాలని దాంతో పాటు మెనూ పాటించని వారి పైన కూడా చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ నగర సహాయ కార్యదర్శి నవీన్ కృష్ణ, నాయకులు శివాజీ, స్వామి పాల్గొన్నారు.

## అనన్య కుటుంబాన్ని పరామర్శించిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



**నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్) :** గత వారంలో నగరంలోని ఆనంద్ నగర్ లో నాలాలో కొట్టుకుపోయిన రెండు సంవత్సరాల బాలిక అనన్య కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ షబ్బీర్ అలీ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనన్య తన నివాసానికి సమీపంలో ఆడుకుంటుండగా చిన్నారి ప్రమాదవశాత్తు ఓపెన్ డ్రెయిన్‌లో పడి చనిపోవడం చాలా బాధాకరమైన విషయం అన్నారు. వారి కుటుంబానికి జరిగిన విషాదన్ని వారి గుండె కోతును ఎవరు కూడా పూడ్చలేరని, నా వంతు ఆర్థిక సహాయాన్ని అందిస్తూ ప్రభుత్వం నుండి నాలుగు లక్షల రూపాయలు ఎక్స్ గ్రేశియ అందిస్తామన్నారు. ఇలాంటి సంఘటనలు మళ్ళీ జరగకుండా ప్రభుత్వ అధికారులు ప్రమాదకరమైన నాలాలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.

## ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

- **శాంతి కమిటీ సమావేశంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**
- **అవాంఛనీయ ఘటనలు తావులేకుండా గట్టి బందోబస్తు : సీ.పీ కల్మేశ్వర్**
- **మంటపాల వద్ద సీ.సీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు హితవు**



**నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్) :** ప్రశాంత వాతావరణంలో వినాయక చతుర్థి, మిలాద్-ఉన్-నబీ వేడుకలు ఘనంగా జరుపుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పిలుపునిచ్చారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో బుధవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం జరిపి కీలక సూచనలు చేశారు. మిలాద్-ఉన్-నబీ, గణేష్ ఉత్సవాల సందర్భంగా చేపట్టాల్సిన చర్యలు, అందుబాటులోకి తేవాల్సిన సదుపాయాల గురించి సార్వజనిక్ గణేష్ మండలి ప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, మండపాల నిర్వాహకులు పలు ప్రతిపాదనలు చేస్తూ తమ అభిప్రాయాలను వెల్లడించారు. శాంతియుత వాతావరణంలో, భక్తి శ్రద్ధలతో మతసామరస్యానికి ప్రతీకగా వేడుకలు జరిగేలా తోడ్పాటును అందిస్తామని అన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని, రోడ్ల మరమ్మతులు, శోభాయాత్రకు అడ్డంకిగా ఉండే చెట్ల కొమ్మలను తొలగించడం వంటి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎంతో సహృద్భావ వాతావరణంలో ఈ వేడుకలు జరుగుతాయని, ఈసారి కూడా అదే స్ఫూర్తిని ప్రదర్శిస్తూ గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని, జిల్లాను ఆదర్శంగా నిలపాలని కోరారు. గతేడాది తరహాలోనే ఈసారి కూడా వినాయక నిమజ్జనం, మిలాద్-ఉన్-నబీ వేడుక ఒకేసారి వస్తున్నందున భద్రతాపరమైన చర్యలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నందున మండపాల ఏర్పాటులో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరకు కూడా విద్యుదాఘాతం బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మండపాలకు ప్రభుత్వం తరపున ఉచితంగా విద్యుత్ సరఫరా చేయనున్నందున, మంటపాల వివరాలను ట్రాన్స్ కో అధికారులకు తెలియజేసి, ఆ శాఖ సిబ్బంది ద్వారానే విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసుకోవాలని హితవు పలికారు. షార్ట్ సర్క్యూట్ వంటి వాటిని నిరోధించే ఉపకరణాలను అమర్చుకోవాలని హితవు పలికారు. ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడకుండా, ప్రజలకు అసౌకర్యం కలుగకుండా వినాయక మంటపాలు ప్రతిష్ఠించాలని సూచించారు. భారీ శబ్దాల వల్ల చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉన్నందున మంటపాల వద్ద శబ్ద కాలుష్యం కలిగేలా డీ.జే సౌండ్లతో హోరెత్తించకుండా భక్తి పాటలు, భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసేలా నిర్వాహకులు కృషి చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలు, ప్రార్థనాలయాల వద్ద సి.సి కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తామని, ఒక్క నిజామాబాద్ నగరంలోనే ఈసారి సుమారు 750 పైచిలుకు సీ.సీ కెమెరాలు నెలకొల్పుతున్నామని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ తెలిపారు. అయితే నిర్వాహకులు కూడా గణేష్ మండపాల వద్ద ఎవరివారు కనీసం ఒకటైన సీ.సీ కెమెరాను ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా ఉంటుందన్నారు. మంటపాల వద్ద నిర్వాహకులు రాత్రి వేళల్లో తప్పనిసరిగా ఉండాలన్నారు. సామాజిక మాధ్యమాలలో చేసే పోస్టింగ్ లపై ప్రత్యేక నిఘా ఉంచుతామని, ప్రశాంతతకు భంగం కలిగిస్తూ అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సహృద్భావ వాతావరణంలో పరస్పర సహకారంతో శోభాయమానంగా ఉత్సవాలను నిర్వహించుకోవాలని, వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని, ప్రతి మండపం వద్ద పోలీసులను నియమిస్తామని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్, డిప్యూటీ మేయర్ ఇద్రిస్, అదనపు డీసీపీలు కోటేశ్వర్ రావు, బస్వారెడ్డి, ఆర్డీఓలు అంబదాస్ రాజేశ్వర్, రాజాగౌడ్, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డి, వివిధ శాఖల అధికారులు, శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బిజేపి ప్రభుత్వం రిజర్వేషన్లను రద్దు చేయటానికి కుట్రలు చేస్తోంది
### ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ




**నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్) :** కేంద్రంలోని బిజేపి ప్రభుత్వం రిజర్వేషన్లను రద్దు చేయటానికి కుట్రలు చేస్తోందని, ఈ రిజర్వేషన్లను రద్దు చేయడం సాధ్యమయ్యే పని కాదని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. బుధవారం నగరంలోని కొజ్జ కాలనీ ప్రైమ్ స్కూల్లో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ పై రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ తెలంగాణలో అమలవుతున్న ముస్లింలకు మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్లను రద్దు చేసే కుట్ర జరుగుతుందని, ఇది రద్దు చేయడం ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సాధ్యంకాదని అన్నారు. ముస్లిం రిజర్వేషన్లను కేంద్రం రద్దు చేస్తుందని ఎన్నికల సమయంలో అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఆయన గుర్తు చేశారు. ముస్లిం, క్రిస్టియన్, మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దివంగత వైఎస్ రాజ శేఖర్ రెడ్డి హయాంలో ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ కోసం ఎంతో కష్టపడి పోరాడి తీసుకొచ్చామని అన్నారు. ఇప్పటికి కోర్టుల చుట్టూ తిరుగుతూ పోరాడుతూనే ఉన్నానమన్నారు. 4శాతం రిజర్వేషన్ కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ముస్లిం రిజర్వేషన్లు ప్రవేశపెట్టామని, వాటిని కాపాడుకోవడం మా బాధ్యత అని అన్నారు. మైనార్టీ పాఠశాలలకు, నివాస భవనాల నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే నిధులు విడుదల చేసిందని, ముస్లిం మైనార్టీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తోందన్నారు. ఈ రిజర్వేషన్ ద్వారా ముస్లిం మైనార్టీ యువకులు ఇంజనీర్లు, డాక్టర్లు అయ్యారని అన్నారు. ఈ రోజు నాకెంతో సంతోషంగా ఉందని రిజర్వేషన్ సాధించి 30 సంవత్సరాలు అవుతుందని గుర్తు చేశారు.

## క్రాప్ లోన్ రెన్యువల్ వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్04( నినాదం):** రుణమాఫీ పొందిన రైతుల క్రాప్ లోన్ రెన్యువల్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. జిల్లా కలెక్టరేట్ సముదాయంలో జిల్లాలోని రుణమాఫీ పొందిన రైతుల క్రాప్ లోన్ రెన్యువల్, ఆయిల్ ఫామ్ సాగు అభివృద్ధి, రేషన్ కార్డులేని వారి వివరాల సెకరణ పై వ్యవసాయ, బ్యాంక్, ఉద్యానవన శాఖ అధికారులతో బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష నిర్వహించారు. రుణమాఫీ కానీ రైతుల ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ లలో వ్యక్తి పేరు, చిరునామాల మార్పులపై వెంటనే ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లావ్యా ప్తంగా ఆయిల్ ఫామ్ సాగు నిర్ణయించిన లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.అధికారులు రైతులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం జిల్లాలోని మండల స్థాయి అధికారులతో రేషన్ కార్డులు లేని వారి కుటుంబ సభ్యుల వివరాలకు సర్వే నిర్వహించి, పూర్తి జాబితాను సమర్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఏవో ఆదిరెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జగన్ మోహన్ రెడ్డి, ఎల్.డి.ఎం వెంకటేష్, అధికారులు పాల్గొన్నారు.

## వారియర్స్ అకాడమీ నీ ప్రారంభించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



**నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్) :** నగరంలో వారియర్స్ అకాడమిని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ బుధవారం ప్రారంభించారు. వారియర్స్ మేనేజ్‌మెంట్ పేద విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వాలని కోరారు. భవిష్యత్తులో ఈ అకాడమి ద్వారా ఎంతో మంది విద్యార్థులకు భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విట్టల్ రావు, వారియర్ అకాడమీ మేనేజ్మెంట్ మామిడి రమాకాంత్, ధర్మారావు, మధుసూదన్ రావు,విద్యార్థులు పాల్గొన్నారు.

## నగర పాలక సంస్థలో గాడితప్పిన పాలన

**కమిషనర్ పూర్తి బాధ్యతతో వ్యవహరించాల్సింది పోయి,**

**లోతట్టు ప్రాంతాల్లో పర్యటించ కుండా, ఆస్థిపన్నుల వసూళ్లపై దృష్టి సారించడం శోచనీయం.**

**44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత చంద్రశేఖర్(మార్షల్ )**



**కరీంనగర్, సెప్టెంబర్ 4(నినాదం న్యూస్ ):** భారీ వర్షాలతో నగరం జలమయమై లోతట్టు ప్రాంతాలు నీటి మునిగి ఇండ్లలోకి వరద, మురుగు నీరు చేరుతున్న సమయంలో 24/7 బాధ్యతగా వ్యవహరించాల్సిన నగర మేయర్ సునీల్ రావు ఎవరికి ఇంచార్జి బాధ్యతలు అప్పగించకుండా విదేశీ పర్యటనలో జల్సా చేస్తుంటే నగరపాలక సంస్థ కమిషనర్ పూర్తి బాధ్యతతో వ్యవహరించాల్సింది పోయి,లోతట్టు ప్రాంతాల్లో పర్యటించకుండా, అక్కడి వరద ముంపుకు గురైన నగర ప్రజల అవస్థలు తెలుసుకోకుండా ఆస్థిపన్నుల వసూళ్లపై దృష్టి సారించడం శోచనీయం. అని 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత చంద్రశేఖర్ మండి పడ్డారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మేయర్, ఇంచార్జి మేయర్ గా ఎవరూ లేనందున నగర ప్రజల బాగోగులు చూసుకునే పూర్తి బాధ్యత కమిషనర్ పైనే ఉన్నందున వరద ముంపు ప్రాంతాలను పర్యవేక్షించడంతో పాటు, కార్యాలయ బాధ్యతలు చూసుకోవాల్సిన అవసరం ఉంది. కానీ వరద ముంపుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ఆ వైపు కూడా కన్నెత్తి చూడకపోవ డంతో నగర పాలన పూర్తిగా గాడితప్పింది. ఇటీవల కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. మురుగునీరు ఇండ్లలోకి ప్రవహిస్తోంది. ప్రజలు దోమలు, దుర్వాసన మధ్య దుర్భర జీవితం గడుపుతున్నారు. ఇంతటి విపత్కర పరిస్థితుల్లో నగర ప్రజలను విస్మరించడం బాధ్యతారాహిత్యం కిందకే వస్తుందని తక్షణమే నగరపాలక సంస్థ కమిషనర్ స్పందించి లోతట్టు ప్రాంతాలలో పర్యటించి, కరీంనగర్ నగరంలో ఉన్న సమస్యలు జిల్లా కలెక్టర్, మంత్రి దృష్టికి వరద ప్రాంతాల సహాయ నిధి కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అక్కడి సమస్యలపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికైనా నగరపాలక సంస్థ కమిషనర్ స్లమ్ ఏరియాల్లో తిరిగి ప్రజల స్థితిగతులను తెలుసుకోవాలని కార్పొరేటర్ దంపతులు కోరారు.

## ఈడీ కేసు మాఫీ కోసమే ఢిల్లీలో గంగుల పొర్లు దండాలు.

- **అందుకోసమే బిజెపితో చెట్టపట్టాల్**
- **వారానికోసారి ఢిల్లీ పర్యటన అమిత్ షా ప్రాపకానికి ప్రాకులాట**
- **మీ పాపలకు ఖమ్మం ప్రజలే తగిన శాస్తి చెప్పారు.**
- **మాజీ మంత్రి గంగులకు స్ట్రాంగ్ వార్నింగ్**
- **కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు**



**కరీంనగర్, సెప్టెంబర్ 4(నినాదం న్యూస్ ):** గ్రానైట్ సంస్థకు సంబంధించిన డ్యూటీ ఎగవేసిన ఈడీ కేసు నుంచి బయటపడేందుకే మాజీ మంత్రి గంగుల కమలాకర్ బీజేపీతో చెట్టపట్టాల్ వేసుకొని తిరుగుతున్నారని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు ఆరోపించారు. అందుకోసమే వారానికోసారి ఢిల్లీకి వెళ్తున్నారని, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రాపకానికి పొర్లు దండాలు పెడుతున్నారని మండిపడ్డారు. కరీంనగర్లో వర్షాలతో ప్రజలు అవస్థలు పడుతుంటే అవేం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని గంగులకు సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం పై మాజీ మంత్రి గంగుల కమలాకర్ చేసిన వ్యాఖ్యలు ఖండిస్తూ బుధవారం వెలిచాల రాజేందర్ రావు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు.కరీంనగర్ లో వరదలు ముంచెత్తుతుంటే ఎమ్మెల్యే గంగుల ఎక్కడో సేద తీరుతూ సరదాగా గడుపుతుండడంపై ప్రజలే అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. బాధితులకు అండగా ఉండాల్సిన తరుణంలో ఎమ్మెల్యే అడ్రస్ లేకుండా పోవడం వారి నీచ సంస్కృతికి నిదర్శనమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై అవాకులు చవాకులు మాట్లాడితే ఊరుకునేది లేదని గంగులకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.ఏం సాధించిందని తీహారు జైలు ముందు తీన్మార్ డాన్సులు చేశారని ప్రశ్నించారు. గ్రానైట్ సంస్థకు సంబంధించిన వందల కోట్ల డ్యూటీ ఎగవేసినందుకు ఈడి నమోదు చేసిన కేసుల నుంచి బయటపడిందుకే గంగుల కమలాకర్ నానా తండాలు పడుతూ బిజెపి పెద్దల ప్రాపకానికి పరితపిస్తున్నారని వెలిచాల రాజేందర్ రావు మండిపడ్డారు.

## నల్ల బ్యాడ్జిలతో నిరసన



**కోరుట, సెప్టెంబర్ 4(నినాదం న్యూస్ ):** తెలంగాణ విద్యుత్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు మూడవ రోజు రూల్ ఆఫ్ జర్వేషన్ కొరకు మెట్పల్లి డివిజన్ పరిధిలో నల్ల బ్యాడ్జిల నిరసన చేపట్టారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, ఎస్సీ ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తెడ్డు గంగారం మాట్లాడుతూ తెలంగాణ విద్యుత్ ఉద్యోగులను ఎస్సి ఎస్టి సమస్యలు తీర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బండ రాజా వీరా , మెట్పల్లి డివిజన్ అధ్యక్షుడు వెన్నమల్ల శ్రీనివాస్, కొమ్ము సంపత్, కొమ్ము రాజేష్ ,పూర్ణచందర్ , రాజేంద్రప్రసాద్, కిరణ్, తిరుపతి ,లక్ష్మణ్, సాగర్ పాల్గొన్నారు

## గురుకులాల్లో పనిచేస్తున్న గెస్ట్, పార్ట్‌టైం ఉద్యోగులను కొనసాగించాలి: మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



**కరీంనగర్, సెప్టెంబర్ 4(నినాదం న్యూస్ ):** అంధకారంలోకి బిసి,ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ ల గురుకుల విద్యార్థుల భవిష్యత్తు గౌలిదొడ్డి గురుకులం మళ్ళీ శిథిలావస్థకు చేరుకోనున్నది,ఒకనాడు కూడా ముఖ్యమంత్రి గురుకుల పాఠశాలలో అడుగుపెట్టలేదు తెలంగాణ సంక్షేమ గురుకుల పాఠశాలలో నిన్న దాదాపు 2000 మంది పార్ట్ టైం ఉద్యోగులు తొలగించడం పై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పందించారు.తెలంగాణ రాష్ట్రంలో గురుకుల పాఠశాల పై కాంగ్రెస్ ప్రభుత్వం కపట ప్రేమను చూపిస్తోందని కొప్పుల ఈశ్వర్ అన్నారు.గురుకుల విద్యార్థులు కలుషిత ఆహారంతో మరణాల సంఘటన మరువకు ముందే, గురుకులాల్లో ఆర్సీవోలు గెస్ట్, పార్ట్‌టైం ఫ్యాకల్టీల ఎంపికలో అవినీతి దందా బయటపడిందని, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2,500,3,000 ఖాళీలు పాతవారికి అవకాశం ఇవ్వకుండా మళ్లీ కొత్తవారితో భర్తీ అంటూ ఒక్కో అభ్యర్థి నుంచి 50 వేల నుంచి లక్ష వరకు వసూళ్లు చేస్తుంటే రేవంత్ రెడ్డి సర్కారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు.నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల గురుకులాలకు ఉన్నతాధికారులు గెస్ట్ ఫ్యాకల్టీలుగా ఉద్యోగావకాశం కల్పిస్తామని చెప్పి అభ్యర్థుల నుంచి డబ్బు వసూలు చేసి పోస్టులను భర్తీ చేశారని ఆరోపణలు వచ్చాయన్నారు.పదేండ్లపాటు విద్యాబోధన చేసిన పార్ట్ టైం ఉపాధ్యాయులను తొలగించడం వల్ల బిసి,ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ల గురుకుల విద్యార్థుల భవిష్యత్తు అంధకారం అవుతుందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హెచ్చరించారు.తెలంగాణ సంక్షేమ గురుకుల పాఠశాలలో నిన్న దాదాపు 2 వేల మంది పార్ట్ టైం ఉద్యోగులు తొలగించారు.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల దాదాపు రెండు లక్షల మంది ఎస్సీ విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందన్నారు.ఈ నిర్ణయాల వల్ల గత పది సంవత్సరాలుగా కేసీఆర్ ఎంతో శ్రద్ధతో నిర్మించిన గురుకుల వ్యవస్థ కుప్పకూలిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.మొత్తంగా అన్ని సొసైటీల్లో అన్ని క్యాడర్లలో 2,500 నుంచి 3,000 పోస్టులు ఖాళీగా ఉన్నాయి ఈ ఖాళీల స్థానంలో సుధీర్ఘ అనుభవంతో పనిచేస్తున్న గెస్ట్, పార్ట్‌టైం ఉద్యోగులనే కొనసాగించాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. వారిని పరిగణనలోకే తీసుకోకుండా కొత్తవారిని నియమించడమేమిటని ప్రశ్నించారు. ఇప్పటికే వారికి చెల్లించాల్సిన 3 నెలల జీవితాల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు చెల్లించాలన్నారు.

## గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొని గొర్రెల కాపరి మృతి.



**ధర్మారం సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్):** అతివేగంగా అజాగ్రత్తగా వాహనాన్ని నడిపి ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం,ఈనెల 1వ తేదీ సాయంత్రం ఏడు గంట గంటల సమయంలో దొంగతుర్తి గ్రామానికి చెందిన పొలగని ఐలయ్య( 50) అను వ్యక్తి గొర్రెలను మెపడానికి వెళ్లి తిరిగి ఇంటికి మందను తోలుకొని వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి తన ద్విచక్ర వాహనంతో అతి వేగంగా అజాగ్రత్తగా నడుపుతూ వచ్చి ఐలయ్య నీ ఎదురుగా గుద్దగా, అతడి మెడ , వెన్నుపూస, తల కి రక్త గాయాలు కాగా, అతడిని వెంటనే కరీంనగర్ లోని శ్రీ లక్ష్మి నరసింహ ఆసుపత్రి కి తీసుకువెళ్ళి అక్కడనుండి మెరుగైన చికిత్స కోసం నిమ్స్ హాస్పిటల్ కి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడని అతడి కొడుకు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని బైక్ మరియు అది నడుపుతున్న వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపాడు.

# ఉద్యోగుల పని తీరు పెండింగ్ ఫైల్స్‌పై సూధీర్ఘ చర్చ...

- నగరపాలక సంస్థలో ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంతో సమీక్షా సమావేశం
- పెండింగ్ ఫైల్స్ అన్ని క్లియర్ చేయాలి
- సలహాలు, సూచనలతో అధికారులకు ఆదేశాలు జారీ చేసిన కమిషనర్ చాహాత్ బాజ్ పాయ్



**కరీంనగర్, సెప్టెంబర్ 4(నినాదం న్యూస్ )** ఉద్యోగుల సర్విస్ బుక్స్ పాటిస్తూ,ప్రభుత్వం నుండి వచ్చే ప్రయోజనాలు సక్రమంగా అందేలా ఎస్టాబ్లిష్ మెంట్ విభాగం పని చేయాలని కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ ఐఏఎస్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ చాంబర్ లో ఎస్టాబ్లిష్ మెంట్ విభాగం అధికారులు, సిబ్బంది తో కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ ఐఏఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో రిటైర్డ్ డెత్ ఉద్యోగుల బెన్ ఫిట్స్, పీఆర్ సి, ఇంక్రిమెంట్స్, డిస్ ప్లీనరీ ఆక్షన్, ఎస్ ఆర్ పెండింగ్ ఫైల్స్, కోర్టు సమ స్యలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చిం చారు. ఎస్టాబ్లిష్ మెంట్ విభాగం లో పని చేసు ్తన్న ఉద్యోగుల పని వివరాలు అడిగి తెలుసు కు న్నారు. నగరపాలక సంస్థ లో పని చేసే ఉద్యో గుల హాజరు శాతం రిజిస్టర్స్, బయోమెట్రిక్ పరిశీలించి... సలహాలు సూచనలు చేస్తూ... ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమీ ్షనర్ చాహాత్ బాజ్ పాయ్ ఐఏఎస్ మాట్లా డుతూ... ఎస్టాబ్లిష్ మెంట్ విభాగం లో పని చేసే ఉద్యోగ సిబ్బంది చాలా బాధ్యత యుతంగా పని చేయాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించ కుండా సక్రమంగా పని చేయాలని అన్నారు. ఎస్టాబ్లిష్ మెంట్ విభాగం లో పెండింగ్ ఫైల్స్ వీలైనంత త్వరగా క్లీయర్ చేయాలని ఆదేశించారు. సర్వీస్ రిలేటెడ్ ఫైల్స్ తో పాటు రిటైర్డ్ %డ% డెత్ ఎంప్లాయిస్ బెన్ ఫిట్స్ పెండింగ్, పీఆర్ సి, ఇంక్రిమెంట్స్, ఎస్ ఆర్ లాంటి పెండింగ్ ఫైల్స్ సమస్యలు వేగవంతంగా పరిష్కరించాలన్నారు. ప్రతి ఉద్యోగికి సర్వీసు బుక్ రికార్డు తప్పని సిరిగా పాటించాలన్నారు. ప్రభుత్వం నుండి అందే ప్రయోజనాలు అందే విధంగా ఎస్టాబ్లిష్ మెంట్ విభాగం పని చేయాలన్నారు. ఎలాంటి ఫైల్స్ పెండింగ్ లేకుండ క్లీయర్ చేయాలని ఆదేశించారు. డీటీవోకు బీల్స్ రిపోర్ట్స్ సబ్ మిట్ చేస్తూ,వారి సమన్వయం తో సక్రమంగా పని చేయాలని ఆదేశించారు. ఫైల్స్ క్లియరెన్స్ కు సంబంధించి తప్పని సరిగా వీక్లీ రిపోర్ట్స్ అందించాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమీషనర్ స్వరూప రాణీ పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో ఒకరికి 4 రోజుల జైలు

**జగిత్యాల, సెప్టెంబర్ 04(నినాదం న్యూస్):** రంగాపూర్ కి చెందిన వేములవాడ మహేశ్ అనే యువకుడు మద్యం సేవించి అజాగ్రత్తగా వాహనం నడపడంతో జగిత్యాల ట్రాఫిక్ ఎస్.ఐ రామచంద్రం కేసు నమోదుచేసి సంబంధిత కోర్టు లో హాజరుపరుచారు. ఈ కేసులో న్యాయమూర్తి నాలుగు రోజుల జైలు శిక్ష విధించారు. మద్యం సేవించి అజాగ్రత్తగా వాహనాలు నడపటం వలన రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతు న్నారని, అజాగ్రత్త చర్య వలన వాహన చోదకులు, అవతలివారి ప్రాణాలు పోవటానికి కూడా భాద్యులు అవుతున్నారని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపకండి ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్.ఐ సూచించారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి...

**మడిపల్లి ప్రభుత్వ వైద్య శిబిరం లో ప్రజలకు అవగాహన**




**జమ్మికుంట సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్):** వర్షాకాలం సీజన్ లో వ్యాపించే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సంధ్య అన్నారు.జమ్మికుంట మండలంలోని వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మడిపల్లి గ్రామ%శీ%లో బుధవారం డాక్టర్ పి సంధ్య ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 54 మంది గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 5గురు జ్వర పీడితులను గుర్తించి, వారి రక్త పూతల నమూనాలను సేకరించి వైద్య పరీక్షల నిమిత్తం ల్యాబ్ కి పంపించారు. ముగ్గురికి మలేరియా కిట్స్ ద్వారా పరీక్షలు ఒకరికి డెంగీ కిట్స్ ద్వారా పరీక్షలు నిర్వహించారు.గ్రామ ప్రజలకు సీజనల్ వ్యాధులు, వ్యక్తి గత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పై అవగహన కల్పించారు. అదేవిధంగా అంగన్వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలకు గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం పై అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ పి సంధ్య, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, సూపర్ వైజర్ సదానందం, ఏఎన్ఎం లు వనజ, సంధ్య సిఏలు ప్రియాంక, పరమేశ్వరి, అంగన్వాడీ టీచర్లు కరుణ, అరుణ, కవిత, ఆశా కార్యకర్తలు సునీత, రమ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


## జీవో 317 బాధిత ఉపాధ్యాయుల సమస్య త్వరలోనే పరిష్కారం



**వెల్గటూర్,సెప్టెంబర్04(నినాదం న్యూస్):**జీవో నెంబర్ 317 ద్వారా స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులకు త్వరలోనే సొంత జిల్లాలకు పంపించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుం దని పి ఆర్ టి యు ఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు యాల్ల అమర్నాథ్ రెడ్డి,బోయిని పెల్లి ఆనంద్ రావు తెలిపారు.బుధవారం పి ఆర్ టి యు టి ఎస్ సభ్యత నమోదు లో భాగంగా వెల్గటూర్,ఎండపల్లి మండలాల్లోని పలు పాఠ శాలలో పర్యటించి సభ్యత నమోదు కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవో నెంబర్ 317 పై ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం త్వరలోనే తన నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తుందని,సమర్పించిన తర్వాత బాధిత ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు పంపిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు నరసింగం,ప్రధాన కార్యదర్శి రవి ,అసోసియేట్ అధ్యక్షులు రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరు బ్రిడ్జి సందర్శన...

**కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు**



**కోరుట్ల, సెప్టెంబర్ 4(నినాదం న్యూస్):** ంకోరుట్ల మండలం కల్లూరు గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న కల్లూరు బ్రిడ్జిని సందర్శించిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు ఇట్టి బ్రిడ్జి కారణంగా పైడిమడుగు మాదాపూర్ జోగినిపల్లి సర్పరాజు పల్లి గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి . ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ తో మాట్లాడి బ్రిడ్జి నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని కోరారు ఈ కార్యక్రమంలో కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ ఉపాధ్యక్షులు నయీమ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ సత్యనారాయణ కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంజిరెడ్డి వైస్ చైర్మెన్ వెంక టేష్ గౌడ్ ఎంబేరి నాగభూషణం నాయకులు అన్నం అనిల్ పుప్పాల ప్రభాకర్ కరుణాకర్ రావు ప్రతాప్ కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కల్లూరు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## మానేరు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి





- నిరుపేద కుటుంబాలకు భరోసా సీఎం రిలీఫ్ ఫండ్.
- పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం.
- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రణవ్.

**జమ్మికుంట, సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్) :** పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేద కుటుంబాలకు వరం అని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వొడితల ప్రణవ్ అన్నారు. బుధవారం హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారు లకు ఆయన అందించారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమర్థవంతమైన పాలన అందిస్తూ ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం ముందంజలో ఉందని ఆయన అన్నారు. గత ప్రభుత్వ హాయంలో జరగని అభివృద్ధి పనులు తొమ్మిది నెలల కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ రాష్ట్రంలో ప్రజా పాలన అందిస్తుందని అని తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ హాస్పిటల్స్ లో మెరుగైన వైద్యం అందిస్తున్నారని ప్రజలకు ఎక్కడ ఇబ్బంది జరగకుండా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు వారికి అండగా నిలవాలని సూచిం చారు. రాష్ట్రంలో గత ఐదు రోజు లుగా కురుస్తున్న భారీ వర్షాలతో జనజీవనం స్తంభించిపోతుందని నేడు రేపు లోయర్ డ్యాం గేట్లు కూడా ఎత్తివేసే అవకాశం ఉందని కావున మానేరు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అంతేకాకుం డా వర్షాకాలంలో రైతులు చాలా జాగ్రత్తలు తీసుకోవాలని బావుల దగ్గర ఉన్న కరెంటు మోటర్లు వర్షానికి తడిసి ఉంటాయని జాగ్రత్తగా మోటార్ ను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. విద్యుత్ అధికారుల సూచనలు పాటిస్తూ స్తంభాలను తాకకుండా జాగ్రత్త పడాలని ఇంట్లో సైతం కరెంటు తీగలకు దూరంగా ఉండాలని పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని ప్రణవ్ తెలిపారు. అనంతరం నియోజక వర్గంలోని పలు మండలాలకు సం బంధించిన లబ్ధిదారులకు ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కులను ఆయన స్వయంగా అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ మండల అధ్యక్షుడు కొల్లూరి కిరణ్ పట్టణ మహిళా అధ్యక్షురాలు యెముల పుష్పలత జమ్మికుంట పట్టణ మహిళా కాం గ్రెస్ అధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్ గౌడ్ మండల అధ్య క్షుడు పుల్లూరి బ్లాక్ కాంగ్రెస్ నాయకులు గూడెం సారంగపాణి వీణవంక కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహమ్మద్ సాహెబ్ హుస్సేన్ పలువురు కాంగ్రెస్ నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల సందర్శన... సిఎం బ్రేక్ ఫాస్ట్ ప్రారంభం

**కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు**



**కోరుట్ల నినాదం( సెప్టెంబర్4) :** పట్టణంలోని గడి ప్రాథమిక పాఠశాలను బుధవారం కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు సందర్శించాడు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందిస్తున్న బ్రేక్ ఫాస్ట్ ను క నర్సింగరావు ప్రారంభించారు అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు ఈ కార్యక్రమంలో కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ ఎస్ ఎం సి కమిటీ ఛైర్మెన్ పోతుగంటి మంగ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం నాయకులు పుప్పాల ప్రభాకర్ సంఘ లింగం మండల విద్యాధికారి గంగుల నరేశం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు ఉపాధ్యాయులు సురేందర్ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దళిత ఎమ్మెల్యేలను అవమాన పరుస్తున్న పోలీస్ అధికారులు

**భువనగిరి ఘటనపై స్పీకర్‌కు, కరీంనగర్ సీపీపై సీఎంకు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**



**కరీంనగర్, సెప్టెంబర్ 4(నినాదం న్యూస్ ):** ఉమ్మడి నల్లగొండ జిల్లా భువనగిరిలో దళిత ఎమ్మెల్యే వేముల వీరేశం నకిరేకల్ పోలీసుల వల్ల జరిగిన ఘోర అవమానంపై స్పీకర్ కు ఫిర్యాదు చేయనున్నట్టు దళిత సామాజికవర్గానికి చెందిన మానకొండూర్ శాసన సభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆహ్వానం మేరకు భువనగిరికి వచ్చే రాష్ట్ర మంత్రులు ఉత్తం కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రభృతులకు ఆహ్వానం పలికేందుకు హెలికాప్టర్ వద్దకి వెళుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం ను అడ్డుకోవడమే కాకుండా ఛాతిపై చేయి వేసి తోసివేసి ఘోరంగా అవమానించారని ఆయన ఆరోపించారు. ఇది ప్రభుత్వపరంగా జరిగిన తప్పిదం ఎంతమాత్రం కాదని, ఎస్సీలపట్ల పోలీస్ అధికారులకు ఉన్న చిన్నచూపు, చులకనభావం, దురహంకారమే కారణమని ఆయన పేర్కొన్నారు. దురహంకార పోకడలు గల పోలీసు అధికారులు అక్కడక్కడ ఉన్నారని, కరీంనగర్ పోలీస్ బాస్ కూడా ఇదే తరహా పోకడలను అనుసరిస్తున్నారని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆరోపించారు. మానకొండూర్ సీఐ పోస్టు ఖాళీగా ఉండటంతో అక్కడ సీఐని ముఖ్య మంత్రి గారి సహకారం తో నియమిస్తే దాన్ని కరీంనగర్ సీపీ రద్దు పర్చారని, త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించకుండా సీఐకు పోస్టింగ్ ఇవ్వడం కుదరదని మెలిక పెట్టగా, సీపీ సూచన మేరకు బోర్డ్ మీటింగ్ నిర్వహించి సీఐ పోస్టింగ్ ఇచ్చారని ఆయన తెలిపారు. అయితే నేను కాదన్నా ఎలా పోస్టింగ్ తెచ్చుకున్నావంటూ సదరు సీఐని బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ధళిత ఎమ్మెల్యే ఇంకో దళిత అధికారికి సీఐ పోస్టింగ్ వేయిస్తారా అనే చిన్నచూపు, దురహంకారంతోమే సీపీ అభ్యంతరానికి కారణమని ఆయన పేర్కొన్నారు. కరీంనగర్ సీపీ నిర్వాకాన్ని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి తేనున్నటు ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ తెలిపారు.

## శాంతియుతంగా గణేష్ నవరాత్రులు.. మిలాద్ ఉన్ నబీ పండుగలు జరుపుకోవాలి

**శాంతి సంక్షేమ కమిటీ సమావేశం నిర్వహించిన కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి**




**కరీంనగర్, సెప్టెంబర్ 4(నినాదం న్యూస్ ):** కరీంనగర్ కమిషనరేట్‌లోని జాన్ విల్సన్ హాలు నందు బుధవారం కరీం నగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి శాంతి సంక్షేమ కమిటీ సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ, రానున్న గణేష్ నవరాత్రులు మిలాద్ ఉన్ నబీ పండుగలు అన్ని వర్గాల వారు ప్రశాంత వాతావరణం లో జరుపుకోవాలన్నారు. గణేష్ మండపాల వద్ద పోలీసుల సూచనలు పాటిస్తూ వచ్చే భక్తులకు భద్రత కల్పిస్తూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని మండప నిర్వాహకులకు సూచించారు. గణేష్ ఉత్సవ కమిటీల్లో సంఘ విద్రోహ శక్తులకు, గతంలో అల్లర్లు సృష్టించిన వ్యక్తులకు చోటు కల్పించకూడదని తెలిపారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మకూడదని, వాటికి స్పందించి ప్రజా శాంతికి భంగం కలిగించే చర్యలకు పాల్పడితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏదైనా సమాచారం వారి దృష్టికి వస్తే సంబంధిత పోలీస్ అధికారులకు తెలపాలని , సమస్య పరిష్కరించి వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా నిర్వహించే ర్యాలీ హైదరాబాద్ లో నిర్ణయించినట్లు సెప్టెంబర్ 19వ తేదీన జరుపుకోవాలని ఈ విషయంలో పోలీసులకు సహకరించాలని కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కరీంనగర్ ప్రజలంతా ఐక్యమత్యంతో పండగలు జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ నరేందర్ తో పాటుగా వన్, టూ, త్రి, టౌన్ పోలీస్ స్టేషన్ల ఇన్స్పెక్టర్లు, శాంతి కమిటీ సభ్యులు ఇతర మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## మానేరు పరివాహక ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలి

**మానేరు డ్యామ్ గేట్లు ఎత్తడానికి సిద్ధమైన యంత్రాంగం**

**మీడియా మిత్రులు కూడా సహకరించాలి: హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**



**జమ్మికుంట, సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్)ఫ** మానేరు ఎగువ పరివాహక ప్రాంతంతో పాటు ఉత్తర తెలంగాణలో అతి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కరీంనగర్ మానేరు డ్యాం గేట్లు ఏ క్షణమైనా ఎత్తడానికి అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని, మానేరు డ్యాం దిగువ ఉన్న గ్రామ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. బుధవారం వీణవంకలోని ఆయన స్వగ్రామం నుంచి గత ఐదు రోజులుగా కురుస్తున్న అతి భారీ వర్షాల కారణంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. డ్యాం దిగువ ఉన్న గ్రామాలలో సంబంధిత అధికారులు దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. నది పరివాహక ప్రాంతంలో పశు వులు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రైతులు కూడా వ్యవసాయ భూముల వద్దకు వెళ్లకుండా ఉంటే బాగుంటుందన్నారు. దిగువ ప్రాంతంలో ఉండే గ్రామాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అలాగే మీడియా మిత్రులు కూడా ప్రజలకు సమాచారం అన్ని విధాల సిద్ధంగా ఉండాలని కోరారు. అలాగే హుజురాబాద్ నియోజకవర్గం లోని హుజురాబాద్ పట్టణంలోని 17 వ వార్డ్ ,బుడగ జంగాల కాలనీ, జమ్మికుంటలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ, వీణవంకలోని కనపర్తి గ్రామం ప్రజలు వర్షాలతో చాలా అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అలాగే హుజరాబాద్, జమ్మికుంట మున్సిపల్ అధికారులు రెండు ప్రాంతాల్లో సహాయక చర్యలు అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ముఖ్యంగా జలాశయ దిగువ ఉన్న ప్రజలంతా చాలా అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు అధికారులు వారికి సూచన చేస్తూ ఎలాంటి హాని జరగకుండా చూడాలని అని అన్నారు

## సింథటిక్ వస్త్రాలు వద్దు చేనేత బట్టలే ముద్దు...

**మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ**



**కరీంనగర్,సెప్టెంబర్ 4(నినాదం న్యూస్ ):** సింథటిక్ వస్త్రాల జోలికి వెళ్లకుండా చేనేత బట్టలనే వాడాలని కరీంనగర్ జిల్లా కాంగ్రెసి పార్టీ అధ్యక్షుడు, మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణాశాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ సింథటిక్ వస్త్రాలకు బదులు చేనేత దుస్తులు వాడాలని పిలుపునివ్వడం ముదావహమని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా విద్యాశాఖతోపాటు ప్రభుత్వ ఇతర శాఖలను కోరతాననడం శుభ పరిణా మామన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పిలుపు మేరకు తాను కూడా చేనేత వస్త్రాల వాడకాన్ని ప్రోత్సహిస్తానన్నారు. ఇక ముందు వివిధ సందర్భాల్లో జరిగే సన్మాన కార్యక్రామాల సమయంలో సింథటిక్ శాలువాలు కాకుండా చేనేత టవళ్లను మాత్రమే కప్పాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ కోరారు. సంక్షోభంలో చిక్కుకుని కూనారిల్లుతున్న చేనేత పరిశ్రమను గట్టెక్కించాల్సిన అవసరం ప్రభుత్వంపైనే కాకుండా మనందరిపై కూడా ఉందన్నారు. ఇలాంటి తరుణంలో తగ్గిపోయిన చేనేత వస్త్రాల వాడకాన్ని పెంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. చేనేత వస్త్రాల వాడకం పెరిగితే వాటి ఉత్పత్తులు కూడా పెరుగుతాయని, దీంతో నేత కార్మికులకు పని దొరుకుతుందని, తద్వారా వారి కుటుంబాలను పోషించుకోగలుగుతారని ఆయన అభిప్రాయపడ్డారు.చేనేత వస్త్రాలంటే కేవలం చీరలు, ధోవతులు మాత్రమే కాదని, తువ్వాలలు, దుప్పట్లు, తివాచీలు,లుంగీలు, చేతి రుమాలలు, సాదా బట్టలు కూడా చేనేత ఉత్పత్తులేనని ఆయన పేర్కొన్నారు. సిరిసిల్ల నియోజకవర్గానికి పదేళ్ల పాటు ప్రాతినిథ్యం వహించిన కల్వకుంట్ల రామారావు సిరిసిల్ల చేనేత పరిశ్రమకు చేసిందేమీ లేదని డాక్టర్ కవ్వంపల్లి ఆరోపించారు. గత బీఆర్ఎస్ పాలకులకు చేనేత పరిశ్రమను, నేత కార్మికులను ఆదుకోవడంలో వైఫల్యం చెందిందని ఆయన విమర్శించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో చేనేత ఉత్పత్తులను మనమే కాకుండా మన కుటుంబాల్లోనూ విరివిగా వాడేలా చూడాలని ఎమ్మెల్యే సత్యనారాయణ కోరారు.


## కబ్జాకు గురైన భూమిని వెనక్కి తీసుకోవాలి

- ఊరికి ప్రాణ రక్షణగా ఉన్న చెరువును రక్షించండి.
- కొత్తగా వేసిన గండిని పూడ్చండి
- తహసిల్దార్‌కు వినతి పత్రం ఇచ్చిన మేక మల్ల అశోక్.



**జమ్మికుంట, సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్):** జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామ పెద్ద చెరువు మడిపల్లి -అంకుశపూర్ ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న చెరువు దొరల హయాంలో అమాయక రైతులకు అమ్మి వాటిని పట్టా భూములుగా మార్చటం జరిగిందని. చెరువు ను కొన్నటువంటి అమాయక రైతులు మావి పట్టా భూములని మేము వ్యవసాయం చేసుకుంటామని అధికారులను తప్పుదోవ పట్టిస్తూ చెరువు నిర్మాణం జరిగినప్పుడు ఉన్నటువంటి తూము ఉండగా గత ప్రభుత్వ పెద్దల సహకారంతో ప్రత్యేకంగా అంకుషాపూర్ రోడ్డున చెరువుకు పెద్ద గండి పెట్టి చెరువులో చుక్క నీరు కూడా ఉండకుండా చేస్తున్నటువంటి దుస్థితి మడిపల్లి చెరువుకు ఏర్పడింది. రాష్ట్రవ్యాప్తంగా విపరీతమైనటువంటి వర్షాలు కురుస్తున్నప్పటికీ చెరువులు కుంటలు నిండి జలకలాడుతూ ఉంటే మడిపల్లి చెరువు మాత్రం విలవిల వాడిపోతున్నది. దీనంతటికీ కారణం ప్రత్యేకంగా చెరువుకు గండిపెట్టి పడ్డ నీరు పడ్డట్లే పోయేటట్లుగా అధికారులతో కుమ్మక్కై చేసినటువంటి పరిస్థితి. దీన్ని గ్రహించినటువంటి రైతుల సంక్షేమం కోసం మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మేకమళ్ళ అశోక్ బుధవారం జమ్మికుంట తహసిల్దార్ రమేష్ బాబుకి వినతి పత్రం సమర్పించారు. ము ఖ్యంగా నూతనంగా చెరువుకు పెట్టినటువంటి గండిని పూడ్చాలని,అమాయక రైతుల నుండి కబ్జా గురిఅయిన చెరువు భూమిని స్వాధీనం చేసుకోవాలని అవసరమైతే హైడ్రా చట్టాన్ని ఉప యోగించుకోవాలని తక్షణమే చర్యలు తీసుకోవాలని వినతి పత్రం సమర్పించారు. ఒకవేళ తక్షణ చర్యలు తీసుకోనట్లయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకెళ్తామని కోరారు.

## రహదారి నిర్మాణానికి కృషి చేస్తా: హామీ ఇచ్చిన ప్రణవ్



**జమ్మికుంట, సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్):** హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని బోర్నపల్లి నుండి నరసింగపూర్ చెరువు కట్ట మీద నుండి రైతులు వ్యవసాయ పనులకు వెళ్ళుటకు చెరువు కట్ట మీద వాహనాలో వెళ్ళటానికి రహదారి లేక పోవడం తో ఇబ్బందులు ఎదుర్కొం టున్నామని, రహదారి నిర్మిస్తే రెండు గ్రామాలకు వ్యవసాయ పనులకు, వర్తక, వాణిజ్య, వ్యాపా రం కొరకు రవాణా సౌకర్యం ఏర్పడుతుందని స్థానిక రైతులు వోడితల ప్రణవ్ ను కోరారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ బోర్నపల్లి చెరువు కట్ట పై రోడ్డు నిర్మాణానికి నిధులు తీసు కొచ్చి పనులు జరిపిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. అభివృద్ధి విషయంలో ఎక్కడ రాజీ పడేది లేదని ప్రజలకు కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందు ఉంటుందని ఆయన తెలిపారు. అనంతరం మహిళ రైతులతో ఆయన మాట్లాడుతూ వారి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు సంభవిస్తాయని పార్టీకి దూరంగా ఉండి పౌష్టికాహారం తీసుకొని జాగ్రత్తగా ఉండాలని వారికి సూచించారు.

## రేషన్ కార్డు లేని రైతులు రుణమాఫీ కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

**జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి...**



**జమ్మికుంట సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్):** రేషన్ కార్డు లేదు రైతులు రుణమాఫీ కోసం ఆన్లైన్ లో నమోదు చేసుకోవాలని పిల్ల వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం జమ్మికుంట మండలంలోని కోరపల్లి గ్రామంలో రేషన్ కార్డు లేకుండా రుణమాఫి కానీ రైతుల వివరాలు వ్యవసాయ అధికారులు ఆన్లైన్ లో ఎంట్రీ చేశారు.ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మీ హుజూరాబాద్ ఏడిఏ సునీత పరిశీలించి త్వరిత గతిన సర్వే పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కేడిసిఎంఎస్ ఎరువుల దుకాణంలో ఎరువుల నిల్వలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రజిత వ్యవసాయ విస్తరణ అధికారులు రాంప్రసాద్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# తప్పక తినాల్సిన సూపర్ ఫుడ్ ఇది..!

## ఈ చిన్న గింజల్లో పోషకాలు తెలిస్తే..



గుమ్మడి గింజల్లో ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచి, మలబద్ధకం, అజీర్ణం వంటి సమస్యలను తగ్గిస్తుంది. గుమ్మడి గింజలు మనకు చాలా కాలం పాటు ఆకలిని తగ్గించి, బరువు తగ్గడానికి సహాయపడతాయి. గుమ్మడి గింజల్లో జింక్ అధికంగా ఉంటుంది. జింక్ థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తికి చాలా ముఖ్యమైన ఖనిజం.

థైరాయిడ్ అనేది మెడ ముందుభాగంలో ఉన్న ఒక గ్రంథి. ఇది శరీరంలోని వివిధ ప్రక్రియలను నియంత్రించే హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది. అయితే థైరాయిడ్ గ్రంథి సరిగ్గా పని చేయకపోవడం వల్ల అనేక వ్యాధులు వస్తాయి. థైరాయిడ్ నుంచి బయటపడాలి అనుకొనేవారు గుమ్మడి గింజలను తీసుకోవాలి.

గుమ్మడి గింజలు అనేవి కేవలం రుచిని పెంచేవి మాత్రమే కాదు. ముఖ్యంగా థైరాయిడ్ సమస్యలతో బాధపడే వారికి ఇవి అద్భుతమైన మందు. గుమ్మడి గింజల్లో ఉండే మెగ్నీషియం, పొటాషియం హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడతాయి.గుమ్మడి గింజలు దీర్ఘకాలిక వాపును తగ్గించడంలో సహాయపడతాయి. థైరాయిడ్ సమస్యలు చాలా సందర్భాలలో దీర్ఘకాలిక వాపుతో సంబంధం కలిగి ఉంటాయి. ఈ చిన్న గింజల్లో ప్రోటీన్లు, ఫ్యాట్స్, ఫైబర్, విటమిన్స్, మినరల్స్ అధికంగా ఉంటాయి. థైరాయిడ్ గ్రంథి సక్రమంగా పనిచేయడానికి అయోడిన్ అవసరం. గుమ్మడి గింజలు అయోడిన్‌ను సమతౌల్యం చేయడంలో సహాయపడతాయి. గుమ్మడి గింజల్లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. పురుషులలో ప్రోస్టేట్ సమస్యలను తగ్గించడంలో గుమ్మడి గింజలు ఉపయోగపడతాయి.రక్తపోటును నియంత్రించి, గుండె జబ్బులను తగ్గిస్తాయి. గుమ్మడి గింజలు చూడడానికి చిన్నవిగా అనిపించినా అందులో దాగి ఉన్న పోషక విలువలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. గుమ్మడి గింజల్లో ఉండే ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తిని పెంచి, మంచి నిద్రకు దోహదపడుతుంది.

## పిల్లల్లో డయాబెటిస్..

## ఈ అసాధారణ మార్పులను నిర్లక్ష్యం చేయొద్దు!

శరీరంలో ఇన్సూలిన్ సరిగా ఉత్పత్తి కాకపోయినా, లేదా ఉత్పత్తి అయినదాన్ని సరిగా వినియోగించుకోలేకపోయినా డయాబెటిస్ వ్యాధి బారిన పడతారు. రక్తంలో చక్కెర స్థాయిలు పరిమితిని దాటి రకరకాల ఇతర రోగాలకు దారి తీస్తాయి. ఒకప్పుడు పెద్దలకే పరిమితమైన షుగర్ వ్యాధి ఇప్పుడు పల్లల్ని కాటేస్తోంది. ముఖ్యంగా పిల్లల్లోనూ టైప్ 1 డయాబెటిస్ కేసులు వెలుగు చూస్తున్నాయి. కాబట్టి, చిన్నారుల్లో డయాబెటిస్ వ్యాధి లక్షణాలు ఏంటో తెలుసుకుంటే వ్యాధిని తొలి దశలోనే గుర్తించొచ్చని అంటున్నారు

డయాబెటిస్ లక్షణాలు అందరిలో ఒకేలా ఉండవనేది వైద్యులు చెప్పే మాట. కొందరు చిన్నారుల్లో ఈ వ్యాధికి సంబంధించి అసాధారణ లక్షణాలు కూడా కనిపిస్తాయట

%చిన్నారుల చర్మంపై, బాహుమూలాల్లో నల్లటి మచ్చలు కనిపిస్తుంటే సందేహించాల్సిందేనని వైద్యులు చెబుతున్నారు. ఇన్సూలిన్ అధికమవడంతో చర్మంలో కణాల సంఖ్య పెరిగి ఈ పరిస్థితికి దారి తీస్తుందని అంటున్నారు.

డయాబెటిస్‌తో రోగనిరోధక వ్యవస్థ బలహీనమవుతుంది. పిల్లల్లో ఈ పరిస్థితి వస్తే వారు తరచూ రకరకాల చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్ల బారిన పడుతుంటారు. రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగినప్పుడు తెల్ల రక్తకణాలకు అడ్డంకులు వస్తాయని, ఫలితంగా సూక్ష్మక్రిములను ఎదుర్కొనే శక్తి సన్నగిల్లుతుందని అంటున్నారు.

డయాబెటిస్ రోగుల్లో సాధారణంగా కనిపించే లక్షణం నీరసం. పిల్లలు కూడా ఇందుకు అతీతం కాదు. రోజంతా ఆటలు ఆడి వచ్చే చిన్నారులకు నీరసం సహజమే కానీ నిత్యం అలసటతో ఇబ్బంది పడే వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

రక్తంలో చక్కెర స్థాయి అధికంగా ఉంటే కంటి లెన్స్‌కు సాగే గుణం తగ్గుతుంది. దీంతో, చూపు మసకబారుతుంది. డయాబెటిస్ ఉన్న పిల్లల్లో ఈ సమస్య కనిపిస్తుంది కాబట్టి ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు.

రక్తంలో చక్కెరలు ఎగుడుదిగుడుకు లోనైతే అది భావోద్వేగాలపై కూడా ప్రభావం చూపిస్తుంది. కాబట్టి, పిల్లల్లో మూడ్ స్వింగ్స్, తరచూ చిరాకు పడటం, ఏకాగ్రత లోపించడం వంటివన్నీ డయాబెటిస్ వ్యాధికి సంకేతాలుగా భావించొచ్చు

నియంత్రణలో లేని డయాబెటిస్ కారణంగా శరీరంలోని నాడులు దెబ్బతింటాయి. దీంతో, దురదలు తలెత్తుతాయి. కాబట్టి, నిత్యం దురదలతో చిన్నారులు ఇబ్బంది పడుతుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

# గుండె ఆరోగ్యానికి మేలు చేసే బ్రొకోలి..

బ్రొకోలి చూసేందుకు కాలీఫ్లవర్ లాగా ఉంటుంది. ఆకుపచ్చగా ఉండే బ్రోకలీ కాలీఫ్లవర్ జాతిలో ఓ ప్రత్యేకమైన కూరగాయల రకం. గతంలో ఇవి విదేశాలలో మాత్రమే లభ్యమయ్యేవి.కానీ ప్రస్తుతం మన దేశంలో కూడా వీటిని పండిస్తున్నారు. ఈ కూరగాయ వివిధ రకాల విటమిన్లు, కాల్షియం, పొటాషియం వంటి ఖనిజాలతో నిండి ఉంటుంది. బ్రకోలీ తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో ఇక్కడ తెలుసుకుందాం..



బ్రోకలీలో ఫైబర్, పొటాషియం, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇది హృదయ ఆరోగ్యానికి చాలా ముఖ్యమైనది. ఫైబర్ కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. పొటాషియం రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఒమేగా -3 కొవ్వు ఆమ్లాలు మంటను తగ్గించడంలో, గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సహాయపడతాయి.

బ్రోకలీలో గ్లూకోసినోలేట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇది శరీర నిర్విషీకరణ ప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఈ సమ్మేళనం కాలేయం నిర్విషీకరణ ఎంజైమ్‌లను సక్రియం చేస్తుంది. ఇది టాక్సిన్స్, హానికరమైన పదార్థాలను తొలగించడంలో సహాయపడుతుంది. అలాగే బ్రోకలీలో కాల్షియం, విటమిన్ కె, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. ఈ పదార్థాలన్నీ మొత్తం ఎముకల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు సహాయపడుతాయి. కాల్షియం అనేది ఎముక కణజాలం ప్రాథమిక బిల్డింగ్ బ్లాక్. అయితే ఇందులోని విటమిన్ %ఖ% కాల్షియంను గ్రహించడంలో సహాయపడుతుంది. మెగ్నీషియం ఎముక సాంద్రతను పెంచుతుంది.

బ్రోకలీలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీవక్రియను పెంచుతుంది. తద్వారా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇందులోని పదార్థాలు జీర్ణక్రియలో ముఖ్యమైన పాత్ర పోషించి, జీర్ణాశయంలో ప్రయోజనకరమైన బ్యాక్టీరియాను కూడా పెంచుతాయి. బరువు నియంత్రణలో సహాయపడుతుంది. తక్కువ క్యాలరీలు ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉండటం వల్ల బ్రొకోలీ చాలా కాలం పాటు కడుపును నిండుగా ఉంచుతుంది. ఫలితంగా అతిగా తినే అవకాశం తగ్గుతుంది.

బ్రోకలీలో లుటీన్, జియాక్సంతిన్ అనే పదార్థులు ఉన్నాయి. %ఖఎ% కిరణాలు, ఇతర నష్టం నుంచి కళ్ళను రక్షించడంతో ఈ రెండు ముఖ్యమైన యాంటీఆక్సిడెంట్లు బలేగా ఉపయోగపడతాయి. ఈ పదార్థం వయస్సు-సంబంధిత దృష్టి క్షీణత, కంటిశుక్లం ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. బ్రోకలీలో విటమిన్ సి అధిక స్థాయిలో ఉంటుంది. ఇది తెల్ల రక్త కణాల ఉత్పత్తిని ప్రేరేపించడం ద్వారా శరీర రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

అవని

## దానిమ్మ పండు ఆకులతో

# ఇన్ని లాభాల.?



ఆయుర్వేదంలో దానిమ్మ ఆకుని కుష్టు వ్యాధి, చర్మ రోగాల నివారణకు ఉపయోగిస్తారు.దానిమ్మ ఆకుల కషాయంగా చేసుకుని రోజుకు రెండు సార్లు తాగితే.. సీజనల్ దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది.

నిద్ర లేమి వారికి దివ్య ఔషధం దానిమ్మ ఆకుల పేస్ట్ తో చేసిన కాషాయం.. మూడు వంతుల నీటిలో దానిమ్మ ఆకుల పేస్ట్ ని వేసి.. ఆ నీరు అర వంతు వచ్చే వరకూ మరిగించి.. ఈ నీటిని రోజూ రాత్రి నిద్ర పోయేముందు తాగితే సుఖ నిద్ర మీ సొంతం.

గజ్జి, తామర వంటి స్కిన్ సంబంధ వ్యాధులతో ఇబ్బంది పడుతుంటే.. దానిమ్మ ఆకులను పేస్ట్ ను అప్లై చేస్తే నయం అవుతుంది. అంతేకాదు శరీరం మీద ఉన్న పుండ్లు, గాయాలు త్వరగా తగ్గుతాయి.


చెవి, నొప్పి ఇన్ఫెక్షన్ తో ఇబ్బంది పడేవారు దానిమ్మ ఆకుల నుంచి రసం తీసుకుని.. అందులో నువ్వుల నూనె లేదా ఆవ నూనె కలిపి%ా%ఆ మిశ్రమాన్ని రెండు చుక్కలు రెండు చెవుల్లో వేస్తుంటే.. చెవి నొప్పి, ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి.

నోటి సంబంధిత వ్యాధుల నుంచి మంది ఉపశమనం లభిస్తుంది. నోటి దుర్వాసన, చిగుళ్ల సమస్య, నోటిలో పుండ్లు ఉంటె.. దానిమ్మ ఆకుల రసాన్ని నీటిలో కలిపి ఆ నీటితో పుక్కిలిస్తుండాలి. దీంతో నోటి సమస్యలు నివారింపబడతాయి.

ముఖంపై మొటిమలు తగ్గడానికి బెస్ట్ చిట్కా దానిమ్మ ఆకుల పేస్ట్‌ను మొటిమలపై రాస్తుంటే మొటిమలు తగ్గిపోతాయి. అజీర్ణం, మలబద్దకం, గ్యాస్, విరేచనాలు వంటి సమస్యలు తరచుగా ఏర్పడుతుంటే.. దానిమ్మ ఆకుల జ్యూస్ రోజుకు రెండు టి స్పూన్లు మేర తాగవచ్చు.




NINADAM
MARKET



## స్టైలిష్ లుక్‌లో కొత్త జావా బైక్..

## రాయల్ ఎన్‌ఫీల్డ్‌కి గట్టి పోటీ తప్పదు..




మార్కెట్లో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్స్‌కి మంచి డిమాండ్ ఉంటుంది. అయితే దీనికి సరైన ప్రత్యామ్నాయం ఇప్పటి వరకూ లేదనే చెప్పాలి. ఈ క్రమంలో ఆ సెగ్మెంట్లో ఎన్‌ఫీల్డ్ తిరుగులేని ఆధిపత్యాన్ని చెలాయిస్తోంది. ఈ క్రమంలో దానికి పోటీగా జావా యెజ్డీ మోటార్ సైకిల్స్ రంగంలోకి దిగింది. తన కొత్త ఉత్పత్తి జావా 42ఎఫ్‌జే మోటార్ సైకిల్ ను లాంచ్ చేసింది. దీని ప్రారంభ ధర రూ. 1.99లక్షలుగా ఉంది. ఇది సరికొత్త స్టైలింగ్ తో పాటు, పెద్ద ఇంజిన్ వస్తుంది. దీని బుకింగ్స్ ను కంపెనీ ఇప్పటికే ప్రారంభించింది. డెలివరీలు అక్టోబర్ రెండో తేదీ నుంచి మొదలవనున్నాయి. ఇప్పటికే ఉన్న జావా 42కి అప్ డేటెడ్ వెర్షన్ గా ఇది వస్తోంది. భారత మార్కెట్లో ఇది నేరుగా రాయల్ ఎన్‌ఫిల్డ్ హంట్ 350, హోండా సీబీ 350 వంటి మోడళ్లతో పోటీపడనుంది.

జావా 42ఎఫ్‌జే లుక్..

సరికొత్త జావా 42ఎఫ్‌జే లుక్ చాలా అగ్రెసివ్ గా కనిపిస్తుంది. ఈ మోటార్ సైకిల్ ఆధునిక రెట్రో థీమ్‌ను పొందుతుంది. దీనికి టియర్ డ్రాప్ ఆకారంలో ఉండే ఫ్యూయెల్ ట్యాంక్, పక్కన అల్యూమినియం ప్లేట్ ఉంటుంది. బండి ట్యాంక్ పై పెద్ద అక్షరాలలో జావా అని ఉంటుంది. సైడ్ ప్యానల్స్ పాత స్టాండర్డ్ వెర్షన్ లాగానే ఉంటాయి. అయితే సీటు డిజైన్ కొత్తగా ఉంది. హ్యాండిల్ బార్ పొజిషన్ కూడా విభిన్నంగా ఇచ్చారు. దీని ద్వారా రైడర్ కు అదనపు సౌలభ్యం కలుగుతుంది. అల్లాయ్ వీల్స్ ఆకర్షణీయంగా ఉంటాయి.

జావా 42ఎఫ్‌జే ఫీచర్లు..

క ఫీచర్ల గురించి చూస్తే ముందు వైపు ఎల్ఈడీ హెడ్ ల్యాంప్, సెమీ డిజిటల్ ఇన్స్ట్రుమెంట్ కన్సోల్, డ్యూయల్ చానల్ ఏబీఎస్, అసిస్ట్, స్లిప్పర్ క్లచ్ వంటివి ఉంటాయి.

జావా 42ఎఫ్‌జే స్పెసిఫికేషన్లు..

ఈ సరికొత్త బైక్లో 334సీసీ సింగిల్ సిలెండర్, లిక్విడ్ కూల్డ్ మోటార్ ఉంటుంది. ఈ కొత్త ఇంజిన్ అధిక ఎన్వీహెచ్ లెవెల్స్, పనితీరును కలిగి ఉంటుంది. పాత మోడల్ తో పోల్చితే మరింత సమర్థనీయమైన థర్మల్ మేనేజ్మెంట్ యూనిట్ ఉంటుంది. ఇది 22బీహెచ్పీ, 28ఎన్ఎం టార్క్ ని ఉత్పత్తి చేస్తుంది. ఆరు స్పీడ్ గేర్ బాక్స్ ఇచ్చారు. ఇతర మెకానిక్ భాగాల గురించి చెప్పాలంటే ముందు వైపు టెలిస్కోపిక్ ఫోర్క్స్, ట్విన్ షాక్ అబ్జర్బర్లు ఉంటాయి. డిస్క్ బ్రేకింగ్ సిస్టమ్ ఉంటుంది. డ్యూయల్ చానల్ ఏబీఎస్ తో వస్తుంది. జావా 42ఎఫ్‌జే లాంచ్ సందర్భంగా జావా యెజ్డీ మోటార్ సైకిల్స్ సహ వ్యవస్థాపకుడు అనుపమ్ తరేజా మాట్లాడుతూ 2024లో ఈ జావా42 ఎఫ్జే తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. ఉత్తమమైన డిజైన్ తీసుకురావడానికి సమయం పట్టినట్లు చెప్పారు. ధర తగిన పనితీరును ఈ బైక్ అందిస్తుందని వివరించారు.

## 15 శాతం వృద్ధి దిశగా క్రెడిట్ కార్డుల పరిశ్రమ..

# 20 కోట్లకు చేరుతుందని అంచనా

భారత్‌లో క్రెడిట్ కార్డుల సంఖ్య 200 మిలియన్లకు(20 కోట్లు) చేరుతుందని తాజాగా పీడబ్ల్యూసీ నివేదిక అంచనా వేసింది. మొత్తంగా వీటిల్లో15 శాతం కాంపౌండ్ వార్షిక వృద్ధి రేటు ) నమోదవుతుందని వెల్లడించింది.

15 శాతం వృద్ధి దిశగా క్రెడిట్ కార్డుల పరిశ్రమ.. 20 కోట్లకు చేరుతుందని అంచనా

ఇంటర్నెట్ డెస్క్: భారత్‌లో క్రెడిట్ కార్డుల సంఖ్య 200 మిలియన్లకు(20 కోట్లు) చేరుతుందని తాజాగా పీడబ్ల్యూసీ నివేదిక అంచనా వేసింది. మొత్తంగా వీటిల్లో15 శాతం కాంపౌండ్ వార్షిక వృద్ధి రేటు నమోదవుతుందని వెల్లడించింది. క్రెడిట్ కార్డ్ పరిశ్రమ గణనీయమైన వృద్ధిని సాధిస్తోందని, గత ఐదేళ్లలో జారీ చేసిన క్రెడిట్ కార్డుల సంఖ్య రెట్టింపు అయిందని తెలిపింది. భవిష్యత్తులోనూ ఇదే ధోరణి కొనసాగుతుందని అంచనా వేసింది. "భారత్‌లో 28-29 నాటికి క్రెడిట్ కార్డ్ మార్కెట్ 200 మిలియన్ కార్డ్‌లకు చేరుకుంటుందని మేం అంచనా వేస్తున్నాం. గత ఐదేళ్లలో ఈ పరిశ్రమ100 శాతం వృద్ధి సాధించింది.

రాబోయే ఐదు ఆర్థిక సంవత్సరాల్లో ఇదే వృద్ధిని నమోదు చేస్తుంది" అని నివేదిక పేర్కొంది. క్రెడిట్ కార్డ్ పరిశ్రమ లావాదేవీల్లో గణనీయమైన పెరుగుదలను రిపోర్ట్ వివరించింది. లావాదేవీల విలువ మొత్తంగా 28 శాతం పెరిగింది. నూతన ఉత్పత్తులు, వినూత్న ఆఫర్లు, కస్టమర్ల పెరుగుదల వృద్ధికి కారణాలుగా చెప్పవచ్చు.

ఛానల్ ఫాలో అవ్వండి

డెబిట్ కార్డుల వినియోగం..

అయితే డెబిట్ కార్డుల వినియోగం తగ్గిందని నివేదిక పేర్కొంది. డెబిట్ కార్డ్ లావాదేవీల సంఖ్య, విలువ రెండూ తగ్గాయి. ఇది వినియోగదారుల ప్రాధాన్యతలలో మార్పును సూచిస్తోంది. 23-24 ఏడాదిలో డెబిట్ కార్డ్ లావాదేవీల వాల్యూమ్ మునుపటి సంవత్సరంతో పోలిస్తే 33 శాతం తగ్గింది. డెబిట్ కార్డ్‌లపై ఏడాదికి18 శాతంమేర ఖర్చు తగ్గింది. ఒకే ఏడాదిలో డెబిట్ కార్డులు గణనీయంగా తగ్గాయి. 23-24 సమయంలో డెబిట్ లావాదేవీల పరిమాణం, విలువ గణనీయంగా దెబ్బతిన్నాయి.




యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్‌కు పెరుగుతున్న ప్రజాదరణ కారణంగా డెబిట్ కార్డుల వాడకం తగ్గింది. వినియోగదారులు చాలా వరకు యూపీఐ చెల్లింపులనే ఆశ్రయిస్తున్నారు. జీరో మర్చంట్ డిస్కౌంట్ రేట్ కారణంగా చిన్న, మధ్యస్థ వ్యాపారులకు యూపీఐ ప్రధాన చెల్లింపు సాధనంగా మారింది. ఆకర్షణీయమైన రివార్డులు ఇవ్వకపోవడంతో.. డెబిట్ కార్డ్‌లు క్రెడిట్ కార్డ్‌లతో పోటీపడలేకపోతున్నాయి. రివార్డులు ఇవ్వకపోవడం, డెబిట్ కార్డు ప్రయోజనాలపై అవగాహన తక్కువగా ఉండటం వల్ల ఈ కార్డ్‌లు వినియోగదారులను ఆకర్షించట్లేదు.

వృద్ధిపథంలో డిజిటల్ చెల్లింపులు..

భారత్‌లో డిజిటల్ చెల్లింపులు వృద్ధిపథంలో సాగుతున్నాయి. 23-24లో లావాదేవీల పరిమాణం సంవత్సరానికి 42 శాతం పెరిగింది. ఈ ట్రెండ్ 8-29 నాటికి మూడు రెట్లు పెరుగుతుందని అంచనా. సాంకేతిక పురోగతి, వినియోగదారులకు అవగాహన పెరగడం వంటి కారణాలతో డిజిటల్ చెల్లింపులు పెరుగుతున్నాయని నివేదిక వెల్లడించింది.




## వరుస లాభాలకు బ్రేక్..

## నష్టాల బాటలో దేశీయ సూచీలు..



వరుసగా లాభాలు అందుకుంటూ దూసుకుపోతున్న దేశీయ సూచీలకు బ్రేక్ పడింది. అంతర్జాతీయంగా పలు ఉద్రిక్తతలు, ప్రతికూల సంకేతాల కారణంగా దేశీయ సూచీలు నష్టాల బాట పట్టాయి. అమెరికా మార్కెట్లు మంగళవారం నష్టాలు మూటగట్టుకున్నాయి. ఆ ప్రభావం నేడు ఆసియా సూచీల పైనా పడింది. దీంతో భారత స్టాక్ మార్కెట్లు కూడా నష్టాలతో మొదలయ్యాయి. ఉదయం 9:50 గంటల సమయంలో సెన్సెక్స్ 516 పాయింట్ల నష్టంతోనూ, నిఫ్టీ 167 పాయింట్ల నష్టంతోనూ కొనసాగుతున్నాయి

మంగళవారం ముగింపు (82, 555)తో పోల్చుకుంటే దాదాపు 700 పాయింట్ల నష్టంతో 81, 845 వద్ద ప్రారంభమైన సెన్సెక్స్ ఆ తర్వాత కొద్దిగా కోలుకుంది. ప్రస్తుతం 9:50 గంటల సమయంలో 516 పాయింట్ల నష్టంతో 82, 038 వద్ద ట్రేడ్ అవుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా నష్టాల్లోనే కొనసాగుతోంది. దాదాపు 200 పాయింట్ల నష్టంతో రోజును ప్రారంభించింది. ప్రస్తుతం 9:50 గంటల సమయంలో 154 పాయింట్ల నష్టంతో 25, 124 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్‌లో ఆసియన్ పెయింట్స్, హిందుస్తాన్ పెట్రోలియం, మ్యాక్స్ ఫైనాన్సియల్స్, బలరామ్‌పూర్ చిన్నీ షేర్లు లాభాల్లో కొనసాగుతున్నాయి. ఎంఫసిస్, కోల్ ఇండియా, కోఫోర్జ్ లిమిటెడ్, ఎల్‌టీఐ మైండ్ ట్రీ నష్టాల్లో ఉన్నాయి. బీఎస్‌ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 150 పాయింట్ల నష్టంతో ట్రేడ్ అవుతోంది. బ్యాంక్ నిఫ్టీ 339 పాయింట్ల నష్టంతో కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 83.95గా ఉంది.

# లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ఐటి,పరిశ్రమలు , శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు**



**మంథని టౌన్ సెప్టెంబర్ 04 (నినాదం న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఐటీ ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ప్రజలకు సూచించారు బుధవారం మంథనిలో ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరినదీ నీటి ప్రవాహాన్నిపరిశీలించారు. అనంతరం ఆయనమాట్లాడుతూరాష్ట్రవ్యాప్తంగా వరుసగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎలాంటి ఆస్తి నష్టం, ప్రాణనష్టం జరగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని అదేశించారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం అధికారులు అప్రమత్తంగా ఉన్నారని,విపత్తును ఎదుర్కోవడానికి మా ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మన రాష్ట్రంలోని ప్రాజెక్టులకు వస్తున్న వరదను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ వరద నీటిని అధికారులు దిగువకు వదులుతున్నారని తెలిపారు.మంథని మున్సిప ల్ పరిధిలోకాలువలలోమురికినీరును చెత్తాచెదారాలను వెంటనే క్లీన్ చేయాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా మున్సిపల్ సిబ్బందిపనిచేయాలని ఆదేశించారు, గత కొద్ది రోజుల నుండి కురుస్తున్న వర్షాల వల్ల దోమల ద్వారా వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రభుత్వ వైద్యాధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఏ గ్రామంలో విష జ్వరాలు వస్తే ఆ గ్రామం లో వెంటనే హెల్త్ క్యాంపు నిర్వహించి వారికి వైద్య సదుపాయం అందించాలని, ప్రభుత్వాసుపత్రికి వచ్చే ప్రతి వ్యక్తికి మెరుగైన వైద్య సదుపాయాన్ని అంది ఇవ్వాలని జిల్లా వైద్య అధికారులను ఆదేశించారు.విపత్తును ఎదుర్కోవడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని,లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం వ్యవసాయ అధికారితో ఫోన్లో మాట్లాడుతూ ఎక్కడైతే పంట నష్టం జరిగిందో అధికారులు వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి ఆ రైతులకు ధైర్యం చెప్పి స్పష్టంగా పంట నష్టం ఎంత జరిగిందో చూడాలని అధికారులను ఆదేశించారు.ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రి.రమ సురేష్ రెడ్డి, కౌన్సిలర్ చొప్పకట్ల హనుమంత్ రావు, గుండా విజయలక్ష్మి పాపారావు అధికారులు,ప్రజాప్రతినిధులు ,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కాకతీయ పాఠశాలలో షి టీం అవగాహన సదస్సు...



**మంథని సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్):** మంథని పట్టణంలో కాకతీయ పాఠశాలలో బుధవారం అడ్మిన్ డిసిపి టి. రాజు ఆదేశాల మేరకు షీటీం అవగాహన సదస్సు నిర్వహించారు. అందులో భాగంగా షీ టీం ఇన్చార్జి ఏఎస్ఐ మల్లయ్య మాట్లాడుతూ మహిళల భద్రత ఆన్లైన్ మోసాల పై అంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా పనిచేస్తుందని ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు ,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు దయల్ చేయాలని తెలిపారు. ఆకతాయిల నుండి ఎలా రక్షణగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీం సిబ్బంది స్నేహలత , సురేష్ తో పాటు ప్రిన్సిపల్ ప్రదీప్ రెడ్డి ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## పోస్టెమెట్రిక్ ఉపకార వేతనాల కొరకు దరఖాస్తుల స్వీకరణ

**మంచిర్యాల టౌన్ సెప్టెంబర్ 04 (నినాదం న్యూస్):** 2024-25 సంవత్సరానికి గాను జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో విద్య అభ్యసిస్తున్న అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ అధికారి పోటు రవీందర్రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్.సి., ఎస్.టి., బి.సి., మైనార్టీ విద్యార్థినీ, విద్యార్థులు నూతన, రెన్యువల్ పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కొరకు డిసెంబర్ 31వ తేదీలోగా ఆన్లైన్లో https://telanganaepass.cgg.gov.in% వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. విద్యార్థుల బ్యాంక్ ఖాతా వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని,పెండింగ్ లో ఉన్న 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల పోస్ట్ మెట్రిక్ హార్డ్ కాపీలు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సమర్పించాలని, కళాశాలల యాజమాన్యాలు ఉపకార వేతనాల నమోదు ప్రక్రియ 100 శాతం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.


## ఎల్లమ్మ బోనం ఎత్తిన మనాలి రాజ్ ఠాకూర్..

**మక్కాన్సింగ్ సేవాసమితి అధ్యక్షురాలు మనల్ని రాజ్ ఠాగూర్.**



**గోదావరిఖని సెప్టెంబర్ 04 (నినాదం న్యూస్):** బుధవారం ఎల్లలపల్లి గ్రామం లో మానాలి ఠాగూర్ ఎల్లమ్మ బోనాల కార్యక్రమం లో పాల్గొని బోనం ఎత్తి అమ్మ వారికి బోనం సమర్పించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ అమ్మవారి దయవలన మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సి ఎమ్ రేవంత్ రెడ్డి, బట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు ల సహకారం తో 1800 పవర్ ప్లాంట్ సాదించుకోవడం జరిగింది. అలాగే అ అమ్మవారి దయవలన ఈ వర్ష కాలంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అ అమ్మవారి దయ ఉండాలని ప్రార్థించడం జరిగిందన్నారు. అలాగే ఈ గ్రామం లో ఎదైనా సమస్య ఉంటే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ దృష్టికి తీసుకు రావాలని కోరడం జరిగింది.

## ఏపీవోగా బాధ్యతలు చేపట్టిన లావణ్య



**మంథని సెప్టెంబర్ 4 ( నినాదం న్యూస్):** ముత్తారం మండలం ఉపాధి హామీ పథకం లో ఏపివో గా విధులు నిర్వహించిన దయమని మెటర్నటి సెలవులు తీసుకొని వెళ్లడంతో ఆమె స్థానంలో కమాన్ పూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఏ పి వో గా విధులు నిర్వహిస్తున్న ఎం. లావణ్యకు జిల్లా అధికారులు అదనపు బాధ్యతలు ఇవ్వడంతో బుధవారం ముత్తారం ఎంపీడీవో కార్యాలయంలో లావణ్య బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో కూలీలకు ప్రజలకు పనులు కల్పించి ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ కూలీల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తారని ఏపీవో తెలిపారు.

# అధిక వర్షాల నేపథ్యంలో ఉద్యానవన రైతులు జాగ్రత్తలు పాటించాలి

**జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి అనిత**



**మంచిర్యాల టౌన్ సెప్టెంబర్ 04 (నినాదం న్యూస్):** ప్రస్తుతం నెలకొన్న భారీ వర్షాల నేపథ్యంలో ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఉద్యానవన,పట్టు పరిశ్రమ శాఖ అధికారి కె. అనిత ఒక ప్రకటనలో తెలిపారు. గత వారం రోజుల నుండి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఉద్యానవన పంటలు దెబ్బతినకుండా రైతులు మెళకువలు పాటించాలని తెలిపారు. పొలంలో నిలిచిన నీటిని తీసివేసినట్లయితే పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. దెబ్బతిన్న మొక్కలు, వేరు మూల వ్యవస్థ కారణంగా మొక్కలు కోలుకోవడానికి పోషకాలను క్రమంగా ఎరువులతో భర్తీ చేయాలని, తెగుళ్ళు, పురుగుల ఉధృతిని గుర్తించి నివారణకు చర్యలు తీసుకోవాలని, ఆరోగ్యకరమైన మేరు వ్యవస్థ పున:రుద్ధరణకు కరిగే మేజర్, ట్రేస్ ఎలిమింట్స్ వినియోగించాలని తెలిపారు. ఉద్యానవన పంటల సాగులో భాగంగా నిలువ ఉన్న అదనపు నీటిని బయటకు పంపించాలని, మొక్కలు బలంగా పెరిగేందుకు పోషకాల మోతాదులు పెంచాలని, వ్యాధికారక శిలీంధ్రాలు, చీడల నివారణ చర్యలు చేపట్టాలని, లేత తోటల్లో చనిపోయిన మొక్కలను తిరిగి నాటుకోవాలని, నేలను వెంటనే సాగు చేసినట్లయితే చెట్లను లేపి మొదళ్ళ వద్దకు మట్టి సర్దుబాటు చేయాలని తెలిపారు. కూరగాయల సాగు చేసే రైతులు పడిపోయిన మొక్కలను నిలబెట్టి మట్టిని సర్దాలని, 0.3% 13-0-45 (నీటిలో కరిగే ఎరువు మల్టి-కె) / 2% యూరియా ద్రావణాన్ని 2-3 సార్లు వారం రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలని, క్రొత్తగా విత్తినట్లయితే వాటిని తీసివేసి మళ్ళీ నాటుకోవాలని, పంటకు ఆకుమచ్చ, కాయకుళ్ళు, బూజు తెగుళ్ళు ఉన్నట్లయితే లీటరు నీటికి 2.5 గ్రా? సాఫ్ మందును కిలిపి 2 సార్లు పిచికారీ చేయాలని, వేరుకుళ్ళు వచ్చినట్లయితే కాపర్ ఆక్సీ క్లోరైడ్ 30 గ్రా? / కర్బండిజమ్ 10 గ్రా?ల చొప్పున 10 లీటర్ల నీటిలో కలిపిన ద్రావణాన్ని మొక్కల మొదళ్ళలో పోయాలని తెలిపారు. మిరపపంట సాగు చేసే రైతులు మొక్కలు వెంటనే తేరుకోవడానికి లీటర్ నీటికి 10 గ్రా? యూరియా, 10 గ్రా? పంచదార కలిపిన ద్రావణాన్ని వారం రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలని, మొక్కలు వడబడి, తలలు వాలిస్తే లీటర్ నీటికి 5 గ్రా?ల మెగ్నీషియమ్ సల్ఫేట్, కాపుతో ఉండి, ఇనుప ధాతు లోపంతో పాలిపోతే 10 లీటర్ల నీటికి 50 గ్రా?ల అన్నభేధితో పాటు ఒక నిమ్మ చెక్క రసం కలిపి పిచికారీ చేయాలని, నేల ఆరిన తరువాత ఎకరానికి 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్,200 కిలోల వేపపిండి వేయాలని, పంటను బ్యాక్టీరియా ఆకుపచ్చ, కానోఫారా వంటి తెగుళ్ళు ఆశించే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యగా 10 లీటర్ల నీటికి 30గ్రా? కాపర్ ఆక్సీకోరైడ్, 1 గ్రా? స్ట్రెప్టోసైక్లిన్ మందులను కలిపి ద్రావణాన్ని పిచికారీ చేయాలని, పంటను ఆశించే వివిధ రకాల గొంగళి పురుగుల నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. / అసిఫేట్ 1.5 గ్రా? / నొవాల్యురాన్ 0.75 మి.లీ. వంటి కీటక నాశిని మందులను పిచికారీ చేయాలని తెలిపారు. పూల తోటల పెంపకంలో మొక్కలపై 2% యూరియా / 1% 13-0-45 (నీటిలో కరిగే ఎరువు మల్టి-కె)ను 2-3 సార్లు పిచికారీ చేయాలని, ఆకు మచ్చ తెగులు నివారణకు ప్రొపికొనజోల్ 1 మి.లీ. ఒక లీటర్ నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో 1-2 సార్లు పిచికారీ చేయాలని తెలిపారు. రైతులు ఉద్యానవన పంటల పున: రుద్ధరణకు తగు చర్యలు తీసుకొని పంటలు కాపాడుకొని అధిక దిగుబడి సాధించి లబ్ధి పొందాలని ఆకాంక్షించారు.

# కాంగ్రెస్ గూటికి బిఆర్ఎస్ మాజీ ఎంపీపీ



**కాగజ్ నగర్ సెప్టెంబర్ 4 (నినాదంన్యూస్ ):** కొమరం భీం జిల్లా సిర్పూర్ నియోజకవర్గం బెజ్జూర్ మండల్ బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపీపీ మంజుల సదాశివం బుధవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ శ్రీ దండే విట్టల్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్ సిరిపురం మంజుల సదాశివం గారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమం లో టీపీసీసీ మెంబర్ అర్షాద్ హుస్సేన్ మాజీ కౌన్సర్లు శరత్ ముదిరాజ్ షబ్బీర్ దాహేగం మాజీ జడ్పీటీసీ పిల్లల తిరుపతి,బెజ్జూర్ మండల కాంగ్రెస్ నాయకులు నాహిర్ అలి ,ఉమ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పండుగలను మత సామరస్యంతో శాంతియుతంగా జరుపుకోవాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్**



**మంచిర్యాల సెప్టెంబర్ 04 (నినాదం న్యూస్):** జిల్లాలో పండుగలను మతాలకు అతీతంగా శాంతియుత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ. భాస్కర్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు వి. రాములు, హరికృష్ణ, మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లి ఎ.సి.పి.లతో కలిసి పోలీసు, ఆబ్కారీ, వైద్య-ఆరోగ్య, మున్సిపల్, రవాణా, అగ్నిమాపక, విద్యుత్, నీటిపారుదల, రోడ్లు-భవనాలు శాఖల అధికారులు, శాంతి కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వినాయక చవితి, మిలాద్-ఉన్-నబి పండుగలను మతసామరస్యంతో శాంతియుతంగా నిర్వహించుకోవాలని తెలిపారు. శాంతి కమిటీ సభ్యులు పండుగలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండాప్రశాంత వాతావరణంలో ఘనంగా జరుపుకునే విధంగా సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. వినాయక చవితి మండపాల వద్ద నిర్వాహకులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, మున్సిపల్, పంచాయతీ, సంబంధిత అధికారులు ప్రతి రోజు పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండే విధంగా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వినాయక మండపాల నిర్వాహకులు మండపాల నిర్వహణ కొరకు విద్యుత్,పోలీసు, మున్సిపల్ /మండల ప్రజాపరిషత్, సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరిగా పొందాలని తెలిపారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వినాయక నిమజ్జనం రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ అధికారులు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. నిమజ్జనం రోజున వాహనాలు నడిచే రూట్ మ్యాప్ అన్ని శాఖల అధికారులకు అందించడం జరుగుతుందని, ఈ రూట్లలో అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వైద్య-ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. డి.సి.పి. మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో కోల్బెల్ట్ ప్రాంతం ఉన్నందున ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు ఉన్నారని, వినాయక నిమజ్జనం, మిలాద్-ఉన్-నబి పండుగలు జరుగ నున్న సందర్భంలో ప్రజలకు ఎలాం టి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని, రెవెన్యూ, సంబంధిత శాఖల సమన్వ యంతో గ్రామానికి ఒక కానిస్టేబుల్ కానిస్టేబుల్ని నియమించడం జరుగుతుందని తెలిపారు. నిమజ్జనం రోజున లక్షెట్టిపేట మండలంలోని రాయపట్నం, మంచిర్యాల పట్టణంలోని గౌతమేశ్వర ఆలయం, సీతారాంపల్లి, ఇందారం, చెన్నూర్లోని పెద్ద చెరువు, బెల్లంపల్లిలోని పోచమ్మగుడి ప్రాంతాలలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో చెన్నూర్లోని పెద్ద చెరువు, బెల్లంపల్లిలోని పోచమ్మగుడి, లక్షెట్టిపేట లోని రాయపట్నం ప్రాంతాలలో క్రేన్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. వినాయక మండపాల నిర్వాహకులు తమ మండపాల వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్లో అందించాలని, ఆన్లైన్లో పోర్టల్ ద్వారా కూడా సమాచారం అందించవచ్చని తెలిపారు. వినాయక నిమజ్జనం రోజున పోలీసు శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నిమజ్జనం ప్రాంతంలో ఎలాంటి ఘటనలు జరగకుండా గజ ఈతగాళ్ళను అందు బాటులో ఉంచాలని అన్నారు. నిమజ్జనం రోజున మద్యం దుకాణాలు మూసి ఉంచాలని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ కనెక్షన్ కొరకు వర్షాకాలం అయినందున ఐ.ఎస్.ఐ. మార్క్ ఉన్న నాణ్యత గల వైర్లను వినియోగించాలని, రహదారులను గుంతలను పూడ్చే విధంగా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సోషల్ మీడియాలో బూటకపు వార్తలు వచ్చినటయితే వాటి వివరాలతో పోలీస్టేషన్లో ఫిర్యాదు చేయాలని, తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గెస్ట్ లెక్చరర్ పోస్టుల దరఖాస్తు గడువు పొడిగింపు...



**బెల్లంపల్లి సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్):** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులలో గెస్ట్ లెక్చరర్లుగా పని చేసేందుకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఈనెల 6వరకు పొడిగించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.భారీ వర్షాల నేపథ్యంలో గడువు తేదీ పెంచినట్లు తెలిపారు. ఇంగ్లీష్1,కామర్స్ టాక్సేషన్1, బాటనీ1, జువాలజీ2 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.సంబంధిత సబ్జెక్టులో పీజీలో 55శాతం మార్కులతో పాటు పి హెచ్ డి అర్హత కలిగిన వారికి ప్రథమ ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు.పి హెచ్ డి లేనిపక్షంలో నెట్ అర్హత కలవారికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.డిగ్రీ స్థాయిలో బోధన అనుభవానికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొ న్నారు. విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో పాఠాలు బోధించవలసి ఉంటుందని ఆయన తెలిపారు.6వరకు దరఖాస్తులు,9న డెమో ఇం టర్వ్యూలు ఉంటాయని తెలిపారు. అభ్య ర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 99592 39975 సెల్ నెంబర్ లో సంప్రదించాలని కోరారు.

## ప్రతి విషయంలో విద్యార్థులకు అవగాహన కల్పించాలి

**ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి...**



**సుల్తానాబాద్ సెప్టెంబర్ 04 (నినాదం న్యూస్):** నిత్యం సమాజంలో జరిగే ప్రతి విషయం పట్ల వి ద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేం దర్ రెడ్డి స్పష్టం చేశారు.బుధవారం సుల్తానాబా ద్ లోని ఆల్ఫోర్స్ పాఠశాలలో కూరగాయల మా ర్కెట్లో జరిగే క్రయ విక్రయాలపై ప్రీప్రైమరి స్కూల్ విద్యార్థులచే ప్రత్యక్షంగా నిర్వహించి అవగాహ న కల్పించారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ చిన్నతనం నుంచే సరైన పోషకా హారం గురించి అవగాహన కల్పిస్తే వారి ఆహార పుఅలవాట్లలోమార్పులు తేవచ్చనన్నారు.మా ర్కెట్లో జరిగే క్రయ విక్రయాల్లో తాజా పండ్లు,కూరగాయలు,పూలు అమ్మడం కొనడం ఎలా జరు గుతుందనే విషయాలపై విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించడం జరిగిం దన్నారు డిజిటలైజేషన్ ఎ లా వినియోగించాలో విద్యార్థులకు తెలిపినట్లు తెలిపారు పాఠశాల ఆవరణ లో రైతుబజార్ ఏర్పాటు చేయడంతో విద్యార్థులు రైతు వేషధారణలతో కూరగాయలు పండ్లు అమ్మిన విధానం పలువురిని ఆకర్షిం చింది కార్యక్రమంలో ప్రిన్సిపా ల్ తో పాటు అధ్యాపక బృందం విద్యార్థిని, వి ద్యార్థులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలకు భూమి కేటాయించాలని వినతి



**మంథని సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్): మంథని** గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల (బాలికలు) స్వంత భవన నిర్మాణం కోసం భూమి కేటాయించాలని బుధవారం ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీదర్ బాబు కు గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ తొడెంగా శ్రీలత వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీలత మాట్లాడుతూ ఈ కళాశాల ఏర్పాటు చేసి ఐదు సంవత్సరాలు పూర్తి కాగా అద్దె భవనంలోనే నడుస్తుందని, అద్దె భవనంలో గదులు సరి పోకపోవడంతో గత సంవత్సరం రెండు గ్రూపులు వెనుకకు వెళ్లాయని ప్రస్తుతానికి రెండు గ్రూపులతో కళాశాల నడుస్తుందని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులకు ఆటస్థలం, భవనానికి కాంపౌండ్ వాల్ లేక పోవడంతో కొన్ని ఇబ్బందులకు గురవుతున్నామని మంత్రి వివరించారు. గెస్ట్ అధ్యాపకులకు పే స్కేల్ లేక టైం స్కేల్ ఇప్పించాలని కోరారు.అతిథి అధ్యాపకులు రెగ్యులర్ తో సమానంగా డ్యూటీ చేస్తున్నామని ఉద్యోగ భద్రత కల్పించాలని అప్పటివరకు 12 నెలల జీతం ఇప్పించాలని మంత్రికి విన్నవించారు.అనంతరం మంత్రి శ్రీదర్బాబును ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో అధ్యాపకులు భూషణవేణి శైలజ, అడేపు అరుణశ్రీ ,ఇస్లావత్ అనిత ఉన్నారు.

## గోదాములను సందర్శించిన అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్



**సుల్తానాబాద్, సెప్టెంబర్ 04 (నినాదం న్యూస్):** కరీంనగర్ పెగ్ గోదాములను పెద్దపల్లి జిల్లా లేబ ర్ ఆఫీసర్ హేమలత సందర్శించారు.బుధవా రం సుల్తానాబాద్ మండల కేం ద్రంలోని రైల్వే స్టే షన్ ఆనుకొని ఉన్న పెగ్గు గోదాములలో జరుగు తున్న ప్రమాదాలపై లేబర్ ఆఫీసర్ విచారణ జరి పారు.ఈ సందర్భంగా కరీంనగర్ పెగ్గు గోదాము లలో పని చేస్తున్న బీహార్ కార్మికులకు ఎటు వం టి సౌకర్యాలు కల్పిస్తున్నారని కార్మికులను అడి గి తెలుసుకున్నారు. అ నంతరం గోదాం ఇన్చార్జితో బీహార్ కార్మికులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించి,భద్రత నివ్వాలని సూచించారు.ఈ కార్యక్రమం లో కార్మికసంఘం నాయకులు బొంకూ రి కైలాసం తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డు లేని రుణమాఫీ కానీ రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలి.

**వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అంజలి**



**మంథని టౌన్ సెప్టెంబర్ 04 (నినాదం న్యూస్):** రేషన్ కార్డు లేని రుణమాఫీ కానీ రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని మంథని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అంజలి తెలిపారు.ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ రేషన్ కార్డు లేని రుణమాఫీ కానీ రైతులు వ్యవసాయ శాఖలో కుటుంబ నిర్ధారణ కోసం తమ కుటుంబ సభ్యులతో కలిసి గ్రూప్ ఫోటో దిగాలని కుటుంబ సభ్యులందరి ఆధార్ కార్డు, పాన్ కార్డు, భూమి యొక్క పట్టాదారు పాస్ పుస్తకాల జిరాక్స్ తీసుకొని వ్యవసా శాఖ కార్యాలయంలో కుటుంబ సభ్యులతో ఫోటో దిగి సంబంధిత యాప్ లో అప్లోడ్ చేస్తారని ఆమె తెలిపారు. కావున రేషన్ కార్డు లేని రుణమాఫీ కానీ రైతులుఈఅవకాశాన్నివినియోగించుకోవాలని కోరారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం....



**సుల్తానాబాద్, సెప్టెంబర్ 04 (నినాదం న్యూస్):** వాసవి క్లబ్ సుల్తానాబాద్ వారి ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం నిర్వహించారు. బుధవారం మండ ల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్ట ర్ రమాదేవి సహాయంతో రక్తదాన శిబిరా న్ని నిర్వహించగావాసవి క్లబ్ సభ్యులురక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎల్లంకి రాజన్న మాట్లాడుతూ ఈ నెలలో వాసవి క్లబ్ వ్యవస్థాపకులు కల్వకుంట్ల చంద్రసేనగుప్త,జన్మదిన సందర్భంగా వాసవి వారోత్సవాలు,ఒకటో తారీకు నుండి ఏడో తారీఖు వరకు కార్యక్ర మాలు నిర్వహిస్తామని,దానిలో భాగంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించామని తెలిపారు.అధ్యక్షులు ఆకటపల్లి సత్యనారాయ ణ మాట్లాడుతూ రక్తదాన శిబిరంలో పాల్గొన్న ర క్తాన్ని ఇచ్చిన క్లబ్ సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపినారు.ఈ కార్యక్రమంలో జోన్ చైర్ పర్సన్ సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శి కొమురవెల్లి రమేష్ తో పాటు కొమరవెల్లి భాస్క ర్,నార్ల శ్రీనివాస్,చకిలం వెంకటేశ్వర్లు,చిట్టిమల్ల వినయ్ కుమార్,మాదురి సందీప్,ఎల్లంకి హర్షి త్ సాయి,బుద్ధ మాణిక్యేశ్వర్, మాదురి పృధ్వి, ఆవుల శివ కృష్ణ,చకిలం అరుణ్ కుమార్,పిట్టల ప్రణయ్,వినయ్ కుమార్,ముత్యాల ప్రదీప్,ఏకు ల సాయి దయాకర్,మాధురి అనిల్కుమార్, న గునూరి చందు,నార్ల సోమేష్,రాసూరి అరుణ్ కుమార్,ఐతు శ్రీనివాస్,రేగుల కుమార్ఎం మల్లి కార్జున్, కంకణాల రాజు,వంశీకృష్ణ,ప్రసాద్, శేఖ ర్, పాండు,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్05( నినాదం):** జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నిర్వహించే వేడుకలలో 42 మంది ఉపాధ్యాయులను సన్మానియానున్నట్లు పెద్దపల్లి డీఈవో మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారంతా ఉదయం 11 గంటలకు కల్లెక్టరేట్ లోని సమావేశ మందిరానికి రావాలని కోరారు.

గురువారం | తెలంగాణ
5- 9- 2024
www.ninadam.co.in

# త్వరలో మళ్లీ వస్తా... తొగర్రాయి గ్రామాన్ని యధాస్థితికి తీసుకురావాలి



- సంబంధిత అధికారులకు ఆదేశాలు
- వరద ప్రభావిత గ్రామం తొగర్రాయిలో పర్యటించిన కలెక్టర్
- క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్న కలెక్టర్
- కలెక్టర్ ఆదేశాలతో హుటాహుటిన తాత్కాలిక బ్రిడ్జి ఏర్పాటు
- వైద్య సిబ్బంది గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరు ఆరోగ్య పరీక్షలు చేపట్టాలి
- సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్

**కోదాడ, సెప్టెంబర్ 4 (నినాదం న్యూస్):** వరదల వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరికి నష్ట పరిహారం అందిస్తామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవార కోదాడ మండలం తొగర్రాయి గ్రామం లో వరద వల్ల తెగిపోయిన రోడ్డు, బ్రిడ్జి, వరద ప్రభావం చూపిన ప్రతి వీధిలో లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ రెండు గంటల పాటు పర్యటించి ప్రతి ఒక్కరి సమస్య విని వారందిరికి సహాయం చేస్తానని కలెక్టర్ అన్నారు.ముందుగా తెగిపోయిన బ్రిడ్జి ని పరిశీలించి నేటి ఉదయం కల్లా తాత్కాలింగా మరమ్మతులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తేవాలని పంచాయతీ రాజ్ ఇంజనీర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో హుటాహుటిన అధికారులు రాత్రి 8 గంటలలోపే తాత్కాలిక బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకొచ్చారు.పూర్తిగా గాని, పాక్షికంగా దెబ్బ తిన్న ఇండ్లను, వరద నీరు ఇంటిలోకి వచ్చిన సామాగ్రి కొట్టుకోనిపోయిన ఇండ్లను, నీట మునిగిన పంటలు,చనిపోయిన పశువులు, మేకలు,గొర్రెలను లెక్కించుటకు గురువారం ఉదయం 9 గంటల నుండి హౌజ్ టూ హౌజ్ సర్వే జరరుగుతుందని అక్కడికి వచ్చిన అధికారులకు మీకు కలిగిన నష్టం ను తెలియపర్చాలని అధికారులు వాటిని రాసుకొని నివేదిక అందించగానే ప్రతి ఒక్కరికి నష్ట పరిహారం అందిస్తామని కలెక్టర్ తెలిపారు.ఇలాంటి విపత్కర పరిస్థితుల నుండి తెరుకోటానికి అధికారులకు గ్రామ ప్రజలు, యువత సహకారం అందించాలని కలెక్టర్ అన్నారు.వరద వచ్చిన అర్ధరాత్రి రోజు నుండి తొగర్రాయి గ్రామం గురించి ప్రత్యేకంగా అధికారులను అడిగి తెలుసుకుంటునానని కలెక్టర్ అన్నారు.వరద ప్రభావం తో కూలిన మిర్యాల బాబు, రామిశెట్టి శ్రీను, నామాల సాయిలు ఇండ్లను అలాగే వరద ప్రభావంకి గురైన దేవాలయ ఆవరణంను కలెక్టర్ పరిశీలించారు.అధికారులు అందరు సమన్వయం చేసుకుంటూ గతంలో గ్రామం ఎలా ఉండేదో అలా చేయాలని మళ్ళీ త్వరలో వస్తానని అధికారులను ఆదేశించారు.



**పారిశుద్ధ్యం పై దృష్టి సారించాలి...** గ్రామంలో పంచాయతీ సిబ్బంది 25 మందితో కలిసి,ప్రతి ఇంటికి బ్లీచింగ్ పౌడర్ వెదజల్లాలని,యాంటీ లార్వా స్ప్రే చేయాలని, వీధులను పరిశుభ్రం చేయాలని, మురికి నీటిలో దోమలు లేకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ ద్వారా త్రాగునీరు రేపటి లోపు క్లోరినేషన్ పరీక్ష చేసి ప్రజలకు త్రాగునీరు అందించాలని మిషన్ భగీరథ ఎఈ ని ఆదేశించారు.వైద్య సిబ్బంది టీమ్ లుగా ఏర్పడి ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు చేపట్టాలని అలాగే 15 రోజులలో 3 సార్లు ఫీవర్ సర్వే చేయాలని, సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డియంహెచ్ఓని ఆదేశించారు. అలాగే గ్రామం లో పల్లె దావఖానా త్వరగా పూర్తి చేసుందుకు కాంట్రాక్టర్ తో మాట్లాడాలని ఎ ఈ ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ సూర్యానా రాయణ, డిప్యూటీ డియమ్హెచ్ఓ నిరంజన్, ఎంపిఓ పాండురంగ, కార్యదర్శి అభిలాష్ ఎ యన్ యమ్ లు అంగన్వాడీ టీచర్లు,ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు, యువత, తదితరులు పాల్గొన్నారు.



# క్లిక్.. క్లిక్

## కొమ్మ కొమ్మకో అద్భుతం పిచ్చుకల నైపుణ్యం





కాటారం మండల కేంద్రానికి సమీపంలోని పొలాలలో చెట్టు కొమ్మలకు పిచ్చుకల కళా నైపుణ్యం కనువిందు చేస్తూ కనిపిస్తుంది. కొమ్మ కొమ్మకో పిచ్చుకల అద్భుత కళా నైపుణ్యంతో నిర్మించుకోవడం, కనిపించింది. (పిచ్చుకలు పొలాలలోని గడ్డిని, ఈత చెట్టు ఆకులను కలుపుకొని తన ముక్కుతో ఎంతో కష్టపడి నిర్మించుకోవడం చూస్తుంటే కష్టపడడం ఎలానో పిచ్చుకలను చూసి నేర్చుకోవాలి. అనేలా ఉన్నట్టుంది. ఒకే చెట్టుకు పదుల సంఖ్యలో పిచ్చుకల గూళ్ళు కనిపించడంతో అందరిని కనువిందు చేస్తున్నాయి. – తోట కోటేశ్వర్ పటేల్ కాటారం. నినాదం న్యూస్

# త్రాగు నీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టండి

## ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం



**వరంగల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 04 (నినాదం న్యూస్):** త్రాగు నీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని నగర మేయర్ గుండు సుధారాణి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం బల్దియా ప్రధానకార్యాలయంలో ఇంజ నీరింగ్ అధికారులతో భారివర్షాల నేపధ్యంలో శుద్ధ తాగునీటి సరఫరా, పైపులైన్ల లీకేజీల అరికట్టడం, రహదా రులపై గుంతల, వీధి దీపాలు, వాహనాల మరమ్మతులపై మేయర్ సమీక్షించి సమర్థవంతంగా నిర్వహించుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వర్షాకాలం నేపద్యంలో నీటి సరఫరా పైప్ లైన్ లో లీకేజీ లు ఏర్పడి త్రాగు నీరు కలుషితం అయ్యే అవకాశం ఉంటుందని, ముందస్తుగా అట్టి అంశాల పై దృష్టి సారించి లీకేజీలు అరికట్టి నివారించాలని, ప్రధాన రహదారుల తో పాటు గల్లి లలో ఉండే గుంతలను యుద్ధ ప్రాతిపదికన పూడ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధిం చిన వాహనాలు మరమ్మత్తుల నిమిత్తం షెడ్డు కు వచ్చే క్రమం లో జాప్యం వహించకుండ వెంటనే మరమ్మతులు పూర్తి అయ్యేలా చూడాలని ఇందు కోసం ప్రత్యేకం గా వాహనాల మానిటరింగ్ సిస్టం ఏర్పాటు చేసి మరమత్తుల్లో జాప్యాన్ని నివారించాలని అన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి దెబ్బతిన్న వీధి దీపాల కు వెంటనే మరమత్తులు చేపట్టి వెలిగేలా చూడాలని, వీధి దీపాలు లేని ప్రాంతాల్లో ఏర్పాటు కు గల అవకాశాలను పరిశీలించాలని మేయర్ అన్నారు.ఈ కార్య క్రమంలో ఎస్ఈలు ప్రవీణ్ చంద్ర, రాజయ్య, ఈ ఈ మహేం దర్, డిఈ శివానంద్, ఏఈలు సంతోష్, ఫణి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలు - పిల్లల నేస్తాలు కావాలి

**కోదాడ, సెప్టెంబర్ 4( నినాదం న్యూస్):** తేజ విద్యాలయలో నెలకొల్పిన నూతన గ్రంథాలయ ప్రాంగణాన్ని కోదాడలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ జాస్తి సుబ్బారావు ప్రారంభించారు. పాఠశాల 12000 పుస్తకాలతో నెలకొల్పిన నూతన గ్రంథాలయ గదిని తిలకించి తర్వాత విద్యార్థులు మరియు అధ్యాపకులతో ఏర్పాటు చేసిన సమావేశంను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలు మాత్రమే కాకుండా సమాజాన్ని చదువేందుకు అవసరమైన గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు, చరిత్ర , సంస్కృతి పుస్తకాలు, శాస్త్రవేత్తల మరియు శాస్త్ర విజ్ఞానం సంబంధించిన పుస్తకాలు, సాహిత్యం మరియు కథల పుస్తకాలు వంటి వివిధ రకాల పుస్తకాలను ప్రతి పాఠశాల ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా తెలిపారు. విద్యార్థులకు గ్రంథాలయ పుస్తకాలు చదివేందుకు పాఠశాల సమయంలోనే వీలు కల్పించాలని కోరడం జరిగింది. ప్రపంచాన్ని గురించి తెలుసుకోవడానికి అతి దగ్గర దారి పుస్తకాలు మాత్రమేనని తెలియపరిచాడు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు సోమిరెడ్డి , వైస్ ప్రిన్సిపల్ వేణుగోపాల్ రావు , అకడమిక్ కో ఆర్డినేటర్ జోస్ సామ్యూల్ పాల్గొన్నారు.



# హేమ కమిటీ రిపోర్ట్ గురించి అడక్కండి

## హీరోయిన్ ఆండ్రియా జెర్మయ్య




మలయాళ చిత్రపరిశ్రమలో అవకాశాల పేరుతో 'అడ్జెస్ట్‌మెంట్'పై జస్టిస్ హేమ కమిషన్ ఇచ్చిన నివేదికపై తనను ప్రశ్నించవద్దంటూ సింగర్, హీరోయిన్ ఆండ్రియా జెర్మయ్య స్పష్టంచేశారు. తిరువాన్మియూరులో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఆమె పాల్గొంది. ఈ సందర్భంగా ఆమెను మీడియా జస్టిస్ హేమ కమిషన్‌పై ప్రశ్నలు సంధించింది. దీనికి ఆండ్రియా జెర్మయ్య సమాధానమిస్తూ, చిత్రపరిశ్రమలో మహిళల లైంగిక వేధింపులపై జస్టిస్ హేమ కమిషన్ ఇచ్చిన నివేదికపై నో కామెంట్స్, ఈ అంశంలో ఎలాంటి ప్రశ్నలు అడగొద్దు' అంటూ కోరారు. నిజానికి ప్రతి అంశంలో ఎంతో బోల్డ్‌గా స్పందించే నటి ఆండ్రియా.. జస్టిస్ హేమ కమిషన్‌పై మాట్లాడేందుకు నిరాకరించడం ఇపుడు చర్చనీయాంశంగా మారింది.

## శరవేగంగా గుడ్ బ్యాడ్ అగ్లీ మూవీ షూటింగ్

కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ తో పాన్ ఇండియా ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ రూపొందిస్తున్న బి÷-గగెస్ట్ ఎంటర్‌టైనర్ చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఈ తెలుగు-తమిళ ద్విభాషా చిత్రానికి అధిక్ రవిచంద్రన్ రచన, దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ మూవీ హైదరాబాద్‌లో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన లుక్ పోస్టర్స్ మంచి స్పందనను రాబట్టుకోగా తాజాగా ఇంట్రెస్టింగ్ అప్డేట్ బయటకు వచ్చింది. అయితే.. ఈసినిమాలో ఇప్పటివరకు హీరోయిన్‌ను ఇంకా ఎంపిక చేయలేదు. ఈ నేపథ్యంలో తాజాగా ఈ మూవీ కోసం త్రిష(÷సతిబరజీ)ను ఎంపిక చేశారు. ఈ మేరకు ఒప్పంద పత్రాలపై సంతకాలు కూడా పూర్తి చేశారు. త్వరలోనే అజిత్ - త్రిష కాంబినేషన్‌లో తెరకెక్కించే సన్నివేశాలను షూట్ చేసేలా దర్శకుడు ఆధిక్ రవిచంద్రన్ ప్లాన్ చేస్తున్నారు.

# దేవర నుంచి కొత్త పోస్టర్ విడుదల



ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'దేవర' జనతా గ్యారేజ్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా రానుండటంతో భారీ అంచనాలు ఉన్నాయి. ఇక రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ నటుడు సైఫ్ అలీఖాన్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాను సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. విడుదల తేదీ దగ్గర పడటంతో వరుస అప్‌డేట్‌లను ప్రకటిస్తుంది చిత్రబృందం. ఇప్పటికే మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ ఫియర్ సాంగ్‌తో పాటు సెకండ్ సింగిల్ చుట్టమల్లే పాటల ను విడుదల చేయగా.. ఈ రెండు పాటలు యూట్యూబ్‌లో దూసుకుపో తున్నాయి. అయితే తాజాగా ఈ మూవీ నుంచి థర్డ్ సింగిల్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మూవీ నుంచి థర్డ్ సింగిల్ 'దావుడి' సాంగ్‌ను ఈరోజు సాయంత్రం 5.04 గంటలకు విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది.

# సుహాస్ జనక అయితే గనక విడుదల వాయిదా..



టాలీవుడ్ యాక్టర్ సుహాస్ కలర్ ఫొటో, అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్, ప్రసన్న వదనం సినిమాలతో హీరోగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు సుహాస్. ఈ టాలెంటెడ్ యాక్టర్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం 'జనక అయితే గనక' సందీప్‌రెడ్డి బండ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని దిల్‌రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌పై హర్షిత్‌రెడ్డి, హన్షిత నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 7న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుందని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారని తెలిసిందే. అయితే ఎవరూ ఊహించని విధంగా సినిమాను వాయిదా వేస్తున్నట్టు తెలియజేశారు. తెలుగు రాష్ట్రాల్లో వరదలతో జనజీవనం స్తంభించిన నేపథ్యంలో వాయిదా వేయాలని నిర్ణయించాం. ఇప్పుడు వర్షాల మోత. తర్వాత నవ్వుల మోతతో కలుద్దాం. త్వరలోనే కొత్త తేదీతో నవ్వుల వినోదాన్ని అందించేందుకు మీ ముందుకొస్తామని తెలియజేశారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో సంగీత్, వేన్నెల కిషోర్, రాజేంద్ర ప్రసాద్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా ఫస్ట్ లుక్ విడుదల చేయగా సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఇక టీజర్‌లో .. ఆ ఒక్క డెసిషన్ నా లైఫ్‌ను మార్చేసింది. నేను ఒకవేళ తండ్రిని అయితే నా వైఫ్‌ను సిటీలో ఉన్న బెస్ట్ ఆస్పత్రిలో చూపించాలి. నా పిల్లలను బెస్ట్ స్కూల్‌లో చదివించాలి, బెస్ట్ కాలేజిలో చదివించాలి. వాళ్లకి బెస్ట్ లైఫ్ ఇవ్వాలి. బెస్ట్ ఇవ్వలేనప్పుడు పిల్లలను కనకుడదు అంటూసాగుతున్న డైలాగ్స్ మిడిల్ క్లాస్ ఫ్యామిలీ చుట్టూ తిరిగే కథాంశంతో సినిమా ఉండబోతున్నట్టు క్లారిటీ ఇచ్చేశాయి.

సినిమా నినాదం

# సినీ తారల విరాళాలు

## అత్యధికంగా రెండుకోట్లు ప్రకటించిన ప్రభాస్



రెండు తెలుగు రాష్ట్రాల్లో వరదల నేపథ్యంలో తెలుగు సినీ పరిశ్రమ నుంచి విరాళాలు వెల్లువెత్తు తున్నాయి. జూ. ఎన్టీఆర్‌తో ప్రారంభమైన ఈ సాయం కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే మంగళవారం రోజున జూ. ఎన్టీఆర్, సూపర్ స్టార్ మహేశ్ బాబు, పవన్ కల్యాణ్, బాలకృష్ణ, విశ్వక్ సేన్, సిద్దు జొన్నలగడ్డ, కథానాయిక అనన్య నాగళ్ల, యాంకర్ స్రవంతి, దర్శకుడు త్రివిక్రమ్, నిర్మాతలు రాధాకృష్ణ, వంశీ, ఆయ్ మూవీ టీం తమవంతు సాయంగా ప్రకటించిన ఇషయం తెలిసిందే. తాజాగా బుధవారం మెగాస్టార్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెరో రూ.50 లక్షల సాయం ప్రకటించగా, అదేబాటలో అల్లు అర్జున్ కూడా తనవంతుగా రెండు రాష్ట్రాలకు రూ.50 లక్షల చొప్పున సాయం ప్రకటించారు. ఇక పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ కోటి చొప్పున రెండు కోట్ల విరాళం ప్రకటించి తన సేవాగుణాన్ని మరో సారి చాటుకున్నాడు. అదే విధంగా కమెడియన్ అలీ ఆంధ్రప్రదేశ్‌కు రూ.3 లక్షలు, తెలంగాణకు రూ.3 లక్షల చొప్పున రూ.6లక్షల విరాళం ప్రకటించారు. కోట శ్రీనివాసరావు లక్ష సాయం ప్రకటించారు.



# దర్శకుడు హరీశ్ శంకర్ పెద్దమనసు

## మిస్టర్ బచ్చన్ ఫెయిల్యూర్‌తో 2కోట్లు వాపస్



మాస్ మహారాజ రవితేజ, దర్శకుడు హరీశ్ శంకర్ కాంబోలో వచ్చిన తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్' 'నామ్ తో సునా హోగా' అనేది ఈ సినిమా ట్యాగ్ లైన్. షాక్, మిరపకాయ్ వంటి సూపర్ హిట్ సిని మాల తర్వాత రవితేజ, హరీశ్ శంకర్ కాంబోలో ఈ సినిమా రావడంతో మూవీపై భారీ అంచనాలు ఉన్న విషయం తెలిసిందే. అయితే ఈ అంచనాలను అందు కోలేక పోయింది ఈ చిత్రం. ఇండిపెండెన్స్ కానుకగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాగా.. ఫస్ట్ షో నుంచే మిక్స్‌డ్ టాక్ రావడంతో బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అందుకోవడమే కాకుండా.. సోషల్ మీడి యాలో విపరీతంగా ట్రోల్ అయ్యింది ఈ చిత్రం. అయితే ఈ సినిమాకు వచ్చిన నష్టాల వలన దర్శకుడు హరీశ్ శంకర్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలస్తుంది. ఈ మూవీ వలన నష్టపోయిన నిర్మాతకు హరీశ్ శంకర్ తన రెమ్యూనరేషన్ నుంచి రూ.2 కోట్లు వెనక్కి ఇచ్చినట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాకు హరీశ్ శంకర్ దర్శకుడిగా రూ.10 కోట్ల రెమ్యూనరేషన్ తీసుకున్నట్లు సమా చారం. ఇందులో నుంచే నిర్మాతకు రూ.2 కోట్లు తిరిగి ఇచ్చినట్లు టాక్. అయితే హరీశ్ శంకర్ చేసిన పనికి రవితేజ అభిమానులతో పాటు నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మించగా.. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించింది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S). Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288, CELL : +91 80742 79741